శుక్రవారం
11 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 293

www.vijayakranthinews.com

విజయక్రాంతి

నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



లేడీ ఓరియంటెడ్ పాత్రలో కీర్తిసురేష్ 10

ముగిసిన నామినేషన్ల

పరిశీలన

- సర్పంచులకు 27,940 నామినేషన్లు
- వార్డు మెంబర్లకు 97,690 నామినేషన్లు



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తొలి విడత నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం దాకా అయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. తొలి విడతలో 4479 సర్పంచ్ స్థానాలకు 27,940 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 39,822 వార్డులకుగాను 97,690 మంది నామినేషన్లు చేశారు. ఈ నెల 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది.

రాష్ట్రంలో 12,732 గ్రామ పంచాయతీలు, 1,13,170 వార్డులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. 19 గ్రామ పంచాయతీల్లో పలు కారణాలతో పాటు కోర్టుల్లో కేసులుండడం వల్ల ఎన్నికలు జరగడం లేదు. మరో 15 గ్రామ పంచాయతీల్లో పదవీ కాలం పూర్తి కావడానికి ఇంకా సమయం ఉంది. ఈ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,13, 190 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. రెండో విడతలో 4137 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ పంచాయతీలకు శనివారం నుంచినుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది.

అలోక్ వర్మపై వేటు

- సీబీఐ చీఫ్ పదవి నుంచి తొలగింపు
- ప్రధాని మోడీ నేతృత్వంలో అత్యున్నత స్థాయి కమిటీ నిర్ణయం
- అవినీతి ఆరోపణలపై ప్రాథమిక సాక్ష్యాధారాలున్నట్లు గుర్తింపు
- తాత్కాలిక చీఫ్‌గా నాగేశ్వరరావుకు మళ్లీ బాధ్యతలు
- అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా అలోక్ వర్మ నియామకం



న్యూఢిల్లీ : సీబీఐ చీఫ్ అలోక్ వర్మకు మరో భారీ షాక్ తగిలింది. ఆయనను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగిస్తూ సెలక్షన్ ప్యానెల్ నిర్ణయం తీసుకుంది. 24 గంటల్లో రెండుసార్లు సమావేశమైన హైపవర్డ్ కమిటీ గురువారం అలోక్ వర్మపై వేటు వేసింది. ప్రధాని కార్యాలయంలో సుమారు రెండు గంటల పాటు సమావేశం జరిగిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నట్లు కమిటీ గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో అలోక్ తొలగింపునకు మోదీ, జస్టిస్ సిక్రీ మొగ్గు చూపగా ఖర్గే మాత్రం వ్యతిరేకించారు. అయితే ఆయనపై అవినీతి ఆరోపణలు, విధి నిర్వహణ సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల చివరకు సీబీఐ చీఫ్ పదవి నుంచి ఆయన్ను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈనేపథ్యంలో అలోక్ వర్మను అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా కేంద్రం నియమించింది. అలాగే వారం రోజుల్లోగా కొత్త డైరెక్టర్ నియామకాన్ని చేపట్టనుంది. కాగా సీబీఐ చీఫ్ విషయంలో ఇటువంటి నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారి కాగా, సీబీఐ డైరెక్టర్‌గా ఆయనను కొనసాగిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత విధుల్లో చేరిన మరుసటి రోజే అలోక్ వర్మను ఆ పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రధని మోదీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ ప్రకటించడం గమనార్హం. కాగా తాత్కాలిక చీఫ్‌గా నాగేశ్వర రావుకు కేంద్రం బాధ్యతలు అప్పగించింది.

సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ, సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాల మధ్య అవినీతి ఆరోపణల వివాదాలు రచ్చకెక్కడంతో గత ఏడాది అక్టోబర్ 23న కేంద్రం వారిద్దరినీ బలవంతపు సెలవుపై పంపింది. అయితే దీన్ని సవాల్ చేస్తూ అలోక్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించగా విచారణ జరిపిన ధర్మాసనం సీబీఐ డైరెక్టర్ తాత్కాలిక సస్పెన్షన్ లేదా తొలగింపునకు సంబంధించి చట్టంలో ఎలాంటి నిబంధనలు లేవని పేర్కొంది. ఈనేపథ్యంలో అలోక్ వర్మను బలవంతంగా సెలవుపై పంపడం కుదరదని స్పష్టం చేస్తూ ఆ ఉత్తర్వులను కొట్టివేసింది. ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. అయితే అలోక్ వర్మ వ్యవహారంలో నిర్ణయాలను ప్రధాని, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా ఆయన నామినీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేతతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీ అనుమతితో మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ కమిటీ వారంలోగా నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీం కోర్టు అలోక్ వర్మ అప్పటి వరకు ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోరాదని వెల్లడించింది. అయితే ఈ తీర్పు చెప్పిన సుప్రీంకోర్టు ధర్మాసనంలో భాగమైన ప్రధాన న్యాయమూర్తి జస్టి రంజన్ గొగొయ్ ఈ కమిటీ నుంచి బుధవారం తప్పుకున్నారు. తన స్థానంలో జస్టిస్ ఏకే సిక్రీని ప్రతిపాదించారు. మరోవైపు సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో బుధవారమే సీబీఐ డైరెక్టర్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టిన అలోక్ వర్మకు ఆ సంతోషం ఒక్క రోజుకే పరిమితమైంది. ఆయన భవిష్యత్ నిర్ణయించే అత్యున్నత స్థాయి కమిటీ బుధవారం నుంచి గురువారం వరకు రెండు సార్లు సమావేశమైంది. (తరువాయి 4లో)

అలోక్‌పై వేటు.. అన్ని ప్రశ్నలకు సమాధానం.. రఫేల్: రాహుల్



మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై మరోసారి విమర్శల దాడికి దిగారు. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ వ్యవహారంపై ట్విటర్ వేదికగా ప్రధాని మోదీని ప్రశ్నించారు. అంతేగాక.. ఈ ప్రశ్నలకు జవాబు కూడా ఆయనే చెప్పారు. అన్నింటికీ సమాధానం రఫేల్ ఒప్పందమే అని రాహుల్ దుయ్యబట్టారు. '1వ ప్రశ్న: సీబీఐ చీఫ్‌ను తొలగించేందుకు ప్రధాని మోదీ ఎందుకు అంత తొందరపడ్డారు? 2వ ప్రశ్న: సెలక్షన్ కమిటీ ముందు తన కేసును ఉంచేందుకు సీబీఐ చీఫ్‌కు మోదీ ఎందుకు అనుమతివ్వలేదు? ఈ ప్రశ్నలన్నింటికి జవాబు.. 'రఫేల్'.. అని రాహుల్ ట్వీట్ చేశారు.

అయోధ్య కేసు

మళ్లీ వాయిదా

- ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం నుంచి తప్పుకున్న ఒక జడ్జి
- జస్టిస్ లలిత్ తప్పుకోవడంతో విచారణ ఈ నెల 29కి వాయిదా
- త్వరలోనే మరో కొత్త ధర్మాసనం ఏర్పాటు



విజయక్రాంతి, ఢిల్లీ: అయోధ్య కేసు విచారణ మళ్లీ వాయిదా పడింది. రామ జన్మభూమి బాబ్రీ మసీదు స్థల వివాదంపై కేసు విచారణను సుప్రీంకోర్టు మరో సారి వాయిదా వేసింది. ఈ కేసులో వాదనలు వినేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ ధర్మాసనం గురువారం విచారణ ప్రారంభించింది. అయితే బెంచ్లో ఒకరైన జస్టిస్ యు.లలిత్ విచారణ నుంచి తప్పుకోవడంతో తదుపరి విచారణను జనవరి 29కి వాయిదా వేసింది. ఈ కేసులో కొత్త రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుచేస్తామని న్యాయస్థానం వెల్లడించింది.

ధర్మాసనం నుంచి జస్టిస్ లలిత్ తప్పుకోవడంతో విచారణ వాయిదా వేస్తున్నట్టు సుప్రీం కోర్టు తెలిపింది. ఈ కేసు విచారణకు గతంలో ఐదుగురు సభ్యుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. అయితే బెంచ్ నుంచి జస్టిస్ లిలిత్ తప్పుకోవడంతో మరొకరిని నియమించాల్సి ఉంది. దీంతో కేసు విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు. బెంచ్ నుంచి తను తప్పుకోవడానికి గల కారణాలను జస్టిస్ లలిత్ బయటపెట్టలేదు. ఇదిలా ఉంటే గతంలో కల్యాణ్ సింగ్ తరపున జస్టిస్ లలిత్ వాదనలు వినిపించారు. దీనిపై న్యాయవాది రాజీవ్ ధావన్ అభ్యంతరం తెలపడంతో.. బెంచ్ నుంచి జస్టిస్ లలిత్ తప్పుకున్నట్టు సమాచారం. బెంచ్లో చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ బాబ్ డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ చంద్ర చూడ్ ఉన్నారు. అయోధ్య కేసులో జనవరి 29 నుంచి కొత్త ధర్మాసనం వాదనలు వింటుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

కోటాపై సుప్రీంలో

పిటిషన్

- ఈబీసీలకు 10%తో మొత్తం రిజర్వేషన్లు 59.5% అవుతుందని ఫిర్యాదు
- రిజర్వేషన్లు 50% దాటరాదని గతంలో సుప్రీం ఇచ్చిన తీర్పు



విజయక్రాంతి, ఢిల్లీ: దేశంలోని అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10శాతం రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించాయి. ఉభయ సభల ఆమోదం పొందడంతో ఇక రాష్ట్రపతి సంతకం పెడితే ఈ బిల్లు చట్ట రూపం దాలుస్తుంది. అయితే ఈ బిల్లును సవాల్ చేస్తూ యూత్ ఫర్ ఈక్విటీ అనే సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ బిల్లు వల్ల దేశంలో రిజర్వేషన్లు 50శాతం దాటుతున్నాయని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషన్లో పేర్కొన్నారు. విద్య, ఉద్యోగాల్లో (తరువాయి 4లో)

జీఎస్‌టీ భారీ సడలింపులు

- జీఎస్‌టీ మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు
- చిన్న వ్యాపారులకు జీఎస్‌టీ నుంచి ఊరట
- వార్షిక టర్నోవర్ పరిమితి రూ. 20 లక్షల నుంచి 40 లక్షలకు పెంపు
- కాంపోజిషన్ పరిమితి స్థాయి కోటి నుంచి కోటిన్నరకు పెంపు
- సేవల రంగానికి కూడా కంపోజిషన్ స్కీం విస్తరిస్తాం: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



ఢిల్లీ: వస్తు, సేవల పన్ను విధానం (జీఎస్టీ) పై వ్యాపారవర్గాల నుంచి వస్తున్న ఆందోళనలు, అభ్యంతరాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దేశంలోని చిన్న వ్యాపారులకు కేంద్ర సర్కార్ శుభ వార్త చెప్పింది. చిన్న వ్యాపారులకు వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) నుంచి ఊరట లభించే విధంగా కీలక మార్పులను ప్రతిపాదించింది. జీఎస్‌టీ పరిధిలోకి వచ్చే వ్యాపార పరిమితిని (వార్షికి టర్నోవర్) పెంచుతున్నట్లు కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. గురవారం జీఎస్టీ 32 వ సమావేశం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో చిన్న , మధ్యతరగతి వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు లాభం చేకూరే విధంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

చిన్న వ్యాపారుల వార్షిక పరిమితి రెట్టింపు

ప్రస్తుతం చిన్న వ్యాపారులు, పరిశ్రమల నిర్వాహకుల పన్ను పరిమితిని రూ.20లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. కాంపొజిషన్ పథకం కింద ఉండే పరిమితిని కోటి రూపాయలు నుంచి రూ. 1.5కోట్లకు పెంచుతున్నట్లు తెలిపారు. జీఎస్‌టీ మండలి సభ్యులు పాల్గొన్న 32వ సమావేశంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారులకు లాభం చేకూరే విధంగా మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'కాంపొజిషన్ పథకం కింద వ్యాపారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి పన్నులు చెల్లించాలి. కానీ, రిటర్న్ మాత్రం ఏడాదికి ఒకసారి మాత్రమే దాఖలు చేయాలి. కాంపొజిషన్ పథకం పరిమితిని కోటి రూపాయలు నుంచి రూ.1.5కోట్లకు పెంచాం. ఏప్రిల్ 1, 2019 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. చిన్న, మధ్య తరహా వ్యాపారుల పన్ను విధింపు పరిమితిని రూ.20లక్షల వార్షిక టర్నోవర్‌ను రూ.40లక్షల వరకు పెంచాం. దీనివల్ల ఖజానాకు వచ్చే దాదాపు 5,200 కోట్ల ఆదాయం వచ్చే అవకాశాలు లేవు. రెండేళ్ల వరకు అంతర్ రాష్ట్ర అమ్మకాలపై ఒక శాతం సెస్ విధించేందుకు కేరళకు అనుమతి ఇస్తున్నాం' అని జైట్లీ వెల్లడించారు. సేవల రంగానికి కూడా కంపోజిషన్ స్కీంను విస్తరిస్తున్నట్లు జైట్లీ తెలిపారు. జీఎస్టీపై వ్యాపార, పారిశ్రామికవర్గాల నుంచి గతంలో పలు అభ్యంతరాలు వచ్చాయి. స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ రంగాల్లో పన్ను చెల్లింపుదారులు తమపై ఎక్కువ భారం పడుతోందని అభ్యంతరాలు వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందే. జీఎస్టీపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలపై పన్ను భారం పడకుండా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ జీఎస్‌టీని సరళతరం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే గత నెలలో జరిగిన సమావేశంలో 23 వస్తువులను తక్కువ పన్ను శ్లాబులోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించే విధంగా సినిమా టికెట్లు, 32 అంగుళాల వరకు టీవీలు, పవర్ బ్యాంకులు, డిజిటల్ కెమెరాలు, వీడియో గేమ్స్‌పై పన్ను భారం తగ్గించింది. ఈ తగ్గించిన ధరలు జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి.

సైన్యంలోకి..

అలాంటి వారిని తీసుకోం

- మేం అంత ఆధునికంగా, పాశ్చాత్యంగా ఉండలేం
- సుప్రీం తీర్పు మాకు వర్తించదు
- స్వలింగ సంపర్కులపై ఆర్మీ చీఫ్ రావత్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : స్వలింగ సంపర్కులను సైన్యంలోకి అంగీకరించబోమని భారత ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ స్పష్టం చేశారు. వార్షిక ప్రెస్ కాన్ఫరెన్స్ సందర్భంగా ఈ అంశంపై మీడియా ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. భారత సైన్యం సంప్రదాయబద్ధంగాను, కొన్ని నిబంధనలకు లోబడి ఉంటు ఒద న్నారు. అందుకే ఆర్మీలోకి స్వలింగ సంపర్కులను అనుమతించమన్నారు. స్వలింగ సంపర్కం నేరం కాదని గత ఏడాది సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయితే ఇది భారత ఆర్మీకి ఇది వర్తించదని రావత్ తెలిపారు. చట్టం కంటే ఆర్మీ ఎక్కువేం కాదన్న ఆయ న, రాజ్యాంగం తమకు కొంత స్వేచ్ఛ ఇచ్చిందన్నారు. ఎల్జీబీటీ విషయాలు ఆర్మీలో ఆమోద యో గ్యం కాదన్న ఆయన ఆర్మీ యాక్ట్‌లోని పలు సెక్షన్లలో ఇది ఉందని తెలిపారు. అందుకే ఆర్మీలో మా త్రం ఇలాంటివి కుదరవన్నారు. 'మేము అంత ఆధునికంగా, పాశ్చాత్యంగా ఉండలేం. ఎల్జీబీటీ అంశం సైన్యంలో అంగీకారయోగ్యం కాదు' అని రావత్ తన అభిప్రాయాన్ని చెప్పారు. ఆర్మీ చట్టం ప్రకారమే తాము ఇంకా నడుచుకుంటున్నామన్నారు. సైన్యంలోకి వచ్చేవారు మాత్రం కొన్ని హక్కులను, సంతో షాలను వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అంతేకాక ఎల్జీబీటీ వంటి విషయాల్ని జనాలు ఎలా స్వీకరిస్తారు.. అసలు ఇలాంటి వాటిని అంగీకరిస్తారా.. లేదా అనేది భవిష్యత్తులో తెలుస్తుందన్నారు. హోమో సెక్సువాలిటీ నేరం కాదని గత ఏడాది సెప్టెంబరులో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు చెప్పింది. సమానత్వ హక్కును ఉల్లంఘి స్తోందంటూ 158 ఏళ్ల నాటి చట్టాన్ని సర్వోన్నత న్యా యస్థానం కొట్టివేసింది. ఈ సందర్భంగాను ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ స్పందించారు. ఆర్మీ విషయంలో ఇలాంటివి క్షమార్హమైనవి కావంటూ నాడు సైన్యాన్ని హెచ్చరించినట్లుగా వార్తలొచ్చాయి. మరోవైపు ఆర్మీ విషయంలో ఈ తీర్పును అమలు చేయడంపై ఆలోచించాల్సిన అవసరం ఉందని మిలిటరీ న్యాయ నిపు ణులు కూడా అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతానికి ఆర్మీ నిబంధనల్లో ఎలాంటి మార్పు ఉండదని తాజాగా భారత సైన్యాధక్ష్యుడు రావత్ స్పష్టం చేశారు.

దిమాక్ ఖరాబ్



ఆదాయం పెంపుపై ఆర్టీసీ దృష్టి

- షాపులపై 'అద్దె' భారం
- త్వరితగతిన మల్టీప్లెక్స్‌ల నిర్మాణం
- త్వరలో కొత్త బస్సుల కొనుగోలు
- ఎలక్ట్రికల్ బస్సులకూ ఆర్డర్
- సమీక్ష నిర్వహించిన ఇన్‌చార్జ్ ఎండీ సునీల్‌శర్మ

విజయక్రాంతి, హైదరాబాద్: దీర్ఘకాలిక నష్టాలను అధిగమించడానికి ఆర్టీసీ కసరత్తు తీవ్రతరం చేసింది. బస్టాండ్లలోని వాణిజ్య సముదాయాల ద్వారా మరింత ఆదాయం రాబట్టుకోవాలని సూత్రప్రాయ నిర్ణయానికొచ్చింది. బస్టాండ్లలోని షాపుల అద్దె పెంచాలని నిర్ణయానికొచ్చింది. మల్టీప్లెక్స్‌ల నిర్మాణం త్వరగా పూర్తి చేయడం ద్వారా ఆదాయం పెంచుకోవాలన్న నిర్ణయానికి వచ్చింది. నష్టాలను అధిగమించడానికి ఆర్టీసీ ఇన్‌ఛార్జ్ ఎండీ సునీల్‌శర్మ (తరువాయి 4లో)



పొత్తులపై మాట్లాడిన మోదీ

- తమిళనాడులో కలిసివచ్చే వారితో కలుస్తామన్న ప్రధాని

ఢిల్లీ: మరో మూడు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజకీయ పొత్తుల గురించి తన మనసులో మాట బయటపెట్టారు. తమిళనాడులో కొన్ని పార్టీలతో పొత్తు కుదుర్చుకోవడానికి బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. అందరి కోసం తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. బీజేపీకి సొంతంగా ఆధిక్యత వచ్చినపుడు కూడా మిత్ర పక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికే ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. పాత మిత్రులను గుర్తుంచుకుంటామని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల కోసం తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. తమిళనాడులోని అన్నాడీఎంకే పార్టీతో పొత్తు కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు ఆసక్తికరంగా కనిపిస్తున్నాయి. తమిళనాడులోని ఐదు జిల్లాల బీజేపీ కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు..

ఆక్వా రంగానికి రూ.6700 కోట్లు

- దేశవ్యాప్తంగా ఆక్వా ఉత్పత్తుల అభివృద్ధికి కృషి
- జాతీయ ఫిషరీస్ చీఫ్ ఎగ్జికూటివ్ రాణి కుముదిని



విజయక్రాంతి, హైదరాబాద్: దేశంలో జల ఉత్పత్తులు అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని జాతీయ చేపల అభివృద్ధి బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఐ. రాణి కుముదిని తెలియజేశారు. ఇప్పటికే రూ. 6700 కోట్లు వ్యయంతో చేపలు, రొయ్యలు, ఇతర ఆక్వా ఉత్పత్తులను పెంచడానికి కృషి చేస్తోందని, ఈ రంగాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో ఆక్వా రైతులను అనేక రాయితీలు, ఇతర సౌకర్యాలు కలుగ జేస్తున్నామని ఆమె వివరించారు. ఈనెల 31, వచ్చే నెల 1వ తేదీన హైదరాబాద్‌లో జరిగే ఆక్వా ఉత్పత్తుల అంతర్జాతీయ సదస్సుకు గురువారం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె ప్రసంగిస్తూ ప్రపంచ బ్యాంకు సహాయంతో రూ. 12,000 కోట్లు వ్యయంతో దేశవ్యాప్తంగా ఆక్వారంగం అభివృద్ధికి అనేక కార్యక్రమాలు రూపొందించామని త్వరలోనే ఈ పథకం ప్రారంభం అవుతుందని వివరించారు. ఆక్వా ఉత్పత్తులను ఉత్పత్తి చేసే రైతులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని, ఈ ఉత్పత్తుల అమ్మకాలు, వాడకం ఎగుమతి, (తరువాయి 4లో)





శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః


శ్రీ విళంబి నామ సంవత్సరం
దక్షిణాయణం
హేమంత ఋతువు
పుష్య మాసం

సూర్యోదయం	: ఉ. 06:48
సూర్యాస్తమయం	: సా. 05:59
పక్షము	: శుక్ల పక్షం
తిధి	: పంచమి 19.54
నక్షత్రం	: పూర్వాభాద్ర మొత్తం
యోగం	: పరిఘ రాత్రి మొత్తం
కరణం	: భాలవ 19:54 కౌలవ రాత్రి మొత్తం
రాహుకాలం	: ప. 11:01, 12:23
యమగండం	: మ. 3:09, ఉ. 04:32
వర్జ్యం	: ఉ. 01:03, మ. 02:51
అమృతకాలం	: రా. 11:47 : తె. 01:34

సూక్తి సుధ

ప్రశాంతత నాలుక నాలుగు రకాల మాటలకు సంబంధించినది, కళ్లకు, చెవులకు, మనసుకు, ప్రశాంతత. వీటిలో మానసిక ప్రశాంతత గొప్పది.

-రమణ మహర్షి



తిరుప్పావై పాశురం-27



'నిన్నాశ్రయించని వారిని జయించు స్వభావం కల శ్రీకృష్ణా! నిన్ను స్తుతించి వ్రతసాధనమగు పరయను వాద్యమును పొంది తరువాత పొందు సన్మానము లోకులు పొగడునట్లు ఉండవలయును.

**కూడారై వెల్లుమ్ శీర్ గోవిన్దా! ఉన్దన్నై
ప్పాడి ప్పఱైకొణ్డు యామ్ పెఱు శమ్మానమ్
నాడు పుగళుమ్ పరిశినాల్ నన్దాక
చ్చూడగమే తోళ్‌వళైయే తోదే శెవిప్పూవే
పాదగమే, యెన్ఱనైయ పల్‌కలనుమ్
యామణివోమ్
ఆడై యుడుప్పోమ్ అదన్‌పిన్నే పాల్‌శోఱు
మూడ నెయ్ పెయ్దు ముళఙ్గై వళివార
క్కూడి యిరున్దు కుళిర్‌న్దేలో రెమ్బావాయ్.**

చేతులకు గాజులు మొదలగునవి, బాహువులకు దండికడియాలు, చెవులకు క్రింది భాగాన్న దాల్చెడి దుద్దులు, పై భాగాన్న దాల్చెడి చెవిపూలు, కాలియందెలు మొదలగు అనేకాభరణాలను దాల్చవలయును. తరువాత మంచి వస్త్రాలను ధరించాలి. ఆ తరువా పాలు అన్నం మునుగునట్లు నేయిపోసి ఆ మధుర పదార్థంను మోచేతి నుండి కారుచుండగా నీతో కలిసి కూర్చొని చల్లగా హాయిగా ఆరగించవలయును' ఇది భావం.

గాజులు – అనగా చక్రాంకణనకు(సమాశ్రయణము) ముందాచార్యులు చేతికి కట్టు కంకణం.

భుజాభరణాలు – అనగా తప్తచక్రాంకణం. అనగా బాహువులు ఆచార్యులుంచెడు శంఖచక్ర ముద్రలు.

ఇక దుద్దులు – ఇవి ఎనిమిది రాళ్ళ దుద్దులు అనగా అష్టాక్షరీ మంత్రం. ఇది మండలాకారంగా ఉండును.

ఇక చెవిపూలు – ఇవి రెండుగా ఉండును. అనగా ద్వయ మంత్రం.

పాదాభరణం – అనగా నాలుగు చరణాలతో ఉండు చర మంత్రం.

ఇట్లు తిరుమంత్రం, ద్వయమంత్రం, చరమ మంత్రం అను మూడు మంత్రాలతో జ్ఞానవైరాగ్యాలు బోధించబడును.

తిరుమంత్రం ఆత్మస్వరూప యాధాత్మ్య జ్ఞానంను తెలుపును. ద్వయం ఉత్తర ఖండంలో చెప్పిన కైంకర్యానికి ముందు వాడే భక్తి ప్రధానమైంది గాన భక్తిపరం.

చరమ శ్లోకం త్యాజ్యాంశాన్ని వైరాగ్యాన్ని ముఖ్యంగా బోధించును. కావున వైరాగ్యపరము ఆభరణాలు. అనేకం అనగా జ్ఞానభక్తి విరాగాలు కూడా విషయపరంగా అనేకాలుగా ఉండును.

జ్ఞానం – అర్థపంచక విషయాలు 5 విధాలు
భక్తి – భగవద్భాగవతాచార్య పరంగా 3 విధాలు
వైరాగ్యం – ధారాపుత్ర విత్తాది భేదాలచే పలు విధాలు.
వస్త్రాలనగా – శేషత్వ జ్ఞానం

అలంకారానికి వస్త్రం ముఖ్యమగునట్లు ఆత్మాలంకారానికి శేషత్వమే ముఖ్యం కదా.

పాలు అన్నం – అనగా కైంకర్యం. అన్నిటిలో పరమాన్నం భోగ్యతాధిక్యం కలదు. కావున అన్నిటిలో అధిక భోగ్యత కలది. కావున కైంకర్యం చెప్పనగును.

నేయి అనగా పారతంత్ర్యం

కైంకర్యాన్ని పారతంత్ర్యంతో కనపడకుండా కప్పి వేయాలి.

పాలు అనగా భగవత్కళ్యాణ గుణాలు.

అన్నం అనగా కళ్యాణగుణ పరిపూర్ణమగు భగవత్తత్వం.

నేయి అనగా భగవంతుని ఎడబాటును క్షణం కూడా సహించలేని ప్రీతి.

ఈ ప్రీతి మోచేతుల మీది నుండి కారుచుండాలి అంటే, చేయు కర్మను సూచించును. కర్మల ద్వారా భగవంతునిపై ప్రీతి కనబడుతుందని అభిప్రాయం.

ఒకరితో ఒకరు కలిసి కూర్చుని భుజించాలి అనగా భాగవత గోష్ఠిని కోరుచున్నారని అభిప్రాయం. మరొక అర్థం.

హస్తాభరణం – అంజలి

భుజాభరణాలు – ఫలసంగ కర్తృత్వ బుద్ధి లేకుండట.

ఫలాన్ని విడుచుట అనగా ఫలాశను విడిచి కర్తవ్య బుద్ధితో భగవదారాధన భగవంతునకు ప్రీతికరంగా చేయుట.

సంగంను విడుచుట అనగా భగవంతుడే తనకు శేషభూతుడనగు నా చేత తానిచ్చిన ఇంద్రియాలతో తన పనిని చేయించు కొనుచున్నాడను జ్ఞానం.


కర్తృత్వంను విడుచుట అనగా కర్మకాతడే కర్త, నేను కాదని తెలియుట.

కర్ణాభరణం అనగా – భగవద్భాగవత ప్రసంగాలను వినుట. అనగా భక్తియోగమని అభిప్రాయం.

చెవిపూలు – ద్వయమంత్రం

పాదాభరణాలు – భగవద్భాగవతాచార్య సన్నిధికి నడిచి వెళ్ళుటయే.

జిహ్వకు – కీర్తించుట
మనుసునకు – ధ్యానించుట
చేతులకు – అర్పించుట
నేత్రాలకు – దర్శించుట
ముక్కునకు – తులసీ ఆఘ్రాణం



ఈ పాశురంలో గోపికలు కోరింది బ్రహ్మానుభవమే.

'సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మణా విపశ్చితా'

అనుశ్రుతి వాక్యం బోధించు బ్రహ్మానుభవంనే ఇక్కడ గోపికలు కోరారని తెలియాలి.

డా. బాలుశర్మ పన్నాల

మనుజుడు తనకున్నదాంట్లో సంతుష్టుడవ్వాలి

చాణక్యం



శ్లో॥ సంతోషస్త్రిషు కర్తవ్యః స్వదారే భోజనే దనే।
త్రిషు చైవ న కర్తవ్యోఽధ్యయనే తపదానయోః॥

తన భార్య, భోజనం, ధనం అను నీ మూడు విషయాల్లో సంతుష్టుడు కావలెను. కాని అధ్యయనం, తపస్సు, దానం అను మూడు విషయాల్లో సంతుష్టుడు కారాదని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలియచేస్తున్నారు. అంటే తన భార్య యందే సంతోషి కావాలెను. ఇంకా మనుధర్మశాస్తంలో ఈ విధంగా తెలియపరుస్తు న్నారు. ఈ ప్రపంచంలో పరస్త్రీ సంబంధంతో సమానమైంది, మనుష్యునకు ఆయువును క్షీణింపచేసేది మరొకటి లేదు. అందుచే దాన్ని అన్ని విధాల విడువవలెను. ఇంకా విదుర నీతిలో ఇలా చెబు తున్నారు. పృథ్వీనందు ధాన్యం, యవలు, బంగారం, పశువులు, స్త్రీలు ఎన్నికలవో అవి అన్నియూ ఒక్క మనుష్యునకు చాలవు, అన్న ఆలో చనలుగల మనుజుడు మోహంలో చిక్కుకోడు. భోజన విషయంలో సంతోషించాలి. హితం, మిత మైన భోజనం చేయాలి. ఇతరుల భోజనానికి ఆశపడ రాదు. మను మహర్షి ఈ విధంగా తెలుపుతున్నారు. అధిక భోజనం ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. ఆయువును క్షీణింప చేస్తుంది. దుఃఖాన్ని కలిగిస్తుంది. ఇహపర లోకాలను నష్టపరుస్తుంది. అందుచే అధిక భోజనం చేయరాదు.ఇంకా ఈ విధంగా చెబుతున్నారు. తన కంటే తక్కువవారిని చూచుచు అభివృద్ధికి పాటుపడని వానికి గౌరవం పెరగదు. కాని తనకంటె అధికులైన ధనవంతులను చూచి తాను తక్కువని తలంచువాడు దరిద్రుడే అవుతాడు. ధనం విష యంలో తనకంటె తక్కువ వారిని చూచి తాను ధనవంతుడనని సంతోషించాలి. అధ్యయన విషయంలో సంతోషింపరాదు.

– యామిజాల సుబ్రహ్మణ్యం

'దృగ్గణిత పంచాంగం'

వేద విజ్ఞానం

భాగం-76

(1874లో రవి బింబమునకు అడ్డంగా శుక్ర సంచారం సంభవిం చింది. దీని గణిత వివరాలు రఘునాథ ఆచార్య అనేక భాషలలో ముద్రించడం జరిగింది. దీని ఆంగ్ల కరపత్రంలో ఈ గణితం చూపిం చారు. ఈ రచయిత (దీక్షిత్) ఆ కరపత్రం ఆధారంగాను, వివిధ వార్తాపత్రికలలో లభించిన వివరాలను మద్రాసు నుండి పండిత నటేశశాస్త్రి పంపిన విషయాల ఆధారంగాను, రఘునాథ ఆచార్యుని వివరాలను ఇక్కడ పొందుపరచడం సాధ్యమయింది.)

నాటికల్ ఆల్మనాక్ సాయంతో "దృగ్గణిత పంచాంగ ము"ను ముద్రణ చేయడం ప్రారంభించాడు. అతని మరణం తర్వాత వారి ఇద్దరు కుమారులచే ముద్రించబడిన శక.1811 నాటి పంచాంగాన్ని ఈ రచయిత (దీక్షిత్) చూశారు. ఇందు వీరు 22డిగ్రీల 5' అయనాంశంను, సూర్యసిద్ధాంతం ప్రకారం సంవత్సర ప్రమాణాన్ని తీసుకోవడం జరిగింది. వీరి పెద్ద కుమారుడు పి. రాఘ వాచార్య సుమారు శక. 1811లో మరణించాడు. వీరి చిన్న కుమారుడు, బావమరిది, మద్రాస్ వేధశాల మొదటి సహాయకుడు అయిన పి. రాఘవాచార్య, వీరిద్దరి సహకారంతో పంచాంగం ముద్రించబడుతోంది.

కృష్ణశాస్త్రిగాడ్బోలే (జనన–శక.1753)

చిత్పావన బ్రాహ్మణుడు, హిరణ్యకేశీ శాఖ, కౌశిక గోత్రానికి చెందిన వాడు కృష్ణశాస్త్రి గాడ్బోలే. శక. 1753 శ్రావణ బహుళ దశమి నాడు (1 సెప్టెంబర్, 1831) వాయిలో జన్మించాడు. పూనాలో మరాఠీ భాషలో ప్రాథమిక విద్యను, తరువాత అక్కడే సంస్కృత పాఠశాల లోను, పూనా కళాశాలలోను విద్యను అభ్యసించాడు. చిన్నతనం నుండి గణితంపై విశేషమైన మక్కువ కలిగి ఉండేవాడు. సంస కృత కళాశాలలో శంకర్‌జోషిగారి సాన్నిధ్యంలో ఖగోళశాస్త్రమును అభ్యసించాడు. 1855 అక్టోబర్ 19 నాడు పూనా కాలేజీవారి నార్మల్ పాఠ శాలలో గణిత ఉపాధ్యాయునిగా చేరాడు. కొంతకాలం గణితాధ్యాపకునిగా పనిచేశాడు. తర్వాత, 1864–65 ప్రాంతంలో బొంబాయిలోని కొలాబా వేధశాలలో చేరారు. 1865లో పూనా ట్రైనింగ్ కాలేజీలో ఉద్యోగంలో చేరారు. 1865లో పూనా ట్రైనింగ్ కాలేజీలో ఉద్యోగంలో చేరారు. 1866లో సింద్‌లోని హైద్రా బాద్ ఉన్నత పాఠశాలకు, 1867లో కరాచీ ఉన్నత పాఠశాలకు బదిలీ అ య్యారు. 1872లో పూనా ఉన్నత పాఠశాలలో సహాయ ఉపాధ్యా యునిగాను, కొన్ని రోజులు బొంబాయిలో ఎల్ఫెన్‌స్టోన్ ఉన్నత పాఠశాలలో పనిచేశారు. తర్వాత, ఇదే సంవత్సరంలో ఆంగ్లో – మరాఠీ పాఠశాల పహనావాడి, బొంబాయిలో ప్రధాన ఉపాధ్యా యునిగా 1882 వరకు పనిచేశారు. పదవీ విరమణ తర్వాత స్వస్థానమైన పూనాకు చేరారు. 1886 నవంబర్ 22న స్వర్గస్థుడ య్యాడు. సింద్‌లో ఉన్న కాలంలో సింధిభాషను, పర్షియన్ భాషలను నేర్చుకున్నారు. 1871–79 ప్రాంతంలో బొంబాయి విశ్వ విద్యాలయం, సింధిభాష పరీక్షకునిగా పనిచేశారు.

డా|| రేమెళ్ల అవధానులు



దేహం.. జీవుడు.. ఆత్మ...



సీతారాములిద్దరూ హనుమంతుల వారికి తమ నిజ తత్వాన్ని సవిస్తరంగా తెలియజేసిన తరువాత శ్రీరాముడు పరీ క్షగా 'హనుమా! చెప్పు, నీవెవరు?' అని అడిగాడు. అప్పుడు హనుమంతుడు 'దేహబుద్ధ్యా తవ దాసోహం, జీవబుద్ధ్యా త్వదంశకః, ఆత్మబుద్ధ్యా త్వమేవాహం' అని సమాధానం చెప్పాడు. అసలు ఈ మూడూ ఏమిటో, వాటి మధ్య వ్యత్యాసం ఏమిటో చూద్దాం.

పంచభూతాలతో నిర్మితమై మన కంటికి కని పిస్తూ, ఇతర జ్ఞానేంద్రియాలతో అను భూతమవుతూ ఉండే ఈ స్థూల శరీరమే దేహం. ఇక మన ఆలోచనలు, సంకల్పాలు, జ్ఞాపకాలు, కోరికలు, కర్మలు, వాసనల సమాహారమే జీవుడు. విశ్వవ్యాపకమై తాను కదలక సమస్త సృష్టిని కదిలిస్తూ ఉండే చైతన్యమే ఆత్మ.

సాధారణంగా మనం 'నేను' అని ఈ దేహాన్ని సూచిస్తూ మాట్లాడుతాం. అదే దేహ బుద్ధి. ఈ దేహం నేను అనుకున్నంత కాలం మనం దాసులమే, రాముడు ప్రభువే. అలా కాక, ఈ దేహంలో సూక్ష్మరూపంలో ఉంటూ ఈ దేహం చేసే క్రియలన్నింటికీ ఆధారభూతమై వాటిని కర్మలుగా వాసనలుగా అంటించుకునే జీవుడు నేను అని భావించినపుడు ఆ జీవుడు దేవుడినుంచే వచ్చాడు కాబట్టి 'నేను నీ అంశను' అనగలుగుతాం. ఆ జీవబుద్ధిని కూడా దాటి సర్వే సర్వత్రా నిండియున్న ఆత్మను నేను అని గుర్తించిననాడు 'త్వమేవాహం' అనే స్థితికి చేరుతాం.

ఇంకా కొంచెం లోతుగా వెళితే మనం ఒక బంగారం కొట్టుకి వెళ్ళాం అనుకోండి. అక్కడున్న నగ లన్నీ చూస్తూ అందులో ఏవి కంటికి అందంగా కనిపిస్తున్నాయి, ఏవి మన వొంటిపై నప్పుతాయి అని చూస్తాం. అదే ఆ కొట్టు యజమాని మాత్రం ఏ నగ ఎంత బరు వుంది, అది అమ్మితే తనకు ఎంత లాభం వస్తుంది అని మాత్రమే చూస్తాడు. అతనికి నగల అందం గురించి పట్టదు. అతనికి ఆ నగలన్నీ బంగారంలాగే కనిపిస్తాయి. ఇదే దేహబు ద్ధికి జీవబుద్ధికి తేడా. అలాగే మనం రంగురంగుల గ్లాసుల్లో పాలు పోసి టేబుల్ మీద పెట్టా మనుకోండి ఇంట్లో చిన్న పిల్లలు 'నాకు ఈ రంగు గ్లాసు కావాలంటే, నాకు ఆ రంగు గ్లాసు కావాలని' కొట్టుకుంటారు. అదే పెద్దవాళ్ళు గ్లాసుది ఏ రంగైనా లోపలి పాలు ఒకటే కదా అనే భావనలోనే ఉంటారు.

మనకు దేహబుద్ధి పోనంతకాలం ఇతరులను కూడా ఆ బుద్ధితోనే చూస్తాం. అందుకే ఒక కొత్త మనిషిని చూడగానే అతని ఆకారాన్ని బట్టో, వేషభాషలను బట్టో, రంగుని బట్టో ఠక్కున ఒక అంచనాకి వచ్చేస్తాం. అది ఎంత తప్పో వారితో కొంతకాలం గడిపితే కానీ తెలియదు. అదే దేహబుద్ధిని దాటి జీవబుద్ధిని అందుకున్నప్పుడు మనం ఈ పైపై ఆకారవికా రాలకు మోసపోక ప్రతి జీవినీ వారి వారి మనస్తత్వాలను బట్టి, గుణగణాలను బట్టి మాత్రమే అంచనా వేస్తాం. నగలు ఎన్ని రూపాలలో ఉన్నా వాటిని చేసిన బంగారం నాణ్యత ముఖ్యమైనట్లు, అలాగే గ్లాసులు ఎన్ని రంగుల్లో ఉన్నా వాటిలోని పాల రుచి ముఖ్య మైనట్లు పైకి కనపడే దేహాలు ఎలా ఉన్నా వాటిలోని జీవుల సంస్కారం ముఖ్యమని గుర్తిస్తాం.

అయితే దీనిని కూడా దాటిన మహాత్ములు సర్వం ఆత్మమయంగా గుర్తించి తమకూ, చుట్టూ ఉన్న ప్రపంచానికీ ఏమాత్రం భేదం లేదనే ఎరుకను కలిగి ఉంటారు. వారికి కనీసం గ్లాసులో ఉన్నవి పాలో, నీళ్ళో, విషమో అనే భేదదృష్టి కూడా ఉండదు. అలాగే తాము ధరించినవి బంగారు నగలో, ఇత్తడి నగలో, చిరిగిన గుడ్డలో అనే దృష్టి కూడా ఉండదు. ఎదుటి వ్యక్తి ఆకారవికారాలు గానీ, ఉచ్ఛనీచ సంస్కా రాలు కానీ వారిపట్ల ఎటువంటి ప్రభావం చూపలేవు. వారు సదా తమలోనే సర్వప్రపంచాన్నీ, అలాగే సర్వప్ర పంచంలోనూ తమనీ దర్శిస్తూ ఉంటారు. అదే ఆత్మ దృష్టి, అద్వైత దృష్టి.

అయితే ఎంతటి అద్వైతాన్ని సాధించినా గురుదేవుల సన్ని ధిలో మాత్రం ఎప్పుడూ మనని మనం దాసుడిగానే భావించాలి. 'నాద్వైతం గురుసన్నిధౌ'. అందుకే ఒక కవిగారు హనుమంతుని భక్తిని వర్ణిస్తూ ' కనులనిండా ఇనవంశ సోము డు కదలాడుచుండినా ఎడదలోన శ్రీరఘురాముడు నడయా డుచుండినా తనివి తీరక తృప్తి కలుగక ఎదుట చూడాలని, పాదాలపై వాలాలని, వేచి నిలిచేవా ఎదురు కాచి కొలిచేవా' అని కీర్తించారు.

ధర్మ సందేహాలకు సమాధానాలు

అక్షమాల అంటే ఏమిటి?

మంత్రజపం మాలతో చేయడం అవసరమా?

> శ్లో॥ అనంతఫలదానాచ్చక్షపితా శేషకల్మషాత్
> మాతృకాత్మ తయాలాభ కరణాదక్షమాలికా॥

'అ' – అనంతఫలాన్ని ఇవ్వడం వల్ల 'క్ష' – కల్మషాలను క్షాళించడం వల్ల ఈ మాలను 'అ క్షమాల' అంటారు. యాభైనాలు గు మణులతో రూపొందించబడ్డ మాల సర్వకర్మల్లో విహితమైంది.

'అ'కారంతో మొదలై 'క్ష'తో అంతమయ్యే సంస్కృతాక్షరాలను యాభైనాలుగు ధ్వనుల కింద లెక్కకట్టి ఆరోహణ, అవరోహణలుగా నూట ఎనిమిదిగా చేసి దేవతా విగ్రహాలకు చేతితో మాలను చూపుతూ చేసే జపమే 'అక్ష మాల'.



పగడాలు, ముత్యాలు, స్ఫటికాలు, శంఖాలు, వెండి, బంగారం, మంచిగంధం, పత్రజీవిక, తామర గింజలు, రుద్రాక్షలు, – ఆకారం మొదలుకొని 'క్ష' కారం వరకు ఉన్న అక్షరమూర్తిగా సావధాన భావం కలిగి ఉంటాయి. బంగారం, రాగి, వెండిని సూత్రంగా ఉపయోగించ వచ్చు. ఈ మాల రంధ్రంలో – బంగారం, కుడివైపు – వెండి, ఎడమవైపు – రాగిని ఉండేట్లు చూసు కోవాలి. పూసల అగ్రానికి అగ్రం, పుచ్ఛానికి పుచ్ఛం కలిసేట్లు గ్రుచ్చుకో వాలి. సూత్రం బ్రహ్మస్వరూపంగా, కుడివైపున్న వెండి శైవంగా, ఎడమవై పున్న రాగి వైష్ణవంగా, ముఖం సరస్వతీ స్వరూపంగా, పుచ్ఛం గాయత్రిగా, రంధ్రం విద్యగా, ముడి ప్రకృతిగా భావి స్తారు. మాలలోని పూసలను అక్షరాలుగా భావించారు. ఒక్కో అక్షరా నికి ఒక్కో ప్రతిష్ఠామంత్రం ఉంటుంది. ఉదా॥ 'ఓం అకార మృత్యుంజయ సర్వ వ్యాపక ప్రథమే అక్షే ప్రతితిష్ఠ' అంటూ మొదటి పూసను ప్రతిష్ఠాస్తారు. అదే విధంగా అన్ని పూసలకు అన్ని అక్షరాలున్న వని అక్షమాలకోపనిషత్ తెలియజేస్తుంది.

మంత్రజపం మాలతో చేయడం ఎంతమాత్రం తప్పుకాదు. మంత్రజప సమయంలో మనస్సు అనేక రకాలుగా పరిభ్రమి స్తుంది. అలాంటి మనస్సును తిరిగి లాక్కురావడానికే మాలను ఉపయోగించడం జరుగుతుంది. 'మాలను త్రిప్పడం ఆగిపోతేనే అసలు జపం ప్రారంభమౌతుంది' – అంటారు ఓ సిద్ధపురు షుడు, నోటితో చేసే జపం, దేవుడి రూపధ్యానం, మాలలోని పూస తిప్పడం – అనే ప్రక్రియలు ఒకదాంతో ఒకటి సంబంధం కలిగి చేసేవి. సిద్ధులకోసం, దుఃఖనివారణ కోసం, కోరిక ఫలిం పజేసుకోవాడానికి చేసే జపానికి, మనో స్వాధీనానికి చేసే జపానికి తేడా ఉంటుందని అనుభవజ్ఞులైన సాధకుల అభి ప్రాయం.

జపం చేసేటపుడు – వ్రేళ్లతో చేసే జపం ఏకగుణాన్ని, పర్వాల్లో చేసే జపం అష్టగుణాన్ని, పుత్రజీవాల్లో దశగుణాన్ని, శంఖమాలలో శతగుణాన్ని, పగడాల్లో వెయ్యిరెట్లు, సర్పమ ణులు, స్ఫటికాల్లో పదివేల రెట్లు, ముత్యాలలో లక్షగుణాన్ని, పద్మబీజాల్లో పదిలక్షల రెట్లు, బంగారంలో కోటిరెట్లు ఫలితం పొందవచ్చని శాస్త్రవచనం.

డా|| పి. భాస్కరయోగి


పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. కుశధ్వజుని కుమార్తె ?
2. జనకుడికి మరోపేరు?
3. కర్ణునికి ఎంత మంది కుమారులు?
4. దుర్యోధనుడి భార్య పేరు?
5. యాగాలు ఎన్ని రకాలు?
6. అశ్వమేధ యాగాన్ని ఏ వంశానికి చెందిన వారు మాత్రమే చేయాలి?
7. త్రిశంకుని అసలు పేరు?
8. అనసూయ అనగా?
9. సప్తరుషులలో ప్రథముడు ఎవరు?
10. పరీక్షిత్తు వల్ల ఏ వంశం వృద్ధి చెందింది?

సమాధానాలు

విజయ క్రాంతి
శుక్రవారం 11 జనవరి 2019
హైదరాబాద్

ఆపదైన వేళ నరసి బంధుల జూడు
భయమువేళ జూడు బంటుతనము
పేదవేళ జూడు పెండ్లాము గుణమును
విశ్వదాభిరామ వినుర వేమ

తాత్పర్యం: ఆపదలో చిక్కుకున్నప్పుడు సహాయ పడేవాడే బంధువు, భయంతో ఉన్నప్పుడు ధైర్యం చెప్పేవాడే మిత్రుడు, కటిక బీదరికంలో అయినా భర్తను ప్రేమించేదే భార్య

గతం.. ప్రస్తుతం..భవిష్యత్తు..

వికాసమే విజయం

- నిన్న అనుభవించిన కష్టాలు పక్కన పెట్టాలి.
- నేడు ఇచ్చే ఆనందాలను అనుభవించాలి
- రేపు వచ్చే కానుకలకై వేచి చూడాలి!

నిన్నటి అనుభవానికి చింతించక అంగీకరించాలి.
నేటి కార్యాన్ని విశ్వాసంతో వ్యవహరించాలి,
రేపటిని నిర్భయంగా ఎదుర్కొవాలి!
ఎంత విచారించినా భవిష్యత్తుని ఆపలేం,
ఇక చేయాల్సిందల్లా ప్రస్తుతంలో జీవించబడమే!

బుద్ధ భగవానుడు చెప్పినట్లు, మనశ్శరీరాల ఆరోగ్యానికి రహస్యం

- నిన్నటిని తలచి వ్యథ చెందడం కాదు, రాబోయే విపత్తును ఊహించుకుని బాధ పడటం కాదు, ప్రస్తుతంలో జీవిస్తూ వివేకంతోనూ, శ్రద్ధతోనూ జీవించడమే!

మన భవిష్యత్తు.. రేపు చేయబోయే కార్యంపై కాదు.
గతాన్ని తలచి వ్యథ చెందడం కాదు, భవిష్యత్తుని చిత్రీకరించుకుని బాధపడటం కాదు, వర్తమానంలో నేడు చేసే దానిపైనే నిర్మించబడుతుంది. ఎందుకంటే భవిష్యత్తు మొదలయ్యేది. రేపటి నుండి కాదు, నేటి నుండి.. కాదు.. ఈ క్షణం నుండే!

రావణవధకు.. రామసేన సృష్టి

తతః చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌ |
నక్షత్రే అదితి దైవత్యే స్వ ఉచ్చ సంస్థేషు పంచసు ||
గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతా ఇందునా సహ |
ప్రోద్యమానే జగన్నాథం సర్వ లోక నమస్కృతం ||


జగన్నాథుడైన వాడు, సర్వలోకాల చేత నమస్కారింపబడేవాడు, 12 నెలలు కౌసల్య గర్భవాసం చేసి, చైత్ర మాసంలో, నవమి తిథి నాడు, పునర్వసు నక్షత్రంలో, కర్కాటక లగ్నంలో, రామచంద్రమూర్తి జన్మించారు. అదే సమయంలో, కైకేయికి పుష్యమి నక్షత్రంలో, మీన లగ్నంలో, భరతుడు జన్మించాడు. తరువాత సుమిత్రకి లక్ష్మణుడు, శత్రుఘ్నుడు జన్మించారు. అదే సమయంలో, బ్రహ్మ గారు, దేవతలతో ఒక సభ తీర్చారు......' శ్రీమహావిష్ణువు భూలోకంలో రాముడిగా అవతరించారు, రావణసంహారంలో రాముడికి సహాయం చెయ్యడానికి, మీరు మీ అంశలతో, కొంతమందిని సృష్టించండి. దేవతలందరూ రామకార్యం కోసం పుట్టడం మన అదృష్టమని ఆనందపడ్డారు.

అప్పుడు బ్రహ్మ, 'ఒకసారి నాకు ఆవలింతవచ్చింది, అప్పుడు నా నోట్లో నుంచి ఒకడు కిందపడ్డాడు, అతనే జాంబవంతుడు. ఇక మీరు సృష్టించండి' అని అన్నారు. ఇంద్రుడి అంశతో వాలి, సూర్యుడి అంశతో సుగ్రీవుడు, బృహస్పతి అంశతో తారుడు, కుబేరుడి అంశతో గంధమాదనుడు, అశ్విని దేవతల అంశతో మైందుడు, ద్వివిదుడు, అగ్ని అంశతో నీలుడు జన్మించాడు.. దేవతల సృష్టిని చూసిన ఋషులు, మేము కూడా సృష్టిస్తాం అని, కొన్ని కోట్ల వానరాలని సృష్టించారు.

రాముడు పుట్టిన 11 రోజులకి, జాతాసౌచం పోయాక, ఆయనకి నామకరణం చేయించారు. కులగురువైన వశిష్ఠ మహర్షి, సర్వజనులు, ఆయన గుణాలు చూసి, పొంగిపోయెదరు కనుక, ఆయనకి రామ, (రా అంటె అగ్ని బీజం, మ అంటె అమృత బీజం) అని, సుమిత్ర కుమారుడైన సౌమిత్రి అపారమైన లక్ష్మి సంపన్నుడు (రామ సేవే ఆయన లక్ష్మి) కనుక ఆయనకి లక్ష్మణ అని, కైకేయ కుమారుడు భరించే గుణము కలవాడు కనుక ఆయనకి భరత అని, శత్రువులను (అంతః శత్రువులు) సంహరించ గలవాడు కనుక, శత్రుఘ్న అని నామకరణం చేశారు వశిష్ఠ మహర్షి.

ఎల్లప్పుడు గురువులని పూజించేవాళ్ళు. లోకంలోని అందరి హితం కోరుకునేవాళ్ళు. వాళ్ళు ఎప్పుడూ తండ్రిగారికి సేవ చేసేవాళ్ళు.

ఒకనాడు దశరథ మహారాజు, సభలో ఇలా అన్నారు ' నా పిల్లలకి 12 సంవత్సరాల వయస్సు దాటింది, కాబట్టి వాళ్ళకి వివాహం చెయ్యాలని అనుకుంటున్నాను, తగిన సంబంధాలని వెతకమని దశరథుడు అంటుండగా, ఆ సభలోకి ఎవరూ అనుకోని విధంగా, విశ్వామిత్రుడు వచ్చాడు. వెంటనే దశరథుడు లేచి, ఆయనకి ఎదురొచ్చి, స్వాగతం పలికాడు.' మీరు మా రాజ్యానికి రావడం మా అదృష్టం, మీలాంటి గొప్ప



ప్రవచనం

– డా॥ శ్రీ చాగంటి కోటేశ్వర రావు

మహర్షులు ఊరకనే రారు, కాబట్టి మీ కోరికేదైన, నేను సంతోషంగా తీరుస్తాను' అని దశరథుడు అన్నాడు.

అప్పుడు విశ్వామిత్రుడు 'దశరథ! నీకు సామంత రాజులందరూ లొంగి ఉన్నారా? దానధర్మాలు సక్రమంగా చేస్తున్నావా?.. అని పలు కుశల ప్రశ్నలు వేసి, 'నాకు ఒక కోరిక ఉంది, నువ్వు తీర్చాలి' అన్నాడు.

స్వ పుత్రం రాజ శార్దూల రామం సత్య పరాక్రమం |
కాక పక్ష ధరం శూరం జ్యేష్ఠం మే దాతుం అర్హసి ||

'నీ పెద్దకొడుకైన రాముడిని నాతో పంపిస్తావా? మా యాగాలకి అడ్డువస్తున్న రాక్షసులని వధించడానికి తీసుకు వెళతాను' అని విశ్వామిత్రుడు అన్నాడు. ఈ మాట విన్న దశరథుడు కిందపడిపోయాడు. మెల్లగా తేరుకొన్న దశరథుడు, ఇంకా 16 సంవత్సరాలు కూడా నిండని నా రాముడు, ఆ రాక్షసులని ఎలా సంహరించగలడు. కావాలంటే నేను నా చతురంగ బలాలతో వచ్చి, ఆ రాక్షస సంహారం చేస్తాను, పోనీ రాముడే రావాలంటే, రాముడితో నేను కూడా వస్తాను' అని దశరథుడు ప్రాధేయపడ్డాడు.

'రాముడు పిల్లవాడు, ఏమిచెయ్యలేడు అని నువ్వు అనుకుంటున్నావు, కాని రాముడంటె ఎవరో నాకు తెలుసు, వశిష్ఠుడికి తెలుసు. రాముడు రాక్షసులను వధించి తప్పక తిరిగివస్తాడు. నువ్వు తండ్రివి కనుక, నీకు రాముడిమీద ఉన్న పుత్రవాత్సల్యంవల్ల, నువ్వు తెలుసుకోలేకపోతున్నావు, రాముడిని నాతో పంపించు' అని విశ్వామిత్రుడు అడిగాడు.

అప్పుడు దశరథుడు 'లేక లేక పుట్టిన నా కొడుకుని, నన్ను విడిచిపెట్టు' అన్నాడు. ఈ మాటలు విన్న విశ్వామిత్రుడుకి ఆగ్రహం వచ్చి, ' చేసిన ప్రతిజ్ఞ నిలబెట్టుకోలేక, మాట తప్పిన ధర్మం తెలియని దశరథా! పుత్ర పౌత్రాదులతో సుఖంగా, శాంతిగా జీవించు' అని వెళ్ళిపోతున్నాడు. వెంటనే వశిష్ఠుడు లేచి, విశ్వామిత్రుడిని కూర్చోమని చెప్పి, దశరథుడితో ఇలా అన్నాడు. "ఇంత కాలం రాజ్యం చేశావు, ధర్మాత్ముడవని అనిపించుకున్నావు. ఇప్పుడు ఆడిన మాట తప్పి, దశరథుడు అధర్ముడు, మాట తప్పినవాడు అనిపించుకుంటావా? ఇచ్చిన మాటకి నిలబడు. విశ్వామిత్రుడంటె ఎవరో తెలుసా......?

ఏష విగ్రహవాన్ ధర్మ ఏష వీర్యవతాం వరః |
ఏష విద్య అధికో లోకే తపసః చ పరాయణం ||


ఈ లోకంలోని ధర్మం అంతా విశ్వామిత్రుడు, ఈ లోకంలోని తపస్సు అంతటికి నిర్వచనం విశ్వామిత్రుడు, ఈ లోకంలోని బుద్ధి అంతటికి నిర్వచనం విశ్వామిత్రుడు, శివుడి అనుగ్రహంగా, ఆయనకి ధనుర్వేదం మొత్తం భాసించింది, కావున ఆయనకి, ఈ లోకంలో ఉన్న అన్ని అస్త్రశస్త్రాలు తెలుసు. ఇన్ని తెలిసిన విశ్వామిత్రుడు, తనని తాను రక్షించుకోగలడు. కాని రాముడికి ఆ కీర్తి దక్కాలని, తనకి తెలిసిన సమస్త విద్యలు రాముడికి ధారపొయ్యాలని, ఆయన ఆశ, ఎందుకు అడ్డుపడతావు' అని అన్నాడు.

దశరథుడు ఆజ్ఞాపించగా రాముడితో పాటు, లక్ష్మణుడు కూడా వచ్చాడు. దశరథుడు చాలా సంతోషంతో,' నా కొడుకుని మీ చేతులలో పెడుతున్నాను. మీరు ఎలా కావాలంటే, అలా వాడుకోండి' అని విశ్వామిత్రుడితో చెప్పాడు. 'విశ్వామిత్రుడు ఏది చెబితే అది చెయ్యి' అని రాముడితో చెప్పి, సాగనంపాడు. అలా విశ్వామిత్రుడి వెనక, రామలక్ష్మణులు ఇద్దరు బయలుదేరారు.

– సేకరణ: నరేందర్ చింతం

శివానందలహరి

శ్రీ ఆదిశంకరాచార్యుల విరచితం - 3



శ్లోకం:

ఉపేక్షా నోచేత్కిం న హరసి భవద్ధ్యానవిముఖాం
దురాశా భూయిష్ఠాం విధిలిపి మశక్తో యది భవాన్|
శిర స్తద్వైధాత్రం న నఖలు సువృత్తం పశుపతే
కథం వా నిర్యత్నం కరనఖముఖేనైవ లులితమ్|| 15 ||

భావం

సాంబశివా! దుష్టమైన ఆలోచనలతో నిన్ను ధ్యానించుటలో కూడా ఆసక్తిని కలుగనట్లు చేయుటకు సూచకంగా నానుదుట బ్రహ్మరాసిన వ్రాతను ఉపేక్షింపక తుడిచి వేయుము. నా చేత కాదని తప్పించుకొనుటకు వీలులేదు. ఆ బ్రహ్మ దేవుని ఐదవ తలను నీ కొనగోటి తోనే త్రుంచితివి కదా!

వివరణ

వారి వారి పుణ్య పాప కృత్యాలను అనుసరించి అనుభవించవలసిన కర్మ ఫలాలను ఆయా జీవుల నొసటిమీద బ్రహ్మ వ్రాస్తాడని, దానినే 'బ్రహ్మ లిఖితం' అని, దీనికి తిరుగులేక ఎంతటివాడైనా అనుభవించి తీరవలసినదేననీ అంటారు. ప్రారబ్ధభోగతో నస్యేత్ ప్రారబ్ధాన్ని అనుభవిస్తేనే తీరుతుంది. 'విధిరేవ గరీయసి' ఇలాంటి మాటలు వింటూ ఉంటాం. కాని, నిదానించి ఆలోచిస్తే ఈ బ్రహ్మ లిఖితం ఉల్లంఘించబడిన సందర్భాలు కూడా వున్నట్టు తెలుస్తుంది. ఈ బ్రహ్మవ్రాత భగవద్భక్తులు కానివారి విషయంలోనే గాని భగవద్భక్తుల విషయంలో వర్తించదేమోనని అనిపించే సందర్భాలున్నాయి.

'మార్కండేయునికి బ్రహ్మ లిఖితం ప్రకారం 16 ఏళ్ళు ఆయుర్దాయం. కాని, శివుని కరుణవల్ల చిరంజీవి అయ్యాడు కదా!

సత్యవంతుడు సతీ సావిత్రి పాతివ్రత్యమహిమ వల్ల చనిపోయికూడా ప్రాణాలను తిరిగి తెచ్చుకుని బ్రతికాడు కదా! ఈ శివానంద లహరి స్తోత్రాన్ని రచించిన శ్రీ ఆదిశంకరులు కూడా బ్రహ్మ లిఖితం ప్రకారం 8 ఏళ్ళు ఆయుర్దాయం అయినా, సన్యసించి 8 ఏళ్ళు, వ్యాసుల వారి కరుణ వల్ల మరో 16 సంవత్సరాలు పొంది మొత్తం 32 సంవత్సరాలు బ్రతికారు కదా! ఈ విధమైన సందర్భాలున్నాయి కాబట్టి శంకరులు 'శివుని కరుణ వుండాలేగాని బ్రహ్మ లిఖితం ఏం చేస్తుంది అని ధీమాగా ఈ శ్లోకంలో చెప్పారు.

ఎందుకంటే బ్రహ్మ

వ్రాత లాంటి కోర్టు శిక్షలు కూడా 'మెర్సీ పిటిషన్' ద్వారా రద్దు కాబడిన సందర్భాలు ఉన్నాయి కదా!

'అయినా, బ్రహ్మ ఐదవతలనే అవలీలగా గోటితో త్రుంచిన శివునికి ఆ బ్రహ్మ వ్రాతను చెరపడం ఏమంత కష్టం? అని జగద్గురువులు, శ్రీ శంకరుల వాదన.

ఆ ఆదిదంపతుల పాదపద్మాలకు
నమస్కరిస్తూ సర్వేజనా సుఖినోభవంతు

డా॥ శ్రీరామ్. హైదరాబాద్

భగవంతుడు అన్ని జీవరాశుల్లోనూ ఉన్నాడు

(మావటివాడూ నారాయణుడే)

భగవంతుడు అన్ని జీవరాశుల్లోనూ ఉన్నా, ఆయన తేజస్సు వేరువేరు జీవుల్లో వేరువేరుగా వ్యక్తమవుతోంది. దీనిని వివరిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు.

'ఒక కథ చెపుతా విను! ఒక అడవిలో ఒక సాధువు ఉన్నాడు. అతడికి చాలామంది శిష్యులున్నారు. ఒకరోజు ఆయన, 'భగవంతుడు అన్ని జీవరాశుల్లోనూ ఉన్నాడు అందువల్ల ఆ జీవరాశుల్లో ఉన్న భగవంతుడికి నమస్కరించాలి' అని వారికి బోధించాడు'.

'ఆ శిష్యుల్లో ఒకడు అగ్నిహోత్రానికి సమిధలు తేవడానికి వెళ్లాడు. అకస్మాత్తుగా అతడికి, 'అడ్డం తొలుగు!' ప్రక్కకు తప్పుకో! మదపుటేనుగు వస్తున్నది' అనే కేక వినపడింది. ఆ కేక విని అందరూ పారిపోతున్నారు. కాని ఆ శిష్యుడు, 'ఈ ఏనుగు కూడా భగవంతుడి వేరొక రూపమే కదా! నేను ఇక్కడి నుండి ఎందుకు పారిపోవాలి?' అనుకున్నాడు. అతడు అక్కడే నిలబడి, తలవంచి ఆ ఏనుగుకు నమస్కరించి, దాని గుణగణాలను కీర్తించటం మొదలు పెట్టాడు. మావటివాడు, 'ఏయ్ పారిపో! పారిపో!'అని బిగ్గరగా అరిచాడు. అయినా ఈ శిష్యుడు కదలడే! ఆ ఏనుగు అతణ్ణి తొండంతో పట్టుకుని ఒక ప్రక్కకు విసిరేసింది. అతడికి దెబ్బలు తగిలి, స్పృహతప్పి పడిపోయాడు. గురువుగారికి ఈ సంగతి తెలిసి, నీవు అక్కడి నుండి ఎందు కు తొలగలేదు' అని ప్రశ్నించాడు. దానికి అతడు, 'మన గురువుగారు భగవంతుడే మానవులుగాను, జంతువులుగానూ ఎన్నో రూపాలు ధరిం చాడని చెప్పారు కదా! అందుకే ఏనుగు రూపంలో దేవుడు వస్తున్నాడని నేను ప్రక్కకు తొలగలేదు?' అని బదులు చెప్పాడు. వెంటనే గురువుగారు అందుకొని, నిజమే నాయనా! 'ఏనుగు – దేవుడు' రావటం యథార్థమే. కాని 'మావటి–దేవుడు' పారిపొమ్మన్నాడు కదా! అన్ని జీవులు దేవుడి రూపాలే అయినప్పుడు ఆ మావటి – దేవుని మాటలు ఎందుకు చెవిని పెట్టలేదు? నీవు ఆ మావటి–దేవుని మాట విని ఉండాల్సింది' అన్నాడు.

'శాస్త్రాలలో నీరు నారాయణ స్వరూపమని ఉంది. (ఆపో–నారాయణః) కొన్ని నీళ్ళు శుభ్రంగా ఉండి స్నానానికి, మరికొన్ని నీళ్లు అంట్లు తోమడానికి, గుడ్డలు ఉతకడానికి మాత్రమే పనికివస్తాయి. తాగడానికి కానీ, పూజకు కానీ పనికిరావు. అదేవిధంగా భగవంతుడు పాపాత్ముల రూపంలోనూ, పుణ్యాత్ముల రూపంలోనూ, మంచివాడిగాను, చెడ్డవాడిగాను, ఇంకా పాపాత్ములతోను, దుష్టులతోను సంబంధం పెట్టుకోకూడదు. వారితో సన్నిహితంగా ఉండకూడదు. కొందరితో 'ఓహో' అంటే 'ఓహో' అనాలి. మరికొందరితో అలా ఉండటం కూడా పనికిరాదు. అటువంటి వారికి దూరంగా ఉండాలి', 'అంతేకాకుండా భగవంతుడు అన్ని జీవరాశుల్లోనూ ఉన్నాడు. అయినా సత్పురుషులతో సన్నిహితంగా ఉండి, దుష్టులకు దూరంగా ఉండాలి. పులిలో దేవుడున్నాడని పులిని కౌగిలించుకోవు కదా! 'పులిని చూచి ఎందుకు పారిపోవాలి. దానిలో కూడా దేవుడు లేడా? అనొచ్చు. కాని, 'పారిపో!' అని చెప్పేది కూడా భగవంతుని విభూతియే (రూపమే) కదా! వారి మాటలు ఎందుకు వినకూడదు?'

రామకృష్ణులు యువకుడైన నరేంద్రునికి (వివేకానంద స్వామికి) కూడా, 'ప్రాపంచికులతో ఎలా మెలగాలి?' అనే విషయాన్ని వివరిస్తూ ఈ కథను చెప్పారు. (పులిలో కన్నా మనిషిలో బ్రహ్మ తేజస్సు (అంశ) ఎక్కువగా వ్యక్తీకరింపబడుతోంది. అదేవిధంగా దుర్మార్గులలో కన్నా సన్మార్గులలో బ్రహ్మతేజోంశ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మనం సన్మార్గులతో ఎక్కువగా సాంగత్యం చేసి, వారి మాటకు ఎక్కువ విలువ ఇవ్వాలి.)

శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన గూఢార్థ కథలు

బాల మకరందం

ఎడారిలో ఉన్నా నీటి మేఘాలు

ఒకానొకప్పుడు ఉత్తంకుడు అనే మహర్షి తపో దీక్ష నుండి బయటకొచ్చి కృష్ణపరమాత్మని కలిసాడు. ఉత్తంకుడికి మహాభారత యుద్ధం జరిగిన విషయం కూడా తెలియదు. అందుకే ఆయన కౌరవ, పాండవుల క్షేమ సమాచారాలు అడిగాడు. అప్పటికే యుద్ధంలో పాండవుల పక్షం నిలిచి సహాయపడిన కృష్ణుడు, ఆ మునికి జవాబేమివ్వాలో తెలియక ఇబ్బంది పడ్డాడు. ఆ తర్వాత జరిగినదంతా వివరించాడు. దాంతో మహామునికి కోపం వచ్చింది. కృష్ణుడు తలచుకుంటే యుద్ధం ఆపగలిగేవాడని, ఇంత వినాశానికి తనే కారకుడని కృష్ణుడికి శాపమివ్వబోయాడు. కృష్ణుడి గొప్పతనం చూడండి. కృష్ణుడు నిజ రూప దర్శనమిచ్చి ఆ మహామునిని వరం కోరుకోనున్నాడు. దేవుడి దయ అలాగే ఉంటుంది.! తనకు దాహం వేసినప్పుడు వెంటనే నీరు దొరికేలా వరం ఇమ్మని కోరాడు ఉత్తంకుడు. 'ఎడారిలో ఉన్నా, తలపై మేఘం ఆవరించి కోరినన్ని జలం కురిపిస్తుందని' ఆయనకు వరమిచ్చాడు కృష్ణుడు. ఈ రోజుకి కూడా ఎడారిలో అరుదుగా కనిపించే మేఘాలను ఉత్తంక మేఘాలు అంటారు.

గ్రహించవలసిన లక్షణం: దయ

శ్రీ భగవాన్ ఉవాచ

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకహ!
న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతహ!!

తాత్పర్యం

ఈ ఆత్మను శస్త్రాలు ఛేదింపజాలవు. అగ్ని దహింపజాలదు. నీరు తడుపజాలదు.
వాయువు ఆర్పివేయ జాలదు.

నీతి


దివ్య స్వరూపుడైన కృష్ణుడు కాలాతీతుడు. ఆయన ఎన్నడూ జన్మించలేదు. ఆత్మకు చావు పుట్టుకలు లేవు. మనం ఆత్మ స్వరూపులే, దేహం కాదు అని తెలుసుకోవాలి.

ముఖ్యపదం: మంట




ముఖవర్చస్సు ఆధారంగా సాముద్రిక శాస్త్రం

"Face is the Index of Mind" ముఖవర్చస్సు మన మనస్సు మీద ఆధారపడి ఉంది. ఈ మాటని మనం పదే పదే వాడుతూ ఉంటాం. ముఖంలోని భావాలను అనుసరించి ఒక వ్యక్తి ఉల్లాసంగా ఉన్నాడు. లేక దుఃఖభరితంగా ఉన్నాడు అని మనకు మనమే ఒక నిర్ణయానికి వచ్చి, ఆ వ్యక్తిని మనం కుశల ప్రశ్నలడుగుతాం. ఇది ప్రతి ఒక్కరికీ ఎదురయ్యే అనుభవం. కొందరు వైద్యులు శరీరాంగాలను పరీక్షించి రోగ నిర్ధారణ చేస్తూ ఉంటారు. మరికొందరు ముఖవర్చస్సును చూసి వారి భవిష్యత్తును తెలియజేస్తారు. ఇలా ఎన్నో రకాలుగా మానవ శరీర లక్షణాలను అనుసరించి.. మనోభావాలు, భవిష్యత్తు, వ్యక్తిత్వం, రోగ నిర్ణయం చేసే శాస్త్రం భారతీయులకు అనాదిగా తెలుసు. ఆ శాస్త్రమే సాముద్రిక శాస్త్రం. సముద్రునిచే చెప్పబడింది సాముద్రిక శాస్త్రం. అందుకే ఈ శాస్త్రానికి సాముద్రిక శాస్త్రమని పేరు వచ్చింది.



శ్రీ మహావిష్ణువు ఆదిశేషునిపై శయనించినప్పుడు శ్రీహరి శరీరం మీదున్న శుభముద్రలను, సముద్రుడు దర్శించి లోకానికి అందించాడు. తదుపరి కాలంలో నారద, మాండవ్య, వరాహ, కార్తికేయాదులను ఋషులచే ఇది విస్తరించబడింది. నేడు మనకి ఈ శాస్త్రం పూర్తిగా లభించుట లేదు. పురాణాలలో రామాయణ భారత ఇతిహాసాలలో ఈ సాముద్రిక శాస్త్ర ప్రామాణంగా వర్ణనలు మనకు కనిపిస్తుంది.

రామాయణంలో రాముని సలక్షణాలను చాలా విపులంగా వాల్మీకి మహాకవి వర్ణించాడు.

హనుమంతుడు తొలిసారిగా అశోకవనంలో సీతను కలిసినప్పుడు, తాను రాముని దూత అని సీతను నమ్మించుటకు, సీత అడిగిన ప్రశ్నలకు హనుమంతుడు రాముని శరీర లక్షణాలను వివరిస్తాడు. సుందరకాండ – 35వ సర్గ శ్లోకాలు 15 నుంచి 20 వరకు, శ్రీరాముని నఖశిఖ పర్యంత వర్ణన ఉన్నది. ఇందులో వాల్మీకి మహర్షి ఆంతర్యం ఏమనగా! – సాముద్రిక శాస్త్రపరంగా, శ్రీ మహావిష్ణువుకు ఏఏ శరీర లక్షణాలు కలవో, సరిగ్గా శ్రీరామునికి అవే శరీర లక్షణాలు ఉన్నవి అని పరోక్షంగా మనకు తెలియజెప్పడమే!

శాస్త్రీయ విజ్ఞానం

ఆధునిక కాలంలో ఈ సాముద్రిక శాస్త్రం మీద ఎన్నో పుస్తకాలు రచించబడినాయి. వానిలో ప్రఖ్యాతమైనవి గోపేష్ కుమార్ ఆహుజీ, ఆర్.జి.రావు రచించినటువంటివి. ఈ శాస్త్రాన్ని చైనాలో""సేయింగ్ మేన్" అంటారు. హస్తం సాముద్రిక శాస్త్రం కూడా, ఈ శాస్త్రంలో ఒక భాగం మాత్రమే.

సాముద్రిక శాస్త్ర పరిశోధనలు పలు రకాలు. వాటిలో ఒక పద్ధతి మానవ ముఖంను జంతు రూపాలతో పోల్చి వ్యక్తిత్వ లక్షణాలను నిర్ధారించుట.

రెండవది: మనిషి వర్చస్సును బట్టి, అతని చుట్టూ ఉన్న శక్తి పుంజాలను తెలుపుట. (ఎనర్జీ ఫీల్డ్స్) వీటిని ఆధునిక శాస్త్ర పరికరాలతో కూడా గుర్తించి పొందిన ఫలితాలు సాముద్రిక శాస్త్రంలో చూపిన ఫలితాలతో సరిపోయాయి.

మూడవ పద్ధతి: మానవ రూపాన్ని బట్టీ అతని జన్మకుండలిని రూపొందిస్తారు. ఈ విషయాలు జ్యోతిష్య శాస్త్ర గ్రంథాలలో మనకు లభిస్తాయి. శరీర అవయవం ఒక్కొక్కటి ఒక్కొక్క గ్రహరాశితో పోల్చబడిందని. ఉదాహరణకు జన్మకుండలినిలోని రెండవ ఇల్లు ముఖాన్ని తెలుపుతుంది. అలాగే ఒక వ్యక్తి పొట్టిగా ఉన్నచో అతనిపై బుధగ్రహ ప్రభావం అధికంగా ఉంటుంది. ఒక వ్యక్తి నల్లగా పొడుగ్గా ఉన్నచో అతనిపై శనిగ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఒక వ్యక్తి అందంగా ఉన్న అతనిపై శుక్రగ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. బలిష్ఠమైన శరీరం గల వ్యక్తి మీద కుజగ్రహ ప్రభావం అధికంగా ఉంటుంది. లావుగా, పొడవుగా ఉన్న వ్యక్తిపై గురుగ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

శక్తివంతమైన, ఆకర్షణీయమైన నేత్రాలు గల వ్యక్తికి రవిగ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నాయకత్వపు లక్షనాలు కలిగి ఉంటాడు. కుడి కన్ను తండ్రిని, ఎడమ కన్ను తల్లిని, ముక్కు సోదరులను సూచిస్తాయి. ఇలా ఎన్నో రకాలుగా శరీర అవయవాలను పరిశీలించి మనిషి యొక్క జన్మకుండలిని, వానిలోని గ్రహస్థితిని పోల్చుకుని, భవిష్యత్తును నిర్ణయిస్తారు. ఇంతేకాకుండా సాముద్రిక శాస్త్రంలో రాజలక్షణాల గురించి చర్చ ఉన్నది. ప్రసిద్ధ ఆయుర్వేద గ్రంథాలైన చరక, సుశ్రుత సంహితాలలో శరీర లక్షణాలను బట్టి, రోగాలను నిర్ధారించే పద్ధతులు తెలిపారు. ఇంకా సూక్ష్మంగా చెప్పాలంటే 'నాడి' చూసి ఎన్నో రోగాలు గుర్తించే వారు ప్రాచీన భారతీయులు.

విజయక్రాంతి
శుక్రవారం 11 జనవరి 2019
హైదరాబాద్

కార్మికులకు గుర్తింపు కార్డుల అవగాహన కార్యక్రమం

విజయక్రాంతి, మెహిదీపట్నం: రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని, వాటిని ఉపయోగించుకోవాలంటే ప్రతి కార్మికుడు కార్మిక శాఖ అందించే గుర్తింపు కార్డులను తప్పనిసరిగా తీసుకోవాలని హైదరాబాద్ కార్మిక శాఖ అధ్యక్షుడు రామారావు తెలిపారు. గురువారం గోల్కొండ లోని ఫతేదర్వాజ లేబర్ అడ్డా వద్ద కార్మికుల గుర్తింపుకార్డుల ఆవశ్యకతను కార్మికులకు తెలియజేస్తూ, కరపత్రాల ద్వారా అవగాహన పరిచారు. కార్మికుల కోసం షెల్టర్ నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి సుబ్బారావు,కార్మికులు దేవన్న, యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

'పిండాలు' తిన్నవాళ్లున్నారు



• బీజేపీ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి

విజయక్రాంతి, హైదరాబాద్: ఈబీసీ రిజర్వేషన్ల కారణంగా అందరికీ మేలు జరుగుతుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆర్థిక వివక్షకు అంతం పలుకుతుందని చెప్పారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై ఆయన అభినందనలు గుప్పించారు. ఇలాంటి సాహసోపేతమైన నిర్ణయాలు మోదీ తప్ప మరెవరికీ తీసుకునే ధైర్యం లేదన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పించారంటూ కాంగ్రెస్ సహ ఇతర పార్టీలు చేస్తున్న విమర్శలను ఆయన తప్పుపట్టారు. రెడ్డి, బ్రాహ్మణ కులాలలో ఎంతో మంది అంధకారంలో మగ్గిపోతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆకలికి తాళలేక బ్రాహ్మణులు పిండాలు తినడం కూడా తాను చూశానని వెల్లడించారు. 'అదిలాబాద్‌లోని సోన్ గ్రామంలో తాము పెట్టిన పిండాలనే బ్రాహ్మణులు ఆహారంగా తీసుకోవడాన్ని నేను స్వయంగా చూశాను.' అని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం సమభావం, సమానత్వం మోదీ పాలనలో నిజమవుతోందని ఆనందం వ్యక్తం చేశారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్.. అనే నినాదం రుజువు చేసి చూపించారని కొనియాడారు. మోదీ పాలనలో ఎస్సీ రిజర్వేషన్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు అమలు, బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా, ఇప్పుడు ఈబీసీ రిజర్వేషన్ ఇలా.. అన్ని వర్గాల కోసం పనిచేస్తున్నారని చెప్పారు. కులం, మతం అనే తేడా లేకుండా పేదలందరికీ న్యాయం చెయ్యాలనే డిమాండ్‌ను మోదీ తీర్చాడని అన్నారు. కులాలతో సంబంధం లేకుండా పేదవారికి రిజర్వేషన్లు అందే విధంగా తీసుకోచ్చిన బిల్లును స్వాగతిస్తున్నామని తెలిపారు. రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను ఇంద్రసేనారెడ్డి తప్పుపట్టారు.

అలోక్ వర్మపై వేటు

(మొదటిపేజీ తరువాయి) అలోక్ వర్మకు పూర్తి స్థాయి అధికారాలు ఇవ్వాలా, వద్దా అనే విషయాలను తేల్చడానికి ఉద్దేశించిన ఈ అత్యున్నత స్థాయి కమిటీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సుప్రీంకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఏ కే సిక్రీ, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఉన్నారు. సీవీసీ కమిటీ ఇచ్చిన నివేదిక బుధవారం అందకపోవడంతో గురువారం కూడా కమిటీ సమావేశమైంది. సీవీసీ నివేదికను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం, అలోక్ వర్మను సీబీఐ చీఫ్ పదవి నుంచి తొలగించాలన్న నిర్ణయాన్ని ప్రధాని మోదీ, జస్టిస్ సిక్రీ సమర్థించగా, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే వ్యతిరేకించినట్టు సమాచారం. సీబీఐ చీఫ్‌గా అలోక్ వర్మకు మరో 21 రోజుల పదవీ కాలం ఉండగానే ఆయనపై కమిటీ వేటు వేసింది.

గత బదిలీలను రద్దు చేసిన అలోక్ వర్మ

కాగా అలోక్ వర్మ తొలగింపు నిర్ణయం వెలువడటానికి కొన్ని గంటల ముందు ఆయన సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. సుప్రీం కోర్టు తీర్పునేపథ్యంలో బుధవారం సీబీఐ అధిపతిగా మళ్లీ బాధ్యతలు చేపట్టిన



అలోక్ వర్మ.

తాత్కాలిక సీబీఐ అధిపతి నాగేశ్వరరావు అక్టోబర్ 24 నుంచి జనవరి 8 వరకు చేసిన పలు బదిలీలను ఆయన రద్దు చేశారు. అలాగే జేడీ అజయ్ భట్నాగర్ సహ ఐదుగురు సీబీఐ ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ అస్థానా కేసును విచారిస్తోన్న డీఐజీ ఎంకే సిన్హా, డీఐజీ తరుణ్ గౌబా, జేడీ మురుగేశన్, ఏడీ ఎ.కె.శర్మను బదిలీ చేశారు. దీంతో పాటు అస్తానా కేసు విచారణను 2006 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి మోహిత్ గుప్తాకు అప్పగించారు.

సీబీఐ తాత్కాలిక చీఫ్‌గా మరోసారి నాగేశ్వర రావు

మరోవైపు సీబీఐ తాత్కాలిక చీఫ్‌గా నాగేశ్వరరావును కేంద్ర ప్రభుత్వం గురువారం నియమించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది అక్టోబర్ 23న అలోక్ వర్మను కేంద్రం సెలవుపై పంపిన అనంతరం నాగేశ్వరరావును తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించింది. దీంతో జనవరి 8 వరకు ఆయన ఆ హోదాలో ఉన్నారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో అలోక్ వర్మ బుధవారం తిరిగి బాధ్యతలు చేపట్టగా గురువారం అత్యున్నతస్థాయి కమిటీ ఆయనపై వేటు వేసింది. దీంతో కేంద్రం మరోసారి నాగేశ్వరరావును తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించింది. దీంతో ఆయనకు మరోసారి అదృష్టం వరించడంతో సీబీఐ పగ్గాలు దక్కాయి.

కోటాపై సుప్రీంలో పిటిషన్

(మొదటిపేజీ తరువాయి) అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన 124 రాజ్యాంగ సవరణ బిల్లుకు రెండు రోజుల్లో పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. మంగళవారం లోక్‌సభ సభ్యులు దీనికి ఆమోద ముద్ర వేయగా.. బుధవారం రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని కొందరు అభిప్రాయపడినా.. చివరకు ఓటింగ్ దగ్గరకు వచ్చేసరికి అందరూ అనుకూలంగా ఓటువేశారు.

ఈ రిజర్వేషన్ వల్ల అగ్రవర్ణాల్లో బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు, జాట్లు, మరాఠాలు, భూమిహార్లు, వైశ్య, కమ్మ, కాపు, రెడ్డి, వెలమ, క్షత్రియ వంటి ఉన్నత సామాజిక వర్గాల ప్రజలు లబ్ధిపొందనున్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలకున్న 49.5శాతం రిజర్వేషన్లకు ఇది అదనం. దీంతో దేశంలో రిజర్వేషన్లు 59.5శాతం అవుతాయి. అయితే రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు గతంలో తీర్పు చెప్పింది. ప్రస్తుత బిల్లు ఈ తీర్పుకు వ్యతిరేకంగా ఉండటంతో దీనిపై న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది.

ఆక్వా రంగానికి రూ.6700 కోట్లు

(మొదటిపేజీ తరువాయి) దిగుమతులు మార్కెటింగ్ అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె వివరించారు. రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ కోస్తా తీరానికి దూరంగా ఉండే తెలంగాణ రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తులను పెంపొందించడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మంచినీటి ట్యాంకులు, చెరువులు కాలువల్లో చేపల పెంపకానికి ప్రోత్సహిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఫిషరీస్ కమిషనర్ డాక్టర్ సువర్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అనేక నీటిపారుదల ప్రాజెక్టులు రెండు, మూడు సంవత్సరాలలో పూర్తవుతాయని, ఈ ప్రాజెక్టులలో ఆక్వా ఉత్పత్తుల పెంపుకు కృషి చేస్తామన్నారు. ఇండియన్ ఫిషరీస్ అండ్ ఆక్వా కల్చర్ ఛైర్మన్ డాక్టర్ విజయగుప్తా, అధ్యక్షుడు వీ. రామచందర్‌రాజు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆక్వా రంగంలో అనుభవం ఉన్న అనేకమంది వ్యక్తులు, సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయని, చైనా వంటి దేశాలలో ఆక్వా ఉత్పత్తులకు మంచి స్పందన ఉందని, మన దేశంలో కూడా ఈ ఉత్పత్తుల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని వారు వివరించారు.

ఆదాయం పెంపుపై ఆర్టీసీ దృష్టి

(మొదటిపేజీ తరువాయి) గురువారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక నష్టాలను తగ్గించుకోవడంతో పాటు లాభాలను ఆర్జించడమే లక్ష్యంగా ఈ సమీక్ష సాగింది. గతేడాది నవంబర్ వరకూ లాభాల్లో ఉన్న డిపోలు, డివిజన్లు, రీజియన్ల వివరాలను అధికారులు వివరించారు. అదే విధంగా మార్చి–2019 వరకూ ఆదాయం పెంపు కోసం రూపొందించాల్సిన ప్రణాళికపై సమావేశంలో చర్చ జరిగింది. గతేడాది నవంబర్ నాటికి సర్వీసుల బ్రేక్‌డౌన్స్ వివరాలను వివరించారు. సంస్థకు వస్తున్న ఆదాయంలో బస్టాండ్లలోని షాపుల ద్వారా 2.5 శాతం వస్తున్న విషయాన్ని సమావేశంలో అధికారులు వివరించారు. అధికారుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్న ఇన్‌ఛార్జ్ ఎండీ సునీల్‌వర్మ టికెట్ల ధరతో సంబంధం లేకుండా ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. బస్సులను అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయాన్ని మరింత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. పండుగల సమయాల్లో ప్రత్యేక సర్వీసులు నడిపించడం ద్వారా ప్రయాణికులకు సేవలు అందించి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మెట్రోరైలు ప్రారంభమైన తర్వాత కొన్ని రూట్లలో నడుస్తున్న సర్వీసుల ద్వారా నష్టం వస్తుందన్న అంశంపై జరిగిన చర్చలో.. ఆయా రూట్లలో బస్సులను తగ్గించాలని నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. షాపుల అద్దెను 10 శాతం పెంచడం ద్వారా మరింత ఆదాయం వస్తుందని ఇన్‌చార్జ్ ఎండీ సునీల్ వర్మ సూచించినట్టు తెలిసింది. పెద్ద బస్టాండ్లలో నిర్మించ తలపెట్టిన 'మల్టిప్లెక్స్'ను తొందరగా పూర్తి చేయాలని, తద్వారా ఆదాయం పెరుగుతుందని చెప్పారు. నష్టాలు కలుగుతున్న రూట్లను లాభాలు కలిగే విధంగా చూడాలన్నారు. బస్సులు నడిపించడం ద్వారా లాభాలు వచ్చే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బస్‌పాస్‌ల వల్ల మరింత ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ విషయంలో విద్యార్థులు, ఉద్యోగులకు అవగాహన కల్పించాలన్నారు. డీజిల్ సర్వీసులను క్రమక్రమంగా తగ్గిస్తూ ఎలక్ట్రిక్ బస్సులను పెంచే అంశంపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. నగరంలో త్వరలోనే 40 ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించడంతో పాటు మరో 100 బస్సులను కూడా కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. బస్సు, మెట్రోరైలు, ఎంఎంటీఎస్ సర్వీసులకు ఒకే పాసు వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలన్న అంశంపై చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయానికి సమావేశంలో వచ్చినట్టు సమాచారం. కొత్తగా 1000 బస్సులను కొనుగోలు చేయాలన్న అంశంపై సమావేశం సుముఖత వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సమావేశానికి హాజరుకాని అధికారులపై ఎండీ సునీల్‌శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే.. సహించమని, వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అందరూ కలిసి పని చేస్తేనే సంస్థ లాభాల బాటలోకి వస్తుందన్నారు. సంస్థ నష్టాలు తగ్గించే అంశంపై ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. కాలం చెల్లిన బస్సులను నడిపించడం ద్వారా నష్టాలు మరింత పెరుగుతాయని, వాటిని స్క్రాప్ కింద అమ్మేయాలని ఆయన అధికారులకు సూచించారు. అధికారులు ఖర్చు తగ్గించుకోవాలని, తద్వారా నష్టాలు తగ్గుతాయని సూచించారు. సంస్థను లాభాల్లోకి తేవడానికి నిర్మాణాత్మక ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని ఆదేశించారు. వచ్చే 15 రోజుల్లో ఆర్ఎంలు, డీఎంలతో మరోసారి సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. తార్నాకాలోని ఆర్టీసీ ఆసుపత్రిలో కార్మికులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు మందుల కొరత విషయంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎం రవీందర్, పురుషోత్తం, వినోద్, రీజినల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికి ఇఎన్‌టీ వైద్యానికి సహకరిస్తాం: నోవా ఇఎన్‌టీ హాస్పిటల్



విజయక్రాంతి, హైదరాబాద్: పల్లె ప్రజలకు ఇఎన్‌టీ వైద్యాన్ని చేరువ చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి తమ వంతు సహకారం అందిస్తామని నోవా ఇఎన్‌టీ హాస్పిటల్ తెలిపింది. ఈ మేరకు నగరంలో జరిగిన అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపిక్ ఇయర్ సర్జరీ వర్కుషాపు ముగింపు కార్యక్రమంలో హాస్పిటల్ అధినేత డాక్టర్ యం.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, అవసరమైన ప్రజలందరికి ఇఎన్‌టీ శస్త్రచికిత్సలు చేయించాలనుకోవడం సంతోషమన్నారు. వినికిడి సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే కార్యక్రమాలకు తమ వంతు సహకారాన్ని ఆయన ప్రకటించారు. ఉన్నత స్థాయి వైద్యాన్ని మహానగరాల నుంచి పల్లెలకు తీసుకుపోయయినప్పుడే ఆరోగ్య వంతమైన సమాజం ఆవిర్భవిస్తుందన్నారు.

పంట కాలనీల ఏర్పాటు అద్భుతం



విజయక్రాంతి, రాజేంద్రనగర్: సీఎం కేసీఆర్ పంట కాలనీల ఏర్పాటు ఆలోచన అద్భుతమని, దేశమంతా ఆచరణీయమని భారత వ్యవసాయ పరిశోధనా మండలి అనుబంధ విభాగం నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ ల్యాండ్ యూజ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.సింగ్ అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగ అభివవృద్ధిలో, రైతాంగ సంక్షేమంలో పంట కాలనీల ఏర్పాటు ముందడుగు అని అన్నారు. గురువారం పంట కాలనీల ఏర్పాటుపై ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ విజయకుమార్, వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ జగదీశ్వర్, విస్తరణ సంచాలకులు డాక్టర్ రాజిరెడ్డి, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు నేలలు, నీరు ఇతర వనరుల్ని పరిగణలోకి తీసుకొని మండలాల వారిగా పంటలు, పంటల సరళి, ఉత్పత్తి, ఉత్పాదకతలపై మ్యాప్‌లను రూపొందించాలని సమావేశంలో తీర్మానించారు. వీటి రూపకల్పనలో నేషనల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ఉపకులపతి డాక్టర్ చిండి వాసుదేవప్ప, ఇతర శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. వ్యవసాయశాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన నివేదికను మరింత లోతుగా చర్చించడానికి ఫిబ్రవరి 5,6వ తేదీల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు తెలిపారు.

'నా ఆటో సురక్షితం'పై అవగాహన

విజయక్రాంతి, ముషీరాబాద్: నేరాలను అరికట్టడానికి శాంతిభద్రతలు అదుపులో ఉంచడానికి నా ఆటో సురక్షితం అవగాహన కార్యక్రమం గురువారం ముషీరాబాద్ నల్లకుంట కూరగాయల మార్కెట్ పరిధిలోని ఆటోస్టాండ్ వద్ద నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ఎంతోమందిని ప్రయాణికులను ఆటోలో గమ్యస్థానాలకు తరలిస్తున్నారని ప్రయాణికులకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా హైదరాబాద్ పోలీస్ తరపున ఆటో ఓనర్స్‌కు యూనిక్ రిజిస్ట్రేషన్ నెంబర్ నియమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రావణ్ కుమార్, ఏఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది నరసింహ, నాగార్జున, రాము, అం జి, రామకృష్ణ, యాదిరెడ్డి, నల్లకుంట ఆటో స్టాండ్ అధ్యక్షుడు లక్ష్మణ్, సిఐటియు సిటి సెక్రటరీ అజయ్ బాబు, సోమయ్య, మల్లేష్, నరసింహరాజు, బసవయ్య పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడే రాజకీయాలు

విజయక్రాంతి, బోడుప్పల్: ఓట్ల రాజకీయాలలో గెలుపోటములు సహజమని అయితే ఎన్నికలప్పుడు మాత్రామే రాజకీయాల గురించి మాట్లాడాలని గెలిచిన తర్వాత ప్రజల అభివృద్ధి, ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం నాడు బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని టీడీపీ, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు టీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తో కలిసి పాల్గొన్న ఆయన సభనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడుప్పల్ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. గతంలో ఈ ప్రాంతంలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉండేదని అలాంటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించి నేడు నీటి సమస్యలేకుండా చేసిన ఘనత కేవలం టీఆర్ఎస్ పార్టీ సర్కార్ కు మాత్రామే దక్కిందని అన్నారు. ప్రజలు అభివృద్ధి చేసే వారికే పట్టం కడుతారని 2018 లో జరిగిన ఎన్నికలలో నిరుపించారని అన్నారు. ఈ సందర్భంగా టీడీపీ బోడుప్పల్ పట్టణ అధ్యక్షులు మీసాల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బొమ్మక్ నర్సింగ్ రావు, బీజేపీ ప్రధాన కార్యదర్శి రాసాల మహేష్, ఎంపీటీసీ సభ్యులు తోటకూర విజయ్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు రవీందర్ యాదవ్, భాగ్యనగర్ సహకార బ్యాంక్ డైరక్టర్ బొమ్మక్ విశ్వనాధ్ లతో పాటు పలువురు నాయకులకు టీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.టీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో చిల్లా అనురాధ, మీసాల లత, తోటకూర శ్రీశైలం యాదవ్, జడిగే మహేందర్ యాదవ్, చిల్లా రమేష్, బొమ్మక్ రాము, మీసాల అర్జున్, రాజులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మండల జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, ఎంపీపీ బండారు శ్రీనావాస్ గౌడ్, ఎంపీటీసీలు ఉట్కూరి శారధ, ఎనుగు శోభారాణి, పోన్నం నిలిమా, నత్తి జంగమ్మ, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు నత్తి మైసయ్య, పట్టణ అధ్యక్షులు చెర్ల అంజనయులు, ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, నాయకులు కనక దుర్గ, మల్లేష్, రాసాల వెంకటేష్ యాదవ్, బొబ్బల లక్ష్మారెడ్డి, విజయ్‌లు పాల్గొన్నారు.

స్వామి వివేకానందుని స్ఫూర్తితో యువత ముందడగు

విజయక్రాంతి, అంబర్‌పేట్: స్వామి వివేకానందుని స్ఫూర్తితో యువత ముందడగు వేయాలని బీజేపీ గ్రేటర్ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. బీజేవైఎం నగర శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నారాయణగూడ వైఎంసీఏలో మిస్టర్ యువ బాడి బిల్డింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నగరం నుంచి రాష్ట్రం నలుమూలల నుంచి వందకు పైగా బాడి బిల్డర్లు పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారు. 50కిల్లలో నుంచి 100కిల్లలో కేటగిరి వరకు 10 విభాగాల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్ని మాట్లాడుతూ ఆరోగ్యకరమైన యువతనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిస్తుందని తెలిపారు. ఈ పోటీలో గెలిచిన ఛాంపియన్‌కు మిస్టర్ యువ టైటల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌గౌడ్, జాతీయ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి గౌతంరావు, ఆలె జితేంద్ర, రాష్ట్ర నాయకులు భవర్‌లాల్‌వర్మ, ఆలె భాస్కర్ రాజ్, రమేష్‌యాదవ్, యువమోర్చా జాతీయ నాయకులు లంగలి నరేందర్ రెడ్డి, నగర నాయకులు శ్యాంమోహన్, యువమోర్చా నాయకులు శివాజీ, శైలేందర్, రాజునేత, నగర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రాలను తనిఖీ చేసిన డిప్యూటీ కమిషనర్

విజయక్రాంతి, మెహిదిపట్నం: ఓటరు నమోదు కార్యక్రమం వివరాలను తెలుసుకొనెందుకు కార్వాన్ డిప్యూటి కమిషనర్ సుధామ్ము గుడిమల్కాపూర్‌తో పాటు పలు ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించారు.ఓటరు నమోదు కేంద్రంలోని ఓటరు లిస్టు వివరాలను పరిశిలించి,ఓటు హక్కు లేని వారు నమోదు చేసుకొవాలని తెలిపారు .ఈ అవకాశాన్ని ప్రజలందరు వినియోగించుకొవాలని కోరారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

విజయక్రాంతి, అంబర్‌పేట్: గోల్నాక డివిజన్‌లోని నింబోలిఅడ్డ మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ డివిజన్ లోని పలు బస్తీలలో జీహెచ్ఎంసీ, జలమండలి ఇతర విభాగాల అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. స్థానికంగా ఉండే సమస్యలు కొత్తగా కవాల్సిన మౌలిక సాదుపయలు ఏర్పాటు దిశగా పాదయాత్ర కార్యక్రమం జరిగింది. కాచిబస్తీలో 10 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన మంచినీటి పైప్‌లైన్, డ్రైనేజీ వ్యవస్థ వలన కలుషిత నీరు వస్తుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జలమండలి అధికారులు వెంటనే మెయిన్ లైన్స్, సబ్‌లైన్స్‌లో నూతనంగా పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాధనలు సిద్ధం చేయాల్సిందిగా సూచించారు. ఎస్సీ హాస్టల్ లైన్‌లో 32లక్షలతో నిర్మిస్తున్న వీడీసీసీ రోడ్డు పనుల టెంబర్ ప్రక్రియ పుర్తిగానే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు డీఎంసీ కృష్ణయ్య, ఈఈ నిత్యానందం, ఏఈలు సుధాకర్, ఫరిద్, దివ్యతేజ, మనోహర్, ఏఎంఓహెచ్ హేమలత, జలమండలి అధికారులు ఏఈ మహేందర్ రెడ్డి, షాకీర్, ట్రాన్స్‌కో ఏఈ వేణు, జీహెచ్ఎంసీ స్ట్రీట్ లైట్స్ ఏఈ హరిబాబు, విజయ్, ఎంటామలజీ వెంకటయ్య, టీఆర్ఎస్ నాయకులు ఓంప్రకాశ్‌యాదవ్, పి.శ్రీనివాస్, రవిందర్‌యాదవ్, దిడ్డి రాంబాబు, నర్సింగ్‌బాబు, నాగేందర్‌బాబ్జి, ఎం.సాయిబాబా, సత్యనందర్, దేవిరెడ్డి విజితారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, అనీల్‌యాదవ్, దాడిగే జగన్‌యాదవ్, శ్రీకాంత్, యూసుఫ్, సాబేర్‌బాయి, పి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తా



విజయక్రాంతి, ఎల్బీనగర్: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పాథకాలు అందేలా కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట్ డివిజన్ కర్మాన్‌ఘాట్ తూర్పు కాపు సంక్షేమ సంఘం సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ సంఘం నాయకులు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చాలా మందికి రేషన్ కార్డ్స్ లేవని, భర్త చనిపోయిన మహిళలకు వితంతు పింఛన్ ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు తమ తమ ఆధార్ కార్డు దానికి సంబంధించిన పత్రాలు జత చేసి తన నివాసంలో లేదా స్థానిక నాయకులకు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంజీవ, మధుసూదన్, లోకేశ్వర్‌రావు, నీలం నాయుడు, సంతోష్, బాల కృష్ణ, పల్గుణరావు, సోమేశ్వరరావు, నాయకులు చంపాపేట్ డివిజన్ అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి, మల్లేష్‌గౌడ్, అంజిరెడ్డి, యాదిరెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఉమ మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధిచెప్పాలి



విజయక్రాంతి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఓటు బ్యాంక్‌లా చూస్తోందని ఆరోపించారు. బీసీల క్రిమిలేయర్ ఇప్పటి వరకు ఎత్తి వేయలేద న్నారు. క్రిమిలేయర్ ఎత్తేయడానికి రా హుల్ చొరవ చూపాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధిచెప్పాలని వీహెచ్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా గ్రామ పంచాయతీలలో ఓబీసీ వారికి అనుకూలంగా మార్చారన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



విజయక్రాంతి, ఉప్పల్: సాయి వికాస్ స్కూల్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి సంక్రాంతి సంబరాలకు ముఖ్యఅతిధిగా హాజరై పిల్లలను బోగి పండ్లు అక్షింతలతో ఆశీర్వదించారు. గురువారం ఉప్పల్ డివిజన్‌లోని సాయివికాస్ స్కూల్లో జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, బాగా చదువుకొని దేశానికి పేరు తీసుకు రావాలని అన్నారు. స్కూల్ కరస్పాండెంట్ ఎండి.జాహింగిర్ మాట్లాడుతూ దేశ సమగ్రత ,సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా హిందూ, ముస్లిం, క్రిష్టియన్, సిక్కుల బేదాలు లేకుండా ప్రతి సవంత్సరం అన్ని పండుగలు సమానంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ముత్యాల ముగ్గులు వేసి ప్రతిభను చాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.సృజన, రాజశేఖర్, రమాదేవి, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంతోష్‌రెడ్డి బృందం, వార్డు మెంబర్ యాదిరెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి, అరటికాయల భాస్కర్, జనుంపల్లి వెంకటేశ్వరెడ్డి , టీఆర్ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మేడిపల్లి రైతు బజార్

• అధికారుల అలసత్వం

విజయక్రాంతి, బోడుప్పల్: రైతులు పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధర కల్పించి దళారుల బేడద నుంచి వారిని కాపాడి ప్రజలకు తాజా కురగాయలు అందించడం కోసం ప్రభుత్వం లక్షల రుపాయాలు వెచ్చించి రైతు బజార్లను ఏర్పాటు చేసింది. అయితే అధికారుల అలసత్వమా లేక సమన్వయ లోపమా తెలీదు కానీ రైతు బజార్ ఆదరణ కోల్పోయింది. బోడుప్పల్, ఫీర్జాదీగుడ పురపాలక సంఘం పరిధిలోని ప్రజల ఆవసరాల నిమిత్తం మేడిపల్లి కేంద్రంలో సుమారు రూ.65 లక్షల వ్యయంతో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానంగా రైతు బజారును ఏర్పాటు చేశారు. దీనిని 2015 జూన్ 29 న అప్పటి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రారంభించారు. రైతు బజార్ల ద్వారా కూరగాయలు పండించిన రైతులకు, తాజా కూరగాయల కోసం వచ్చే వినియోగదారుల ప్రయోజనాల కోసం ఈ రైతు బజారులు నెలకొల్పారు.

నెరవేరని సర్కార్ లక్ష్యం

లక్షలు వెచ్చించి రైతు బజార్లను ఏర్పాటు చేసినా అవి నిరుపయోగంగా తయారయ్యాయి. దీనికి ప్రధాన కారణం అధికారుల అలసత్వమే అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే బోడుప్పల్, ఫీర్జాదీగూడ పురపాలక సంఘాల పరిధిలో సూమారు 2.50 లక్షల జనాభా ఉంటుంది. వీరిని దృష్టిలో ఉంచుకుని అందరికి అందుబాటులో ఉండేలా మేడిపల్లి ప్రాంతంలో



రైతు బజారును నిర్మించారు. ఈ ప్రాంతంలో రైతు బజారును నిర్మించిన విషయం చాలా మందికి తెలీదు. దీనికి తోడు ఈ రెండు పురపాలక సంఘాల పరిధిలో అనేక కాలనీల్లో వారాంతపు సంతల నిర్వహణ కారణంగా కూడా రైతు బజార్లకు రైతులు, కొనుగోలు దారులు రావడం లేదు.


ఇబ్బందులు పడుతున్న రైతులు

రైతులు తమ పొలాల్లో పండించిన కూరగాయలను నేరుగా ప్రజలకు విక్రయించి తమ కష్టానికి తగిన ఫలితం పొందొచ్చని అనుకున్న రైతుల సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. అయితే ప్రతిరోజు ఇక్కడికి వినియోగదారుల రాకపోవడంతో కూరగాయలు అమ్మేందుకు వచ్చిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో ఒకరోజు వచ్చిన రైతులు మరో రోజు రావడం లేదు.

ప్రశ్నార్థకంగా మేడిపల్లి రైతు బజారు

లక్షల వ్యయంతో నిర్మించిన రైతు బజారు భవిష్యత్తు నేడు ప్రశ్నార్థకంగా మారింది. నాడు మార్కెటింగ్ శాఖమంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఇద్దరు కలిసి రైతులను కష్టాల నుంచి కాపాడడం కోసమే రైతు బజార్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కానీ నేడు ఏర్పాటు చేసిన రైతు బజారు తన లక్ష్యం మరిచి దాని ఉనికే ప్రశ్నార్థకంగా ఉంటే కనీసం పట్టించుకోకపోవడం పట్ల శ్రద్ధ ఏపాటిదో అర్థం అవుతోంది.

ప్రచారం కల్పించాలి



లక్షల రుపాయలు వెచ్చించి రైతుల సంక్షేమం కోసం రైతు బజారును ఏర్పాటు చేసినా కూడా అది నేడు నిరుపయోగంగా తయారైంది. దీనికి ప్ర ధాన కారణం అధికారుల అలసత్వమని స్పష్టం అవుతుంది. ఇంత ఖర్చు చేసిన రైతు బజార్లను ఏర్పాటు చేసిన సర్కార్ దాని అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం దారుణమైన అంశంగా చెప్పాలి. ముందుగా గొప్పలు చెప్పడం ఆపి రైతు బజారును అందరికీ వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

కూతాడి నర్సింహ్మా, మాజీ ఎంపీటీసీ మేడిపల్లి

కుంభమేళా కోసం ప్రయాగ్‌లో హాల్ట్

విజయక్రాంతి, హైదరాబాద్: కుంభమేళా కోసం ఉత్తర రైల్వే జోన్ పలు రైళ్లను ప్రయాగ్ స్టేషన్‌లో తాత్కాలికంగా ఆపాలని నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం మేరకు జనవరి 13వ తేదీ నుంచి మార్చి 5వ తేదీ వరకు 8 రైళ్లు ఒక నిమిషం పాటు ప్రయాగ్ స్టేషన్‌లో ఆగుతాయి. యశ్వంత్‌పూర్ – లక్నో ఎక్స్‌ప్రెస్, లక్నో – యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ – ఛాప్రా గంగా కావేరీ ఎక్స్‌ప్రెస్, ఛాప్రా – చెన్నై సెంట్రల్ గంగా కావేరీ ఎక్స్‌ప్రెస్, రామేశ్వరం – ఫైజాబాద్ జంక్షన్ శ్రద్ధ సేతు ఎక్స్‌ప్రెస్, ఫైజాబాద్ జంక్షన్ – రామేశ్వరం శ్రద్ధ సేతు ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ – లక్నో ఎక్స్‌ప్రెస్, లక్నో – యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు ఆగుతాయి.

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా



విజయక్రాంతి, కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి మండల్ నిజాంపేట్ రాజీవ్ గృహ కల్ప కాలనీ మహిళలు నీటి కోసం రోడ్లపై ధర్నా నిర్వహించారు. నిజాంపేట్ రాజీవ్‌గృహ కల్పలో గత పదిరోజులుగా నీరు రాక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నిసార్లు జలమండలి అధికారులకు, గ్రామ పంచాయితీ అధికారులకు, స్థానికనాయకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో రాజీవ్ గృహ కల్పలోని మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లపై వచ్చి ధర్నా చేపట్టారు. ఎన్నికల సమయంలో వాగ్ధానాలు చేసిన నాయకులు ఎన్నికల తర్వాత మోహం చాటేస్తున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగడానికి 30 రూపాయలు వెచ్చించి 20 లీటర్ల వాటర్ డబ్బా తీసుకుంటున్నామని తెలిపారు. గత పదిరోజులుగా నీటిసరఫరా లేకపోవడంతో కనీస అవసరాలను నిమిత్తం ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా ఒక్క డ్రమ్ము 100 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నీటితో కనీస అవసరాలు తీర్చుకుందామని అనుకుంటే వాటి వలన చర్మం దద్దుర్లు ఏర్పడి, చర్మ వ్యాధులు వస్తున్నాయని అనారోగ్యం పాలవుతున్నామని వాపోయారు. మహిళలు ధర్నాకు దిగారన్నా సమాచారం తెలుసుకున్న నిజాంపేట్ గ్రామా కార్యదర్శి దుర్గా ప్రసాద్ అక్కడికి చేరుకొని మహిళలతో మాట్లాడి నీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని నచ్చ చెప్పడంతో మహిళలు శాంతించారు.

ఎన్నికలకు నిధుల కొరత!

- గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్ వాడుకోవాలని జిల్లా కలెక్టర్ల మౌఖిక ఆదేశాలు
- పట్టించుకోని రాష్ట్ర ఎన్నికల సంఘం



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు నిధుల కొరత ఏర్పడింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ రాష్ట్ర ఎన్నికల సంఘం నిధులను విడుదల చేయలేదు. తొలి విడత గ్రామ పంచాయతీల్లో నామినేషన్ల ప్రక్రియ బుధవారంతో పూర్తయిన విషయం తెలిసిందే. కానీ ఇప్పటి వరకూ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం చిల్లీగవ్వ విడుదల చేయలేదు. దీంతో మండల ప్రజాపరిషత్ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికల జరుపుటకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాల్లో పలుధపాలుగా జిల్లా కలెక్టర్లు సమావేశాలను నిర్వహించారు. కానీ నిధుల మంజూరు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపిస్తున్నారు. విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘంగానీ, ప్రభుత్వంగానీ స్పందించడం లేదని తెలిసింది. ఈ అంశంపై జిల్లా కలెక్టర్లు నేరుగా ఎన్నికల సంఘానికి అడగలేక ఎంపీడీఓలను బుజ్జగిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం విడుదల చేసే వరకూ మండల పరిషత్ జనరల్ ఫండ్ నుంచి వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్లు మౌఖిక ఆదేశాలను జారీచేసినట్లు తెలిసింది. దీంతో జనరల్ ఫండ్‌ను వినియోగించుకోలేక ఎంపీడీఓలు తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. జనరల్ ఫండ్‌ను వినియోగించుకోవాలంటే తప్పనిసరిగా మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ఆ సమావేశంలోనే జనరల్ ఫండ్‌పై సభ్యులు తీర్మానం చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటికిప్పుడే జనరల్ బాడీ సమావేశం నిర్వహించలేక, నిధులను వినియోగించుకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది.


రాష్ట్రంలో చాలా మండల పరిషత్ కార్యాలయాల్లో జనరల్ ఫండ్ నిధులు లేవని తెలిసింది. దీంతో జనరల్ ఫండ్ లేని మండలాలు ఎక్కడి నుంచి నిధులను డ్రా చేసుకోవాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. గ్రామ పంచాయతీ ఎన్నికల సామాగ్రి, నామినేషన్ల పత్రాలను 30శాతమే సరఫరా చేసి జిరాక్స్‌లు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. మిగతా సామాగ్రి సమకూర్చుకోకుండా ఎన్నికల సంఘం చేతులు దులుపుకున్నారు.

నిధులపై సందిగ్ధం

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోనే అతి పెద్ద మండలం బాలానగర్‌లో 31 గ్రామ పంచాయతీలుండగా వాటి నుంచి రాజాపూర్ మండలాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బాలానగర్‌లో 37, రాజాపూర్‌లో 24 గ్రామాలున్నాయి. కానీ మండల పరిషత్‌లు ఇంకా విభజన జరగకపోవడంతో పాత మండలం నుంచే జనరల్ ఫండ్ తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో రెండు మండలాల్లో 61 గ్రామ పంచాయితీలు, 506 వార్డులకు నిధులను ఎక్కడి నుంచి వినియోగించుకోవాలనే సందిగ్ధంలో ఎంపీడీఓలు ఉన్నట్లు తెలిసింది.

మహబూబ్ నగర్ జిల్లాలో కేంద్రం నుంచి సుమారు (540) బ్యాలెట్ బాక్సులను మండల కేంద్రానికి ప్రైవేట్ వాహనంలో తీసుకొని వచ్చి వాటిని సరఫరా చేసేందుకు కిరాయి చార్జీలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నట్లు తెలిసింది. అంతేకాకుండా పోలింగ్‌రోజు విధుల్లో ఉండే సిబ్బందికి వసతుల నిర్వహణతో పాటు భోజనం ఖర్చులు, ఎన్నికల భత్యం ఏ నిధుల నుంచి ఇవ్వాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు రెండో విడత కూడా శనివారంనాడు నోటిఫికేషన్ విడుదల కానున్నది. దీంతో ఇప్పటి వరకూ ఎన్నికల సంఘం నిధులు విడుదల చేయకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొనే ప్రమాదముందని తెలుస్తోంది.

సర్కార్‌కు విరాళంగా వృద్ధాశ్రమం



విజయక్రాంతి, హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామంలో నిర్మించిన మేరెడ్డి సత్యనారాయణ రెడ్డి జానకమ్మ వానప్రస్థాశ్రమాన్ని ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఆశ్రమ నిర్మాతలు మేరెడ్డి సత్యనారాయణ రెడ్డి, జానకమ్మ దంపతులు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటి. రామారావుని కలిసి పూర్తి వివరాలు అందించారు. ఎకరంన్నర భూమిలో దాదాపు ఆరు వేల చదరపు అడుగుల భవనాన్ని సొంత ఖర్చులతో నిర్మించామని, అనారోగ్యం రీత్యా భవనంతో పాటు పూర్తి ఆశ్రమాన్ని ప్రభుత్వానికి విరాళం ఇవ్వడం ద్వారా వృద్ధులకు సేవలు కొనసాగేలా చూడాలని కేటీఆర్‌ని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్‌తో మాట్లాడతారని, మీరు ప్రారంభించిన ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగించేలా ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందేలా చూస్తామని దంపతులకు కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దంపతుల సేవా దృక్పథాన్ని, దాతృత్వాన్ని కేటీఆర్ కొనియాడారు.

మహిళలు, అమ్మాయిలపై అఘాయిత్యాలను అరికట్టాలి

విజయక్రాంతి, ఉప్పల్: అమ్మాయిలపై, మహిళలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టాలని సేవ్ గర్ల్స్ సేవ్‌నేషన్ కార్యక్రమంలో వక్తలు కోరారు. రామంతాపూర్‌లోని పిప్స్ కాలేజీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పడాల శంకర్ హాజరై మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 సవంత్సరాలు గడిచినా మహిళలపై, అమ్మాయిలపై దాడులు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, కామాంధుల అరాచకాలు శ్రుతి మించుతున్నాయని అన్నారు. స్కూలు స్థాయి నుంచి కాలేజీ స్థాయి వరకు అమ్మాయిలు బాహ్య ప్రపంచానికి వెళ్ళాలంటే తల్లిదండ్రులు భయపడే స్థితిలో ప్రస్తుత సమాజం తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా భారత విద్యార్థి పెడరేషన్ తరపున జనవరి 1 నుంచి 10 వరకు అమ్మాయిలను కాపాడుదాం హింసాకాండను అరికడుదాం, జాతీయతను కాపాడుదాం నినాదంతో ప్రభుత్వాలు మేల్కొనే కార్యక్రమా లను చేపడుతున్నామని ఆయన తెలిపారు. మహిళ లపై వివక్షను రూపుమాపేందుకు, వారిపై జరుగుతున్న దాడులను అరికట్టడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిచందర్, శ్రీకాంత్, విద్యార్థులు హాలియా, శ్వేత, అవంతి, భావన, అనూష పాల్గొన్నారు.

ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన సర్వే



విజయక్రాంతి, ఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ నుంచి తనను సస్పెండ్ చెయ్యడాన్ని ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ ఆశ్చర్యం వ్యక్తం చేసిందని మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ తెలిపారు. తనను పార్టీ నుంచి పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సస్పెండ్ చెయ్యడంపై గురువారం ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ ముందు సర్వే హాజరయ్యారు. క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ ఏకే ఆంటోనిని కలిసి సస్పెన్షన్ అంశంపై వివరణ ఇచ్చారు. అయితే క్రమశిక్షణ కమిటీ తనను సస్పెండ్ చేశారని చెబితే ఆశ్చర్యం వ్యక్తం చేసిందని సర్వే సత్యనారాయణ మీడియాకు స్పష్టం చేశారు. నిన్ను సస్పెండ్ చేయడమేంటని ఆంటోని అడిగినట్లు చెప్పుకొచ్చారు. డోంట్ వర్రీ, ఫిర్యాదు రాసి ఇవ్వమన్నారని తెలిపారు. మరోవైపు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ కుంతియాపై విరుచుకుపడ్డారు. ఉత్తమ్, కుంతియాల వల్లే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందని విమర్శించారు. తనను సస్పెండ్ చేసే అధికారం ఉత్తమ్‌కు లేదన్నారు. పీసీసీ అధ్యక్ష పదవి నుంచి ఉత్తమ్‌ను బర్తరఫ్ చేయాలని సర్వే సత్యనారాయణ డిమాండ్ చేశారు. కొత్త నాయకత్వానికి ఆ బాధ్యతలు అప్పగించాలని కోరారు. తాను సోనియా కుటుంబానికి నమ్మిన బంటునని, అలాంటిది తననే సస్పెండ్ చేస్తారా అంటూ సర్వే ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

విజయక్రాంతి, శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సంక్రాంతి సందర్భంగా గురువారం పలు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. లింగంపల్లిలోని త్రివేణి పాఠశాల, తారానగర్‌లోని ఆక్స్‌ఫర్డు పాఠశాల పాపిరెడ్డి కాలనీలోని రాగం నాగేందర్ యాదవ్ సహకారంతో నడుపుతున్న పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు, ముగ్గుల పోటీలు వంటి పలు కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు ఛైర్ పర్సన్ రాగం సుజాతా నాగేందర్ యాదవ్, జర్నలిస్టు కొండా విజయ్‌లు పాల్గొన్నారు.

మోదీ రూల్‌బుక్‌ను పాటించాలి

విజయక్రాంతి, హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ రూల్‌బుక్‌ను ఏ విధంగా అమలు చేయాలో నేర్చుకోవాలని టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి అన్నారు. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మను తిరిగి నియమించాలని సుప్రీంకోర్టు చెప్పడమంటే నరేంద్రమోడీపై నేరుగా నేరారోపణ చేసినట్టేనని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు మోడీ ప్రభుత్వం సీబీఐ లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ఏ విధంగా జోక్యం చేసుకుంటుందో, అలోక్‌వర్మ లాంటి వారిని బలవంతంగా సెలవులపై పంపించడాన్ని బహిర్గతం చేసిందన్నారు. సీబీఐ లాంటి ప్రజాస్వామిక సంస్థలను తమ చెప్పుచేతల్లో ఉంచుకోవాలనుకున్న బీజేపీ ఆలోచనలను సుప్రీంకోర్టు తిప్పికొట్టిందన్నారు. రఫేల్‌పై సీబీఐ విచారణ జరుపుతుందనే భయంతోనే మోదీ ప్రభుత్వం ఇలాంటి చర్యకు పూనుకుందన్నారు. మోదీ ప్రభుత్వం రూ.40 వేల కోట్ల స్కాంకు పాల్పడిందన్నారు. రూ.526 కోట్ల విలువైన ఒక్కో విమానం ధరను ఒప్పందంలో రూ. 1600 కోట్లకు పెంచారన్నారు. 137 విమానాల కొను గోలు స్థానంలో 36కు తగ్గించారన్నారు. యుద్ధ విమానాల తయారిలో అనుభవమున్న హెచ్ఏఎల్‌ను కాదని అనిల్ అంబానీతో ఒప్పందం చేసుకున్నారని ఆయన విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నుండి తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా గుణపాఠం నేర్చుకోవాలన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో సుప్రీంకోర్టు ప్రశంసనీయమైన పాత్ర పోషించిందని గూడూరు అన్నారు.

ఉద్యోగుల సమస్యలపై చర్చ

టీఎస్‌హెచ్ ఎంఈయూ

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ స్వచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రథమ సమావేశం గురువారం జీహెచ్‌ఎంసీలో జరిగింది. ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు పల్లె బాలనర్సింగరావు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి ఓ.శంకర్, గౌరవ అధ్యక్షులు విఠల్ రావు కులకర్ణి ఇతర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. జీహెచ్ఎంసీ కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించినట్లు, ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కలిసి కోరాలని నిర్ణయించినట్లు పల్లె బాలనర్సింగరావు ఓ ప్రటకనలో తెలిపారు.

దంతవైద్య కళాశాల వజ్రోత్సవ సంబురాలు

- ఈ నెల 11,12 తేదీలలో వేడుకలు
- వెల్లడించిన అలుమ్నీ అసోసియేషన్ ప్రతినిధులు



విజయక్రాంతి, ఖైరతాబాద్: ప్రభుత్వ దంత వైద్య కళాశాల వజ్రోత్సవ వేడుకలను ఈ నెల 11, 12 తేదీలలో జరుపనున్నట్లు అలుమ్నీ అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ 1959వ సంవత్సరంలో స్థాపించబడిన ఈ కళాశాల ఇప్పుడు 60 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతోందని తెలిపారు. వైద్య కళాశాల వజ్రోత్సవ వేడుకలు 11, 12 వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కళాశాలలో ఇంతకుముందు దంత వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్లు అంతా కలిసి అసోసియేషన్‌గా ఏర్పడి ఈ కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అలు మ్నీ అసోసియేషన్ ప్రముఖ దంత వైద్యులు పద్మశ్రీ డాక్టర్ ఎస్. నారాయణ అధ్యక్షుడుగా మరొక ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ బి. చంద్ర కాంతరావు వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. దేశ విదేశాల నుంచి దాదాపు 60 మంది దంత వైద్యులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు ప్రతినిధులు వెల్లడించారు. 11వ తేదీ ఉదయం దంత వైద్య కళాశాలలో ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొనబోతున్నట్లు తెలిపారు. 12వ తేదీన నగర శివారులో ఉన్న శామీర్ పేట్‌లోని లియోనియా రిసార్ట్స్‌లో ఉత్సవాలు ఘనంగా జరుపు తామని వివరించారు.

బల్దియా బడ్జెట్.. 15 తీర్మానాలకు ఆమోదం

- 2019–20కు బడ్జెట్ రూ. 6150 కోట్లకు స్టాండింగ్ కమిటీ ఆమోదం



విజయక్రాంతి, హైదరాబాద్: జీహెచ్ఎంసీ 2019–20 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ముసాయిదాను గ్రేటర్ బల్దియా స్థాయిసంఘం గురువారం ఆమోదించింది. బడ్జెట్ స్థాయి సంఘం ఆమోదంతో తొలి దశ ముగిసినట్లైంది. మరో రెండు దశలు మిగిలి ఉన్నాయి. రెండోది సర్వసభ్య సమావేశంలో చర్చ జరిపి ఆమోదించటమైతే తుదిదశలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం రావాల్సి ఉంటుంది. నగర మేయర్ బొంతు రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ స్టాండింగ్ కమిటీ సమావేశానికి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఎం.దానకిషోర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు గొల్లూరి అంజయ్య, ముద్దగౌని లక్ష్మిప్రసన్న, స్వర్ణలత సింగిరెడ్డి, మహ్మద్ ముర్తుజ అలీ, నస్రీన సుల్తాన, మహ్మద్ ముబిన్, ఎ.కృష్ణ, మహ్మద్ మాజిద్ హుస్సేన్, ఎన్.శేషుకుమారి, తూము శ్రవణ్ కుమార్, ఎ.సరస్వతిలు పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు హరిచందన, అద్వైత్ కుమార్ సింగ్, కెనడి, రవికిరణ్, దేవేందర్రెడ్డి, రఘుప్రసాద్, శ్రీనివాస్రెడ్డి, శంకరయ్య, జియాఉద్దీన్, శ్రీధర్, సురేష్ తదితరులు హాజరయ్యారు. 2019–20 సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలను గత డిసెంబర్ 20వ తేదీన జరిగిన స్టాండింగ్ కమిటీలో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌పై నేటి స్టాండింగ్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించి ఆమోదించారు. అనంతరం ఈ బడ్జెట్‌ను జనరల్ బాడి సమావేశంలో చర్చించి తుది బడ్జెట్ తీర్మానాన్ని ప్రభుత్వ ఆమోదం కోసం ఫిబ్రవరి 20వ తేదీలోపు పంపించాల్సి ఉంటుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఎం. దాన కిషోర్ స్టాండింగ్ కమిటీకి తెలిపారు.

ముసాయిదా వివరాలు..

2018–19 ఆమోదిత బడ్జెట్ రూ. 6076.86 కోట్లు కాగా సవరించిన బడ్జెట్ మొత్తం రూ. 5375 కోట్లు,2019–20 కు ప్రతిపాదిత బడ్జెట్ మొత్తం రూ. 6150 కోట్లు,మేజర్ ప్రాజెక్టులకు ప్రతిపాదిత బడ్జెట్ మొత్తం రూ. 5388 కోట్లు,2019–20 ప్రతిపాదిత మొత్తం బడ్జెట్ రూ. 11538 కోట్లు. బడ్జెట్‌తో పాటు మరో 15 ఎజెండా అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ముందుకు వచ్చిన ఆపిల్ హోంకు అనుమతి జారీ.15. రిటైర్డ్ వాల్యువేషన్ అధికారి ఎన్.మురళీధర్ సేవలను జూన్ 2019 వరకు పొడిగించే తీర్మానాలకు ఆమోదం.



నిద్రలేమితో లక్ష కోట్ల డాలర్ల నష్టం!

మనుషులు సరిగా నిద్రపోకపోతే ఇంతవరకు అనారోగ్యానికి గురవుతారనే మాత్రం తెలుసు. నిద్రలేమి ఆర్థిక నష్టాలకు కారణమవుతోందన్న విషయం తాజా సర్వేలో వెల్లడయ్యింది. ఉద్యోగులు సరిగా నిద్రపోకపోవటం వలన కంపెనీలకు కోట్ల రూపాయల నష్టం వస్తోందని రాండ్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. తగిన సమయం నిద్రపోకపోతే మనిషి ఆరోగ్యంగా ఉండలేడు. ఆరోగ్యంగా లేకపోతే సరిగా పనిచేయలేడు. ఈ సమస్య ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెద్ద కంపెనీలకు నష్టం కలిగిస్తోంది. నిద్రలేమి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా లక్ష కోట్ల డాలర్ల మేర నష్టపోతున్నట్లు తాజా సర్వేలో తేలింది. రాండ్ అనే సంస్థ 34 ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) దేశాల్లో సర్వే నిర్వహించి ఈ వివరాలు వెల్లడించింది. ఉద్యోగులు తమ పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్తున్నారు. ఇళ్ళ దగ్గర పని చేస్తుండటం వల్ల రాత్రులు సరిగా నిద్రపోవడం లేదు. తగిన విశ్రాంతి లేకుండానే మళ్లీ ఆఫీసులకు వస్తుండటం వల్ల ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల వలన కంపెనీలు భారీ నష్టాలు బారిన పడుతున్నాయి. అభివృద్ధి విషయంలో ప్రపంచంలో ముందుండే అమెరికా నిద్రలేమి కారణంగా ఎక్కువగా నష్టపోతున్న దేశాల్లోనూ ముందువరుసలో ఉండడం విశేషం. నిద్రలేమి కారణంగా అమెరికా ఏటా 41,100 కోట్ల డాలర్లు నష్టపోతున్నట్లు తేలింది. 13,800 కోట్ల డాలర్ల నష్టంతో జపాన్ రెండో స్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో జర్మనీ, యూకే, కెనడా ఉన్నాయి. ఇక ఎక్కువ ఉద్యోగులుండే భారత్, చైనాలలో నిద్రలేమితో జరుగుతున్న నష్టాలను ఇప్పటి వరకు ఎవరూ లెక్కించలేదు. నిద్రలేమితో కలుగుతున్న నష్టాలను పూడ్చుకోవడానికి జపాన్‌లోని కొన్ని కంపెనీలు ఇప్పటికే చర్యలు మొదలుపెట్టాయి. ఇందులో భాగంగా ఉద్యోగులు కొంతసేపు కునుకు తీయడానికి ఆఫీసుల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాయి.

ఉత్సవ విగ్రహంగా ఉన్నత విద్యా మండలి!!

ఉన్నత విద్యా రంగ ప్రమాణాలను ఉద్ధరించే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్) పరిస్థితి ఇప్పుడు విగ్రహ పుష్టి.. నైవేద్య నష్టి. కానీ గత నాలుగేళ్ళుగా ఉన్నత విద్యా మండలి మూలనున్న ముసలమ్మ ఇచ్చే సలహాల్లాంటి సిఫార్సులను ఇస్తున్నదే తప్ప ఖచ్చితమైన విధానాలు, కఠినమైన నిర్ణయలను అమలు చేసిన దాఖలాలు లేవు.

నిజానికి ఉన్నత విద్యా మండలి డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ కాలేజీలపై ఆజమాయిషీ చేయాలి. సంస్కరణలకు ప్రాణం పోయాలన్నా, ప్రమాణాలను నిర్ధారించాలన్నా ఉన్నత విద్యా మండలిదే చివరి మాట. కానీ తెలంగాణ ఏర్పడిన తరువాత నుంచి ఇది ఒక ఉత్సవ విగ్రహంగా మాత్రమే మిగిలింది. విషాదం ఏమిటంటే రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థల వివరాలు, అవి నిర్వహిస్తున్న కోర్సులు, ఒక్కో కోర్సుకు మంజూరైన సీట్లు వంటి వివరాలను కూడా ఉన్నత విద్యా సంస్థ సేకరించలేకపోయింది. అంతే కాదు, ఈ మధ్యే కొందరు వైస్ చాన్స్‌లర్లపై రకరకాల ఫిర్యాదులు వస్తే వాటిని విచారించేందుకు ఏర్పడిన కమిటీలు పుణ్యకాలం గడిచినా నివేదికలు తయారు చేయలేకపోయాయి. ఈ కారణంగా తెలంగాణ ప్రభుత్వం ఉన్నత విద్యా మండలి పనితీరును తీవ్రంగా అభిశంసించింది కూడా. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పూ రాలేదు.

ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో అవకతవకలపై విచారణ చేసేందుకు ఉన్నత విద్యామండలి ఏర్పాటు చేసిన కమిటీ తన పర్యటననే రద్దు చేసుకోవాల్సి వచ్చింది. యూనివర్సిటీ అధికారులకు కమిటీ రాక గురించి ముందస్తు సమాచారం అందడం వల్లే వారు అప్రమత్తమయ్యారు. దీంతో వెళ్లి లాభం లేదని కమిటీ పర్యటనను వాయిదా వేసుకుంది. ఆ తరువాత ఇప్పటి వరకూ కమిటీ వెళ్లలేదు. విచారణ నివేదిక అందలేదు. ఇలాగే కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పరీక్షల్లో కొన్ని కొన్ని విషయాల్లో విద్యార్థులకు వందకు 115 మార్కులు వచ్చాయి. ఈ నిర్లక్ష్యానికి కారకులపై ఇప్పటి వరకూ చర్యలు లేవు. కొన్ని కొన్ని నియామకాల విషయంలోనూ అవకతవకలున్నట్టు తేలినా ఎలాంటి చర్యలూ లేవు. మొత్తానికి పుల్లయ్య వేమవరం వెళ్లనూ వెళ్లాడు. రానూ వచ్చాడన్నట్టు తూతూ మంత్రం పద్ధతిలో పనులు జరుగుతున్నాయి.

ఉన్నత విద్యామండలి రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలను ఏ మాత్రం నియంత్రించలేకపోవడం ఒక కఠోరమైన నిజం. ఆయా విశ్వవిద్యాలయాలలోని కోర్సులు, సీట్లు, సీట్ల భర్తీ వంటి వివరాలను సైతం మండలి సేకరించడంలో విఫలమైంది. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలను ఆన్ లైన్ విధానంలో భర్తీ చేస్తున్న నేపథ్యంలో యూనివర్సిటీల వారీగా, వాటి అంతర్గతంగా పనిచేసే కాలేజీల వారీగా వివరాలను మండలి కోరింది. కానీ యూనివర్సిటీలు అరకొరగా, అసమగ్రంగా వివరాలను అందచేశాయి. అదే విధంగా గత ఏడాది ఆగస్టు 8 నాడు గవర్నర్ యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్ల సమావేశంలో పీహెచ్‌డీ ల ప్రమాణాలు పడిపోవడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసి, గత మూడేళ్ల పీహెచ్‌డీ ప్రవేశాల వివరాలను తనకు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిని సేకరించే బాధ్యత ఉన్న ఉన్నత విద్యా మండలి మహాజర్లు పంపుతూ, అప్పీళ్లు చేస్తూ కాలయాపన చేస్తూందే తప్ప ఖచ్చితంగా పనిచేసి, కావలసిన సమాచారాన్ని సేకరించలేకపోతోంది.

ఉన్నత విద్యారంగ ప్రమాణాలను మెరుగుపరచడం, వాటినీ స్టాండర్డైజ్ చేయడం అత్యవసరం. రానున్న రోజుల్లో విశ్వవ్యాప్త పోటీని తట్టుకునేలా నైపుణ్యాలను, సామర్థ్యాలను, విషయ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించవలసిన అవసరం ఉంది. ఈ మేరకు విద్యా ప్రమాణాలు, ప్రక్రియల ప్రమాణీకరణ చేయాల్సిన ఆవశ్యకత ఉంది. కానీ ఈ బాధ్యతను నిర్వర్తించాల్సిన ఉన్నత విద్యామండలి పరిస్థితి మాత్రం 'ఒక అడుగు ముందుకు... రెండడుగులు వెనక్కి' అన్నట్టుగా ఉంది. రానున్న రోజుల్లో ఇంజనీరింగ్, ఇతర వృత్తివిద్యా సంస్థల్లో విద్యార్థి రుసుములను నిర్ధారించేందుకు, , ఇతర కాలేజీల్లో ఫీజుల వ్యవస్థ నిర్ధారణ చేసేందుకు, కొన్నికొత్త కోర్సులకు అనుమతులను ప్రదానం చేసేందుకు త్వరలో ఏఎఫ్ఆర్ సీ నోటిఫికేషన్ జారీ చేయనున్న పరిస్థితి ఉంది. ఈ విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు.

ఇంత ప్రముఖమైన వ్యవస్థ నీరుకారిపోకుండా చూసుకోవడం చాలా అవసరం. ఉన్నత విద్యామండలి తన ప్రాభవాన్ని,ప్రభావాన్ని మళ్లీ పొందేలా చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో ఈ సంస్థ 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందాన మిగిలిపోతుంది. ఉదాహరణకు అత్యంత కీలకమైన అకాడమిక్ సెల్‌కు పర్మనెంట్ ఉద్యోగి లేరు. ఒక సేవానివృత్త అధికారి కన్సల్టెంట్ హోదాలో పనులు నిర్వహిస్తున్నారంటేనే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వ్యవస్థలను సృష్టించడం చాలా సులువు.కానీ వాటిని సమర్థవంతంగా నిర్వహించాలంటే చిత్తశుద్ధి కావాలి. ప్రభుత్వం ఉన్నత విద్యా మండలికి పాలపళ్లు అమరిస్తే చాలదు. దానికి కోరపళ్లు కూడా అమర్చాలి. అప్పుడే అది సమర్థవంతంగా పనిచేయగలుగుతుంది. విద్యా ప్రమాణాలు పతనమౌతున్నా సరిదిద్దలేని నిస్సహాయతలో ఉన్నత విద్యా మండలి ఉండటం నిజంగా శోచనీయం.

పంట పొలాల్లో ఇటుక బట్టీలు


మీకోసం

ఇటుకలకు మంచి గిరాకీ ఉండటంతో చాలా మంది నిబంధనలేమి పట్టించుకోకుండా ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్ రూరల్, మావల, తలమడుగు, తాంసి, గుడిహత్నూర్, ఇచ్చోడ, ఉట్నూర్ తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీలు అనేకం వెలిశాయి. నిర్వాహకులు ఏటా రూ.కోట్లలో వ్యాపారం చేస్తూ గ్రామ పంచాయతీలకు ఎటువంటి పన్నులు చెల్లించడం లేదు.


వ్యాపారంలో 2 శాతం పన్ను చెల్లించాలని నిబంధనలు ఉన్నా వ్యాపారులు చెల్లించటం లేదు. అధికారులు పట్టించుకోవటం లేదు. వ్యవసాయానికి పనికి రాని భూముల్లోనే ఇటుక బట్టీలు నిర్వహించాలి. కానీ కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా పంట భూముల్లో కూడ ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు.అధికారులకు మామూళ్లు చెల్లించి అడ్డదారుల్లో బట్టీలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటులో దూరంలోనే ఈ వ్యవహారం యథేచ్ఛగా కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదు. పచ్చని పొలాల మధ్య ఇటుక బట్టీలు నిర్వహిస్తుండడంతో చుట్టపక్కల పొలాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. అసైన్డ్ భూముల్లో సైతం ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. వాగుల్లోనే ఆయిల్ ఇంజిన్లు, విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి ఇటుకల తయారీ కోసం నీళ్ల ఉపయోగిస్తున్నారు. ఇంతా జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వాగులలో మోటార్లు ఏర్పాటు చేసుకొని ఇటుకల తయారీకి వాడుకోవడంతో వాగుల నీళ్లు ఇంకిపోతున్నాయి. దీంతో పంటలకు నీళ్ల అందక ఎండిపోతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో కొంతమంది ఇటుకల వ్యాపారులు గుట్టల నుంచి మట్టి తవ్వి ఇటుకల తయారీ కోసం వినియోగిస్తున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకుని అక్రమ ఇటుకబట్టీలను అరికట్టాలి.

– నర్సింహారెడ్డి, తలమడుగు

హఠాత్తుగా ఇదేమిటి? చట పట శబ్దాలు. "కొట్టండి గాడిదకొడుకుని–కొట్టండి" అన్న అరుపులు మారుమ్రోగాయి. నా గుండె కొట్టుకోసాగింది. రెండు నిముషాలు–ఇంతలో ఎవరెక్కడ మాయమయ్యారో–తెలుసుకోలేక పోయాను. నా వీపుమీద గొడుగు కర్ర విరిగేటప్పటికి తెలివి వచ్చింది.



నా జీవితమంతా తిరుగుళ్ళతోనే గడిచిపోయింది. ఈ దేశదిమ్మరి జీవితంలో మూడవఝామున నిలబడి



దానిలో ఒక అధ్యాయాన్ని వినిపిస్తూ వుంటే, ఇవ్వాళ నాకు ఎన్నో సంగతులు జ్ఞాపకమొస్తున్నాయి.

ఈ దిమ్మరి తనంతోనే – నేను బాల్యవస్థనుండి వృద్ధాప్యానికి వచ్చాను. తనవాళ్ళు–పరాయివాళ్ళ నోటితోనే గాక–అడ్డమైనవాళ్ళ నోటితోనూ "ఛీ" అనిపించుకుంటూ–నా జీవితాన్ని ఒక మహా క్షుద్ర పురుగుకన్నా మిన్నగా భావించలేక పోయాను. కాని ఎంతోకాలానికి ఈనాడు కొంత జ్ఞాప్తివుండి, మరికొంత మరచిపోయిన కథామాల నల్లటానికి కూర్చుని జీవిత ప్రభాతంలోనే అంకితమైన ఆ సుదీర్ఘ క్షుద్రత్వాన్ని గురించి ఆలోచిస్తూవుంటే అది లోకులనుకున్నంత పెద్దది కాదేమోనని సంశయంకుడా కలుగుతూ వుంటుంది. భగవంతుడు తన సృష్టి మధ్యన బలవంతాన నెట్టిన వానిని మంచిపిల్ల వాడనిపించి పరీక్ష పాసయ్యే అవకాశం ఇవ్వడు. బండ్లమీద, పల్లకీలమీద తిప్పించి–"కథ" పేరు పెట్టి అచ్చొత్తించే అభిరుచి కలిగించడు. అతనికి తెలివితేటలయితే అతని ప్రవృత్తి అతి విచిత్రంగానూ వింతగానూ వుంటుంది. అతను చూసే వస్తువులు, తెలుసుకోవాలనుకున్న తృష్ణను గురించి వర్ణిస్తే సుగుణవంతులు విరగపడి చస్తారు. తర్వాత ఆ మొద్దబ్బాయి అనాదరణ, అవహేళనలవల్ల చెడుస్నేహం పట్టి మరింత చెడిపోయి డక్కా–మొక్కీలు తింటూ–తనకు తెలియకుండానే ఏదో ఒక రోజున అపకీర్తి జోలి మెడను వేసుకు ఎటు పోతాడో చాలా కాలంవరకు మరి అతని అంతు వుండదు.

అందుచేత ఈ సంగతులన్నీ అలా వుంచి చెప్పదలచుకున్నది చెబుతున్నాను. చెప్పింనంతమాత్రాన చెప్పటమనిపించుకోదు. తిరగటం వేరు– దాని గురించి వర్ణించటంవేరు. కాళ్ళున్న ప్రతివాడూ తిరగ గలడు. కాని చేతులున్న ప్రతివాడూ వ్రాయలేడు. వ్రాయటం చాలా కష్టం. అదీగాక భగవంతుడు నాలో కల్పనగాని, కవిత్వంగాని ఇసుమంతకూడా పెట్టలేదు. ఈ దౌర్భాగ్యపు కళ్ళతో ఏది చూస్తారో అదే కనబడుతుంది.

వృక్షాన్ని వృక్షంలాగానే చూస్తాను. పర్వతాలు పర్వతాలుగానే కనపడతాయి. నీరు నీరుగా తప్ప మరొకవిధంగా కనబడదు. ఆకాశంలో మేఘాలుగానే కనిపిస్తాయి. వాటిని చూస్తూ వుంటే నాకు ఎవరి కేశరాశీ జ్ఞప్తికిరాదు. ఆఖరికి ఒక వెంట్రుకకూడా కనబడదు. చంద్రునికేసి చూస్తూవుంటే, కళ్ళవెంట నీళ్ళే కారతాయిగాని–దానిలో ఎవరి కేశరాశీ జ్ఞప్తికిరాదు. ఆఖరికి ఒక వెంట్రుకకూడా కనపడదు. చంద్రునికేసి చూస్తూవుంటే, కళ్ళవెంట నీళ్ళేకారతాయిగాని–దానిలో ఎవరి దేహమూ ప్రతిబింబించదు. ఈ విధంగా భగవంతుడు కల్పనకూ నాకూ ఇంతదూరం చేస్తే కవిత్వమెలా అల్లను? యదార్థాలను, ఎరుగున్న వాటిని సూటిగా చెప్పగలను. అందుచేత అలాగే చేస్తున్నాను.

నేను తిరుగుబోతు నెందుకయ్యానో చెప్పబోయే ముందు జీవితాలకు దూరంలోనే నన్ను ఈ మత్తులో ముంచిన వ్యక్తిని గురించి చెప్పటం అవసరం. అతని పేరు ఇంద్రుడు. మా ఇద్దరికీ మొట్టమొదటగా ఒక ఫుట్‌బాల్ మేచ్‌వద్ద పరిచయమైంది. అతడు ఇవ్వాళ బ్రతికి వున్నాడో లేదో తెలియదుగాని, ఒక రోజున తెల్లవారురూమున లేచి కట్టుపంచ మాత్రం చంకన పెట్టుకుపోయాడు–మళ్ళీ తిరిగిరాలేదు.

స్కూలు ఆవరణలో హిందువులు ఒక జట్టుగాను, ముస్లింలు ఒక జట్టుగాను చేరి ఫుట్‌బాల్ మేచ్ ఆడుతున్నారు. నేను ధ్యానంతో చూస్తున్నాను. నా ఆనందానికి అంతు లేదు. హఠాత్తుగా ఇదేమిటి? చటపట శబ్దాలు. "కొట్టండి గాడిదకొడుకుని–కొట్టండి" అన్న అరుపులు మారుమ్రోగాయి. నా గుండె కొట్టుకోసాగింది. రెండు నిముషాలు–ఇంతలో ఎవరెక్కడ మాయమయ్యారో–తెలుసుకోలేక పోయాను. నా వీపుమీద గొడుగు కర్ర విరిగేటప్పటికి తెలివి వచ్చింది. నలుగురైదుగురు వ్యూహం పన్ని కూర్చున్నారు. పారిపోవటానికి సందుగూడా దొరక్కపోయింది.

వీపుమీద దెబ్బమీదదెబ్బ పడుతున్నది. సరిగ్గా ఆ సమయానికి శరవేగంతో వ్యూహాన్ని ఛేదించుకుంటూ ఒక యువకుడు వచ్చి ఎదురుగా నిలబడ్డాడు. అతడే ఇందనాథుడు.

నల్లటిరంగు. మురళిలాంటి ముక్కు, పెద్ద తల, మొహంమీద రెండు పుట్టుమచ్చలు వున్నాయి. నా ఎత్తే వుంటాడుగాని, వయసుమాత్రం నా కంటే ఎక్కువ వుంటుంది. "భయమేమీలేదు –నువ్వు నా వెనకనే బయటకురా!" అన్నాడు.

ఆ యువకుని గుండెలోనున్న సాహసమూ, దయా దుర్లభమైనప్పటికీ ఆసాధారణము మాత్రం కాదు. అతని బుజాలు అసాధారణమనటంలో సందేహము లేదు. ధైర్యమేకాదు. అతని చేతులుచూచి ఎరుగనివారికి మూడుచేతులు సత్తువగల ఆ చెయ్యి పెట్టి కొడితే, ముక్కు పగులుతుందేమోనని సందేహము కలుగుతుంది. కాని దాన్ని చెయ్యి అనేకన్న పులి పంజా అనడం ఎక్కువ సమంజసమనుకుంటాను.

నిమిషంలో నేను అతని వెన్నంటుకుని బయటికి వచ్చాను. ఇంద్రనాథుడు ప్రగల్భమేమీ కనపరచకుండా "పారిపో!" అన్నాడు.

పారిపోతూ నేను "మరి నువ్వు" అని అడిగాను. అతను కఠినంగా సమాధాన మిచ్చాడు– "నువ్వు పారిపోరా వెధవా"! అని.

వెధవను కానీ మరేమన్నా కానీ రివ్వున వెనక్కి తిరిగి నుంచుని "నేను పారిపోను" అన్నాను.

చిన్నతనంలో దెబ్బలాడుకోంది ఎవరు? కాని నేను పల్లెటూరివాడ్ని. మూణ్నెళ్ళక్రితమే చదువుకోవటానికని మా పెత్తల్లిగారింటికి – పట్టణానికి వచ్చాను. ఇంతకు ముందెప్పుడూ నేను ఈ విధంగా ముఠా కట్టుకుని తగూలాడనూలేదు, గొడుగుకర్రతో వీపు చెడగొట్టించుకోనూలేదు. అయినా నేను ఒంటరిగా పారిపోలేకపోయాను. ఇంద్రుడు ఒకసారి నా మొహంకేసిచూసి "పారిపోక నుంచుని తన్నులు తింటావా? అదిగో చూడు, అటువైపునుంచి వస్తున్నారు. సరే పద కాలు జాడించి పరుగుతీద్దాం" అన్నాడు.

ఆ పని నేను బాగా చేయగలను. పరుగెత్తి మేము పెద్ద బజారుకు చేరుకునేటప్పటికి సాయంకాలమైంది. దుకాణాల్లో దీపాలు వెలుగుతున్నాయి. మున్సిపాలిటీ దీపాలు అక్కడొకటి, అక్కడొకటి–మినుకు మినుకు మంటున్నాయి. ఒకదానివద్ద నుంచుంటే రెండవదాని దగ్గరకు వెలుగు కనపడదు. ఇంక శత్రువుల భయమేమీ లేదు. ఇంద్రుడు చాలా స్వాభావికంగా సహజ స్వరం తో మాట్లాడుతున్నాడు. కాని నా గొంతు మాత్రం ఎండిపోతున్నది. ఇంద్రుడు ఏమీ అలసిపోలేదు. ఏమీ జరగనట్టు అసలు ఏమీ జరగనట్టుగానే "నీ పేరేమిటిరా!" అన్నాడు.

"శ్రీకాంత్"

"శ్రీకాంతుడా" అని జేబులోంచి గుప్పెడు యెండు టాకులుతీసి తను కాస్త నోటిలో వేసుకుని, మరికొంచెం నా చేతికిచ్చి "గాడిదకొడుకుల్ని ఇవాళ బాగా దంచాను–తీసుకుతిను" అన్నాడు.

"ఇదేమిటి"? "మూలిక".

నేను చాలా ఆశ్చర్యంతో "భంగా! నే నెన్నడూ తినలేదే!" అన్నాను.

ఎవడు తీసిన గోతిలో వాడే పడతాడు

విద్యా-వినోదం 15

ఇతరులను చెరపాలని చూస్తే తానే చెడతాడు. ఇతరులకు మంచి చేస్తే తనకు మంచి జరుగుతుంది.

పురాణగాథ– మహా భారతకథలో జయద్రదుడు (సైంధవుడు) పుట్టినపుడు తండ్రి వృధఖృతుడితో అశరీర వాణి చెప్పింది. 'నీ కొడుకు చేసే చెడ్డ పనులకు ఫలితంగా, అతని శిరస్సు ఖండించబడుతుంది' అని. అపుడు వృధఖృతుడు 'నా కుమారుని తలను నేల రాల్చిన వారి శిరస్సు వేయి ముక్కలగుగాక' అని శాపమిచ్చాడు.

మహాభారతయుద్ధంలో, పద్మవ్యూహంలోనికి అభిమన్యుడు వెళ్ళటానికి ఉద్యుక్తుడైనాడు. ఆ సమయంలో అర్జునుడు వేరే పని మీద వెళ్ళటం వలన, అభిమన్యునికి అండగా ఉండటానికి, అర్జునుని సోదరులు వెళ్ళగా, సైంధవుడు వారిని ఆపు చేస్తాడు. అభిమన్యునికి పద్మవ్యూహంలోకి వెళ్ళటమే తెలుసు, కాని తిరిగి రావటం తెలియదు. దుర్యోధనుడు, కర్ణుడు మొదలైనవారు అభిమన్యుని పద్మవ్యూహం మధ్యలో క్రూరంగా సంహరిస్తారు. అర్జునుడు తిరిగి వచ్చిన తర్వాత విషయం తెలుసుకొని, సైంధవుడి తలను సూర్యాస్తమయం లోపల ఖండిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. ఇది తెలుసుకొని కౌరవులు సైంధవుడిని రహస్య ప్రదేశంలో దాచి పెడతారు. అప్పుడు శ్రీ కృష్ణుడు సూర్యునికి తన చక్రం అడ్డుపెట్టి, రాత్రి అయినట్లు భ్రమ కలిగిస్తాడు. సైంధవుడు రాత్రి అయిందనుకొని రహస్య ప్రదేశం నుంచి బయటకు రాగానే, అర్జునుడు తన పాశుపతాస్త్రం ప్రయోగించి, సైంధవుని తలను ఖండిస్తాడు. అయితే వెంటనే శ్రీకృష్ణుడు అర్జునుడితో సైంధవుడి తలను క్రింద పడకుండా జపం చేసుకుంటున్న వృధఖృతుడి ఒడిలో పడేటట్లు కొట్టమంటాడు. ఆ విధంగా అర్జునుడు కొట్టగా ఆ తల వృధఖృతుడి ఒడిలో పడగా, వెంటనే అతడు దానిని క్రిందకు తోయగా, ఆ తల నేలమీద పడుతుంది. వెంటనే వృధఖృతుడి తల వేయి ముక్కలవుతుంది. అప్పుడు శ్రీకృష్ణుడు తన చక్రం అడ్డు తీయగా, సూర్యుని వెలుగు కనపడి, ఇంకా రాత్రి కాలేదని అర్థమవుతుంది. ఆ విధంగా అర్జునుని ప్రతిజ్ఞ నెరవేరింది. వృధఖృతుడు ఇచ్చిన శాపం, ఆయనకే మరణ శాసనం అయింది. కనుక ఎవడు తీసిన గోతిలో వాడే పడతాడు.

అతితెలివి అనర్థదాయకం

అతి తెలివి అనర్థదాయకం అని, చెఱపకురా చెడేవు అని గుర్తుంచుకోవాలి.

పురాణ గాథ – భస్మాసురుడు శివుని గురించి తపస్సు చేసి, శివుడు ప్రత్యక్షమైనపుడు, తన చెయ్యి ఎవరి తలమీద పెడితే వారు భస్మం కావాలన్న వరం కోరితే, భోళా శంకరుడు ఆ వరం ఇచ్చాడు. భస్మాసురుడు అతి తెలివితో ఆ వరాన్ని శివుడి మీదనే ప్రయోగించి పరీక్షించాలని, శివుడి తల మీద చెయ్యి పెట్టాలని, శివుని దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు నారాయణుడు మోహినీ అవతారంలో ప్రత్యక్షం అయి, భస్మాసురిడిని మోహింపజేసి, తాను చేస్తున్న రీతిలో నాట్యం చేసి గెలిస్తే తనను వరించ వచ్చని ఆశ చూపి, అతనితో నాట్యం చేయించాడు. మోహిని నాట్యం చేస్తూ తన చెయ్యి తన తలమీద పెట్టుకొనగా, భస్మాసురుడు కూడా అది అనుకరిస్తూ, తన చెయ్యి తన తలమీద పెట్టుకొని భస్మం అయినాడు.

గుడ్డి అనుకరణ ఆచరణీయం కాదు

ఇతరుల మంచి గుణములను గ్రహింపవచ్చును, కాని గుడ్డిగా వారిని అనుకరించరాదు. ఇంగ్లీషువారు చలి ప్రదేశంలో నివసిస్తారు గనుక బరువుగల ఉలెను కోటును ధరించి, చలి లోపలికి చొరకుండా మెడకు ఉచ్చు బిగించుకున్నట్లు టై బిగిస్తారు. పాదాలకు బూట్లు తొడుగుతారు. శరీరం వేడిగా ఉండటానికి మద్యం సేవిస్తారు. ఆ విధంగా లేకపోతే వారు తట్టుకోలేరు. కాని వేడి ప్రదేశమైన మన దేశంలో వారిని అనుకరించటం అవసరమా? పులిని చూసి నక్కవాత పెట్టుకున్నట్లు, ఇంగ్లీషువారు దేశం విడిచి వెళ్ళినా వారి అలవాట్లను అనుకరించటం మన దౌర్భాగ్యం. పోనీ పెద్దవాళ్ళు సమావేశాలలో షోకు కోసం ధరిస్తే ఫరవాలేదు, కాని పిల్లలను స్కూల్ యూనిఫారం పేరుతో కోటు, టై, బూట్లు ధరింప జేసి బాధ పెట్టడమే గాక, వాటి పేరుతో తల్లి తండ్రులచే డబ్బు ఖర్చు పెట్టించటం ఎంతమటుకు సబబో, పాఠశాల యాజమాన్యం వారు ఆలోచించాలి.

గమ్యంతో పాటు గమనం కూడా ముఖ్యమే

గమ్యంతో పాటు గమనం కూడా ముఖ్యమే అని గుర్తుంచుకోవాలి. మంచి ఉద్దేశ్యంతో చేస్తున్నాంగదా అని ఆచరణలో అడ్డదారులు తొక్కగూడదు.

కథ – ఒక రాజు గారు తన రాజ్యంలో మంత్రి పదవికి తగిన అర్హత కలవానిని ఎన్నుకొనటానికి పరీక్ష పెట్టాడు. ముందు జరిపిన ప్రాథమిక పరీక్షలో, నలుగురు నెగ్గారు. ఆ నలుగురికి మంచి పుష్టిగా ఉన్న వేప విత్తనాలు ఇచ్చి, ఇంటికి తీసుకెళ్ళి కుండీలలో పెట్టి మొలకెత్తిన తర్వాత, సంవత్సరం పాటు పోషించి తీసుకు రమ్మన్నాడు. అవి పరిశీలించాక ఎవరు అర్హులో నిర్ణయిస్తానన్నాడు. సంవత్సరం తర్వాత తెచ్చిన కుండీలలో, మూడింటిలోని వేప ముక్కలు నవనవలాడుతూ ఏపుగా పెరిగి ఉండగా, నాలుగో కుండీ ఖాళీగా ఉంది. రాజుగారు ఆ నాలుగోకుండీ తెచ్చిన వ్యక్తిని కారణం అడుగగా, తాను ఎంత జాగ్రత్త తీసుకున్నా తనకిచ్చిన విత్తనం మొలవలేదని జవాబు చెప్పాడు. అప్పుడు రాజుగారు తాను ఇచ్చిన వేపగింజలు వేయించినవని, అవి మొలకెత్తవని తనకు తెలుసునని, మిగిలిన ముగ్గరిని అడుగగా వారు వేరే విత్తనాలను వేసినట్టు ఒప్పుకున్నారు. అప్పుడు నిజాయితీపరుడైన నాలుగో అతనిని మంత్రి పదవికి ఎన్నుకొన్నారు రాజుగారు.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి


1969లో తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షుడుగా చెన్నారెడ్డి

1969 మార్చి, ఏప్రిల్ మాసాలలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి అనుకూలంగాను, ప్రతికూలంగాను పెక్కు సంఘటనలు జరిగాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ చరిత్రలో చరిత్రాత్మకమైన ఎన్నో ముఖ్యపరిణామాలు 1969 ఏప్రిల్, మే, జూన్, జులై మాసాలలో చోటు చేసుకున్న వాస్తవం చరిత్రకారులు గుర్తించక తప్పదు.

ఏప్రిల్ మొదటి వారంలో సికింద్రాబాద్‌లో బూరుగు మహాదేవ్‌లో జరిగిన తొలి సమగ్రతావాదుల సభ పోలీసు కాల్పులలో విద్యార్థుల మృతి, దహనకాండ వంటి దారుణ పరిణామాలతో రసాభాసగా ముగిసి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి తోడ్పడింది. బ్రహ్మానందరెడ్డికి బాకాఊది ప్రయోజనం పొందేందుకుగాను ప్రత్యేక రాష్ట్ర వ్యతిరేకి ముసుగు తగిలించుకున్న సీనియర్ దళిత నాయకుడు జి. వెంకటస్వామి సమగ్రతా వాదుల సభ జరిపే ప్రయత్నం చేస్తున్న సంగతి తెలిసి పలువురు సీనియర్ తెలంగాణ నాయకులు కోదాడ రాజమల్లు, టంగుటూరి అంజయ్య, కే. రామచంద్రారెడ్డి, కె.యస్. నారాయణ, ఐరేని లింగయ్య వంటి ప్రముఖులు తెలంగాణ ఉద్యమంతో మమేకం కావడంతో వెంకటస్వామికి ఎదురుదెబ్బ తగిలింది.

బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో సమాచార శాఖ మంత్రిగా ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ మార్చి మాసాంతంలో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఉద్యమం అంతకు ముందు కంటే ఉధృత రూపు ధరించడంతో ఆందోళన చెందిన ప్రధానమంత్రి ఏప్రిల్ 11న ఢిల్లీలో ఒక ముఖ్య సమావేశం ఏర్పాటు చేసి తన అష్టసూత్ర కార్యక్రమం ప్రకటించారు. ఆ తరువాతనే నూకల రామచంద్రారెడ్డి కూడ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చేరారు.

ఒకవైపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి యం.టి.రాజు, మరొకవైపు నగర పోలీస్ కమిషనర్ బి.యస్. కల్యాణరావు వేలమందిని నిర్బంధించి, వందల మంది ఉద్యమకారులను చంపిపారేసి ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలనే ధృఢ సంకల్పంతో ఉన్నప్పటికీ, ఆనాడు రాష్ట్ర ఐ.జి.పి.గా ఉన్న ఆత్మ జయరామ్, గూఢచార శాఖాధిపతి సుశీల్‌కుమార్, కేంద్ర గూఢచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (యస్.పి) శ్రీ పి.యస్. రామమోహన్‌రావు మాత్రం ఉద్యమం విషయంలో చట్టబద్ధ, న్యాయబద్ధ నిస్పక్షపాత వైఖరినే అవలంబించారు. అయితే ముఖ్యమంత్రి వద్ద ప్రధాన



కార్యదర్శి, నగర పోలీస్ కమిషనర్ మాట చెల్లుబాటు కావడంతో తెలంగాణ ప్రాంతమంతటా కార్యకర్తలు, అరెస్టులు, నిర్బంధాలు చోటు చేసుకున్నాయి.

ఒక రాజకీయ ఉద్యమం, అందునా ప్రత్యేక తెలంగాణ వంటి సంక్లిష్ట ఉద్యమానికి నాయకత్వం వహించేవారు కాకలు తీరిన రాజకీయ నాయకులై ఉండాలి. అనుకూల, ప్రతికూల సంఘటనలు జరిగినపుడు తక్షణం స్పందించగలగాలి. ఆలోచనకు, తాత్సారానికి, ఆలస్యానికి తావు ఇచ్చే అవకాశం లేదు. తెలంగాణ పీపుల్స్ కన్వెన్షన్ కన్వీనర్ శ్రీ ఏ. మదన్ మోహన్, సహృదయుడు, వృత్తిరీత్యా న్యాయవాది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పట్ల అతని విశ్వాసాన్ని శంకించేవీలు లేదు. పైగా అతను 'ఎడహక్ కమిటీ'లో సభ్యులతోనే కాక అందరితో స్నేహ సత్సంబంధాలు కొనసాగించారు. అయితే, అతనికి రాజకీయ అనుభవం, ఉద్యమాల గురించిన అవగాహన, అవసరమైన ఆర్థికవనరులు సమీకరించే సంబంధాలు లేవు. ఉద్యమం పురోగమనం కొనసాగుతున్నందున, నాయకత్వంలోని బలహీనతలను దృష్టిలో ఉంచుకొని, వ్యక్తిగతంగా మదన్‌మోహన్ అటు శ్రీమతి ఇందిరాగాంధీతో కానీ, దేశీయాంగ మంత్రి వై.బి. చవాన్, సహాయ మంత్రులు కె.సి.పంత్, రామనివాస్ మీర్ధాలతో సమ హోదాలో మాట్లాడే స్థాయిలో లేరని గ్రహించిన కొందరు సీనియర్ నాయకులు ప్రత్యామ్నాయం కొరకు అన్వేషణ మొదలు పెట్టారు. **(సశేషం)**

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

హిందీ ఎస్ఎస్సీ పరీక్షలు

ఎస్ఎస్సీ (స్టాఫ్ సెలెక్షన్ కమిషన్) జూనియర్, సీనియర్ హిందీ అనువాదకుల పరీక్ష, హిందీ ప్రాధ్యాపక్ పరీక్ష పేపర్ –1 పరీక్షను 13.01.2019న నిర్వహించనుంది. ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షను రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్ నగరాలతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తారు. పరీక్ష రాసేందుకు 2364 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు తమ అడ్మిషన్ల సర్టిఫికేట్లను WWW.SSCSR.GOV.IN నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీటితో పాటు ఒక ఐడెంటిటీ పత్రం పరీక్షా హాల్‌కు తేవలసి ఉంటుంది. మరిన్ని వివరాలకు 044–28251139 లేదా 9445195946 నెంబర్లలో సంప్రదించవచ్చు.



S.I ఉద్యోగం సాధించడం కోసం

రెండు తెలుగు రాష్ట్రాలలో కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ప్రిలిమినరీ పరీక్షలు పూర్తయ్యాయి. ఇక రాష్ట్రంలో ఏ గ్రౌండ్ చూసినా పొద్దున చలి సైతం చిన్నబోయేలా నిరుద్యోగ యువకులు, యువతులు దేహదారుఢ్య పరీక్షలకు సిద్ధమవుతున్న తీరు సామాన్యులను సైతం ఆకర్షిస్తున్నది. ఇక దేహధారుఢ్య పరీక్షల అనంతరం జరగబోయే మెయిన్స్ పరీక్షలకు సైతం ఇప్పటి నుంచే ప్రిపరేషన్ మొదలు పెట్టారు. ఇక్కడ విజయం సాధించాలంటే సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుళ్ల పరీక్షల్లో అత్యంత ముఖ్యమైన సబ్జెక్ట్ అర్థమేటిక్; రీజనింగ్& శుద్ధ గణితం. ఇక్కడ అధిక మార్కులు సాధించగలిగితే ఉద్యోగం వచ్చినట్లే.

సబ్ ఇన్‌స్పెక్టర్‌లో మెయిన్స్ రెండు పేపర్లు ఉంటాయి.

1) జనరల్ స్టడీస్ 200 మార్కులు

2) అర్థ మేటిక్; రీజనింగ్&pure maths 200 మార్కులు

ఇక ఇంగ్లీషు, తెలుగు పేపర్లలో అర్హత మార్కులు సాధిస్తే చాలు.

ఈ సారి నిరుద్యోగుల సామర్థ్యాలను పరిశీలన చేస్తే 280 మార్కులపైన సాధిస్తే క్యాటగిరీలతో సంబంధం లేకుండా ఉద్యోగం సాధించవచ్చు. జనరల్ స్టడీస్ పేపర్లో గత పరీక్షలు, ప్రస్తుతం వాటి కాటిన్యతను పరిశీలన చేస్తే సగటు విద్యార్థి మార్కులు 200లకు గాను 105115 ఉండే అవకాశం కొద్ది మంది విద్యార్థుల సగటు 115–125 ఉండే అవకాశం లేకపోలేదు. ఇందులో మొదటి సగటు తీసుకుంటే గణిత పేపర్లో 160–175 మార్కులు సాధించాల్సి ఉంటుంది. అదే రెండవ సగటు తీసుకుంటే 155–165 మార్కులు సాధించాల్సి ఉంటుంది. అంటే నూటికి నూరు శాతం స్కోరింగు సబ్జెక్టు ఇది. ఈ సబ్జెక్టులో విద్యార్థి పొందే మార్కులే ఉద్యోగాన్ని నిర్ధారిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఉద్యోగ సాధనలో ఇది మానవ శరీరంలో గుండెలాంటిది అన్న మాట. ఈ 200 మార్కులలో ముఖ్యంగా అర్థమేటిక్; రీజనింగ్&ప్యూర్ maths విభాగాలు ఉంటాయి.



అర్థమేటిక్‌లో బైకి బై సాధించగలమా..?

ఈ సబ్జెక్టును చూస్తేనే నిరుద్యోగుల గుండెల్లో గుబులు స్టార్టు అవుతుంది. ఇది గణితంలో ఆల్జీబ్రాకు బిడ్డ లాంటిది. ఇది నాన్ మ్యాథమేటిక్ వాళ్ళకు సింహస్వప్నంలా కనపడుతుంది. కానీ నిజానికి ఈ సబ్జెక్టుకు మనిషి నిజ జీవితానికి చాలా దగ్గర సంబంధం ఉంది. ఇలా అన్వయం చేస్తే అత్యంత సులభంగా మార్కులు సాధించటం సాధ్యమవుతుంది. ఇందులో వడ్డీలు; లాభ నష్టాలు; భాగస్వామ్యాలూ; కాలం, దూరం; కాలం, పని; గడియారాలు; క్యాలెండరు; సరాసరి; పడవలు, ప్రవాహాలు ఈ టాపిక్‌లే ముఖ్యమైనవి. అసలు చదువుకోని వ్యక్తికి కూడా ఈ పేర్లు తెలుసు. తనకు గణితం తెలియకుండానే గ్రామాలలో ఈ టాపిక్‌లకు సంబంధించిన ప్రశ్నలు అవలీలగా చేస్తారు అంటే ఆశ్చర్యం అక్కర్లేదు. ముఖ్యంగా వడ్డీలు అనే అంశంలో చదువుకున్న విద్యార్థి ఫార్ములా రాసే లోపు గ్రామాల్లో క్షణాల్లో ఆన్సరు చెప్పే వ్యక్తులు (చదువురాని) కోకొల్లలు.

చదువు రాకపోయినా ఇద్దరు ముగ్గురు కలిసి వ్యాపారాలు (భాగస్వామ్యాలూ) చేస్తుంటారు. అక్కడ లావాదేవీల గురించి (లాభ నష్టాలు) సంపూర్ణ అవగాహన ఉంటుంది. వయస్సులు; గడియారం; క్యాలెండర్ తదితర అంశాల్లో అవగాహన గురించి చెప్పనక్కర్లేదు. ఇలా చెప్పుకుంటూపోతే ప్రతి వ్యక్తి ఈ సమాజంలో కుటుంబ నిర్వహణలో పై అంశాల పాత్ర చాలా ముఖ్యమైనది.

ప్రత్యేకించి అర్థమేటిక్ ప్రశ్నలు గత ప్రశ్నాపత్రాలు పరిశీలన చేస్తే ఎక్కువ ప్రశ్నలు ఒకే ఏరియా నుంచి ఇవ్వడం, అది కూడా అప్లికేషన్ పార్టులో ఇవ్వడం జరుగుతుంది. కావున షార్ట్‌కట్స్ అని పనికిరాని మెథడ్‌ల జోలికి పోకుండా కాన్సెప్టుపై దృష్టి సారించాలి. నన్ను అడిగితే కాన్సెప్టే అతి పెద్ద షార్ట్‌కట్. ఇక్కడ ఆప్షన్ నుంచి చెక్ చేసే మెథడ్ నేర్చుకుంటే బాగా మేలవుతుంది. అంటే ఈ విధానాన్ని గణిత బోధనా పద్ధతిలో నిగమన విధానం అంటాం.

ఈ అర్థమేటిక్‌లో ఎక్కువ ప్రశ్నలు తెలుగు అకాడమీ; కేంద్ర స్థాయిలో ఉన్న అకాడమీ పుస్తకాలలోనే వుంటాయి. అవి బాగా ప్రిపేర్ అయితే బెటర్. నిజంగా చెప్పాలంటే ఈ సబ్జెక్టులో సరైన శ్రద్ధ వహిస్తే బై కి బై మార్కులు సాధించటం కష్టమేమీ కాదు.

ఇక ఇలాంటి సబ్జెక్టులో నిరుద్యోగి సక్సెస్ సాధించాలంటే ఏమి చేయాలి?

కూడికలు; తీసివేతలూ; గుణకారాలు; భాగహారాలు& ఏక్కాలూ; వర్గాలు; గణాలు ముఖ్యం గా సింప్లిఫికేషన్ పై పూర్తి పట్టు సాధించాలి. ప్రతి టాపిక్‌లో ప్రారంభం నుంచి మరో మోడల్ లేకుండా నేర్చుకోవడం. ప్రతి ప్రశ్నను క్షుణ్ణంగా చదివి దానికి తగిన మెథడ్‌ను ఎంచుకోవాలి. గత ప్రశ్నాపత్రాలను మదింపు చేయాలి. ప్రశ్నల సరళిని గమనించాలి. ప్రతి బిట్టుకు కేవలం 45 సెకన్లు మాత్రమే ఉంటుందన్న విషయం గమనించాలి. ఈ సమయంలోనే ప్రశ్నను చదివి అర్థం చేసుకొని తగిన మెథడ్‌ను ఎంచుకొని ఆన్సర్ చేసి బబుల్ చేయాలి. అంటే ఈ విషయం దృష్టిలో ఉంచుకొని ఏ ప్రశ్న పరీక్షలో వచ్చినా దాన్ని ఇన్‌టైంలో చేసే విధానం ముందుగానే నేర్చుకోవాలి. ఎంత ప్రిపేరయ్యామనే దానికంటే పరీక్ష హాలులో ఎంత సమర్థంగా రాణించామనేదే ముఖ్యం.

ప్రతి ప్రశ్నకు సమయ పాలన అవసరం

ప్రిపేరయ్యేటపుడు చక్కని నోట్స్ తయారు చేసుకోవడం చాలా అవసరం. ఫార్ములాలను నమ్ముకొని పరీక్షకు వెళ్ళే విధానానికి స్వస్తి పలకాలి. ఎస్ఐ– 2012; ఎస్ఐ–2016 ప్రిలిమినరీ &మెయిన్స్ (ఏపీ &టీఎస్) & ఎస్ఐ–2018 తెలంగాణ &ఆంధ్రప్రదేశ్ పరీక్షా పత్రాలలో మనం స్పష్టంగా చూశాం. డైరెక్టు ప్రాబ్లమ్స్ ఇవ్వ లేదు. 90 శాతం అర్థమేటిక్; రీజనింగ్& maths ప్రశ్నలు అప్లికేషన్‌కు సంబంధించినవే. ఇవి చేయలేక లక్షల మంది విద్యార్థులు అర్హత సాధించలేకపోయారు. మరీ ప్రత్యేకించి 2012లో కనీస అర్హత మార్కులు సాధించకపోవడం వల్ల వందల పోస్టులు మిగిలి పోయిన విషయం అందరికీ తెలిసిందే. కావున పై విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రిపరేషన్ కొనసాగించాలి. మూస పద్ధతిలో కాకుండా ఈ విభాగం గణితంలోది కాబట్టి నిత్య జీవితంలోని అంశాలను అన్వయం చేసుకొని ప్రిపరేషన్ కొనసాగించాలి. ఇలా చేస్తే అర్థమేటిక్‌లోని అంశాలనే కాకుండా ప్రత్యేకించి రీజనింగ్‌లోని ప్రకటనలు– సారాంశాలు; ప్రకటనలు– ఊహనలు; ప్రకటనలు– వాదనలు; ప్రకటనలు– తీర్మానాలు; ప్రకటనలు– పర్యవసానాలు& దత్తాంశ విశ్లేషణ; దత్తాంశ సేకరణ; డేసిషన్ మేకింగ్; రక్త సంబంధాలు & దిక్కులు– దిశలు తదితర టాపిక్‌లతో పాటు నాన్ వెర్బల్ సైతం సంపూర్ణంగా సాధించగలం. గత 56 ఎస్ఐ పేపర్లను పరిశీలించినపుడు రీజనింగ్‌లోని నంబర్ సీరీస్ (సంఖ్యా శ్రేణులు); నంబర్ అనాలజీ (సంఖ్యా సాదృశ్యం); సంఖ్యలలో భిన్నమైన దానిని గుర్తించుట, ఇలానే అక్షర శ్రేణులు; అక్షర సాదృశ్యం; అక్షరాలలో భిన్నమైన దానిని గుర్తించుట & కోడింగ్– డీకోడింగ్ అనే అంశాల నుంచి సగటున 35– 42 ప్రశ్నలు రావడం జరిగింది. పై అంశాలన్నీ ఒక్క సంఖ్యా శ్రేణుల మీద ఆధారపడినవే కదా. ఈ టాపిక్‌లో పట్టు సాధిస్తే పూర్తి మార్కులు మన ఖాతాలో పడ్డట్లే. కానీ నిరుద్యోగులు ఈ టాపిక్‌లో అతితక్కువ 15 నుంచి 20 మోడల్స్ మాత్రమే ప్రిపేర్ అవుతున్నారు. నిజానికి 1000కి పైన మోడల్స్ ఉంటాయన్న విషయం గుర్తించాలి.

దీనితో పాటు అర్థమేటిక్‌లోని సంఖ్యా వ్యవస్థ (నంబరు సిస్టమ్) టాపిక్‌తో అనుసంధానం చేసుకొని చదివితే ఎక్కువ ఉపయోగకరం. ఇక్కడ నుంచి కూడా దాదాపు మరో 20 ప్రశ్నలపైనే వస్తున్నాయి.

అర్టమేటిక్ &ప్యూర్ మ్యాథమేటిక్ విభాగంలో ఎక్కువ మార్కులు సాధించాలంటే ముందుగా గణిత బోధనా పద్ధతులు తెలుసుకొని ఉపయోగించగలగాలి. ఫార్వర్డ్& బ్యాక్ వర్డ్; ప్రతిక్షేపన & ఎలిమినేషన్; విశ్లేషణ– సంశ్లేషణ పద్ధతులను ఉపయోగిస్తే సెకన్లలో ఆన్సర్లు సాధించగలం.

రీజనింగ్‌లోని నాన్ వెర్బల్ మీద కూడా బాగా దృష్టి పెట్టాలి. కొంత మంది ఈ అంశాలను తొలగించారు అనుకుంటున్నారు. అది పొరపాటు. గత సంవత్సరంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ పరీక్షలో 15 ప్రశ్నలు ఇచ్చారన్న విషయం మర్చిపోవద్దు. ఇక్కడ పేపర్ ఫోల్డింగ్; పేపర్ కట్టింగ్; అద్దంలో ప్రతిబింబం; నీటిలో ప్రతిబింబంలపై దృష్టిపెట్టాలి.

ఇక చివరగా ప్యూర్ మ్యాథమేటిక్ విభాగంలో క్షేత్ర మితి చాలా ముఖ్యమైనది. ఇక్కడ నుంచి దాదాపు 15 నుంచి 20 ప్రశ్నలు వస్తున్నాయి. దీనిని జ్యామితికి అనుసంధానం చేస్తూ చదవడం, తర్వాత ఫార్ములాలతో పాటు నిర్మాణాల ఆధారంగా ఆన్సర్ చేయడం చాలా ముఖ్యం. ఇంకా కరణులు; సంవర్గమానాలు; త్రికోణమితి; శ్రేడులు; సమితులు– సంబంధాలు & బీజగణిత అంశాలపై కూడా దృష్టిపెట్టాలి.



– ముత్తినేని వీరయ్య
ఎంఫిల్, మ్యాథ్స్, బీఈడీ
డైరెక్టర్, రామానుజన్ స్టడీ సర్కిల్

పదోతరగతి విద్యార్థుల కోసం..

పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన నూతన విద్యా విధానం సీసీఈ మెథడ్‌ను అనుసరించి సబ్జెక్ట్ టీచర్‌చే తయారు చేసిన అంచనా ప్రశ్నావళిని అందిస్తున్నాం.

ఒక్క మార్కు ప్రశ్నలు..

1. నువ్వు రోజంతా ఆటలు ఆడావు, మరుసటి రోజుకి ఉదయం శరీరం అంతా నొప్పిగా ఉంది. నొప్పికి కారణం ఏమై ఉంటుంది.
2. ఎనర్జీ కరెన్సీ అనగా నేమి?
3. వాయు ప్రసార మార్గాన్ని ఫ్లోచార్ట్ రూపంలో వ్రాయుము.
4. సముద్రాల లోపలికి వెళ్ళి ఈత కొట్టేవాళ్ళు, పర్వతారోహకులు తమ వెంట ఆక్సిజన్ సిలిండర్స్ ఎందుకు తీసుకువెళ్తారు?
5. శ్వాసక్రియ అనగానేమి.

రెండు మార్కుల ప్రశ్నలు

1. మొక్కలు పగలు "కిరణజన్య సంయోగక్రియ"ను జరుపుతాయి. రాత్రి పూట 'శ్వాసక్రియ'ను జరుపుతాయి. అని నీ స్నేహితుడు చెప్పాడు. అతనితో నీవు ఏకీభవిస్తావా, లేదా? ఎందుకు?
2. దహనమూ, శ్వాసక్రియ మధ్య తేడాలను వ్రాయండి.
3. కణశక్త్యాగారం బొమ్మ గీసి భాగాలను గుర్తించండి.
4. గుట్టలు, కొండలు వంటి ప్రదేశాలలో నెమ్మదిగా నడిచినప్పటికీ శ్వాసక్రియ వేగంగా జరగడానికి కారణం ఏమి?
5. శరీరంలో డయాఫ్రమ్ లేకపోతే ఏమవును?

నాలుగు మార్కుల ప్రశ్నలు

1. కిరణజన్య సంయోగ క్రియకు, శ్వాస క్రియకు మధ్య గల భేదాలను పట్టిక రూపంలో తెల్పండి?
2. "శ్వాసక్రియలో co2 విడుదలవుతుంది" అని మీ పాఠశాల ప్రయోగశాలలో ప్రయోగాన్ని నిర్వహించారు కదా? ఆ విధానంను కన్ని పంక్తులలో వ్రాయండి.
3. శ్వాసక్రియలో ఉష్ణం వెలువడునని నిరూపించే ప్రయోగాన్ని పట సహాయంతో వివరించుము.
4. పొగాకు వినియోగం, కాలుష్యం మొదలైన వాటివల్ల కలిగే శ్వాసకోస వ్యాధులు గురించి వ్రాయండి.

ఆబ్జెక్టివ్ ప్రశ్నలు

1. ఊపిరితిత్తులను కప్పి రక్షించే పొర ....
2. వాయుమార్పిడి జరిగినపుడు నిశ్వాసంలో ఆక్సిజన్‌గా .... ఉంటుంది.
3. హిమోగ్లోబిన్ మధ్యలో ఉండు మూలం ....
4. మైటో కాండ్రియాలో శక్తి .... రూపంలో ఉండును.
5. ఒక ATP నుండి .... శక్తి విడుదల అవుతుంది.

ఆబ్జెక్టివ్ ప్రశ్నల సమాధానాలు

(1) ప్లూరా (2) 16 శాతం (3) ఇనుము (Fe) (4) ATP (5) 7200 కేలరీలు



– ఎం.దామోదర్
బయాలజీ టీచర్

DIABETES MELLITUS - PHARMACOLOGY & NURSING MANAGEMENT

(నిన్నటి తరువాయి..)

Key Points to Remember about Administering Insulin

- **Rotate sites:** do not use the same site more than once in a 2-3 week period this PREVENTS LIPODYSTROPHY (pitting of subq fat)
- Sites include: abdomen, arms, and thighs
- When mixing insulin (clear to cloudy) clean=regular, cloudy=NPH
- Don't massage site after administration increase hypoglycemia due to absorption

Dawn Phenomenon:

Watch for Dawn phenomenon (hence the name dawn…crack of dawn means the waking hours) this is a time when the body will increase the blood sugar in preparation for waking. However, when you have insulin problems (not enough of it) the increased blood sugar causes HYPERGLYCEMIA

Typical time: **5am to 8 am**

Treatment: may need a night time dose of NPH to counteract.

Somogyi Effect:

Somogyi effect (remember S in Somogyi for sleeping hours): This is a drop in blood sugar at the hours of **2 to 3 am.** This happens when the body releases hormones such as coristol, catecholamines, growth hormones to increase the blood sugar. However, in diabetics the body can't cope with the increased blood sugar and the sugar will be elevated.

Treatment: Eat a bedtime snack, a dose of bedtime insulin will prevent it from dropping so low or decreasing insulin amounts at night

MCQ's - PHARMACOLOGY & NURSING MANAGEMENT

1. Which of the following patient statements about the diabetic diet regime is correct?

A. "I'll try to consume about 20% carbs and 40% fats on a daily basis."
B. "Foods that are high in mono and poly fats are avocadoes, olives, and nuts."
C. "Meats increase the glycemic index; therefore, I should only consume 5% of them on a daily basis."
D. "I should completely avoid starchy vegetables like potatoes and corn."

2. A patient with diabetes asks you about what type of exercise they should perform throughout the week. The best response is:

A. Lifting weights **B.** Sprinting
C. Swimming **D.** Jumping


3. Which of the following statements are INCORRECT about exercise management for the diabetic patient?

A. "I will check my blood glucose prior to exercise. If it is less than 200 I will eat a complex carb snack prior to exercising."
B. "I plan on exercising for an extended period. So I will check my blood glucose prior, during, and after exercising."
C. "My blood glucose is 268 and I have ketones in my urine. Therefore, I will avoid exercising today."
D. All of the options are correct statements.

4. A patient has a blood glucose of 45 and is sweating, cold, and clammy. The patient is conscious. What is your next nursing intervention?

A. Recheck the blood glucose in 5 minutes.
B. Call the doctor for further orders.
C. No intervention is needed because this is a normal blood glucose.
D. Give the patient 3 graham crackers to eat.

5. A patient with Type 2 Diabetes is started on the medication Glyburide. Which of the following statements by the patient causes concern?



A. "I will monitor my blood glucose regularly because I know this medication can cause a low blood sugar."
B. "I will consume no more than 8 oz. of alcohol per week."
C. "I will continue monitoring my diet and participating in exercise while taking this medication."
D. "This medication works by stimulating the beta cells in the pancreas to make insulin."

6. A patient is scheduled to take a morning dose of Metformin. The patient is scheduled for surgery tomorrow. Which of the following nursing interventions are correct?

A. Administer the medication as ordered.
B. Hold the dose and notify the doctor for further orders.
C. Administer the medication as ordered but hold tomorrows morning's dose.
D. Check the patient's blood glucose prior to administering the medication.

7. A patient is scheduled to take 10 units of Humulin N at 1100. When is the patient most susceptible for hypoglycemia?

A. 1900 **B.** 1300
C. 1130 **D.** 1500

8. You administered 5 units of Humalog at 0800. What is the ONSET and DURATION of this medication?

A. Onset: 15 minutes, Duration: 3 hours
B. Onset: 2 hours, Duration: 16 hours
C. Onset: 30 minutes, Duration: 1 hour
D. Onset: 2 hours, Duration: 24 hours

9. A patient taking the medication Precose asks when it is the best time to take this medication. Your response is:

A. With the first bite of food
B. 1 hour prior to eating
C. 1 hour after eating
D. At bedtime

10. A patient has a blood glucose of 400. Which of the following medications could be the cause of this?

A. Glyburide **B.** Atenolol
C. Bactrim **D.** Prednisone

11. A patient is scheduled to take 5 units of Humulin R and 10 units of NPH. What is the proper way of mixing these insulins?

A. These insulins cannot be mixed, therefore, should be drawn up in different syringes.
B. Draw-up the Humulin R insulin first and then the NPH insulin.
C. Draw-up 2.5 units of NPH, then 10 units of Humulin R, and then finish drawing up 2.5 units of NPH.
D. Draw-up the NPH insulin first and then the Humulin R insulin.

12. A patient newly diagnosed with diabetes is about to be discharged home. You are watching the patient administer insulin. Which of the following actions causes you to re-educate them?

A. They massaged the site after administering the insulin.
B. They injected into the fat of their thighs.
C. They used an opposite side for injection compared to the last insulin injection.
D. They engaged the safety after administering the medication.

13. A patient with diabetes is experiencing a blood glucose of 275 when waking. What is a typical treatment for this phenomenon?

A. None, this is a normal blood glucose reading.
B. The patient may need a night time dose of an intermediate-acting insulin to counteract the morning hyperglycemia.
C. A bedtime snack may prevent this phenomenon.
D. This is known as the Somogyi effect and requires decreasing the bedtime dose of insulin.

14. True or False: The Somogyi effect causes the patient to experience an increase in their blood glucose during the hours of 2-3 am.

False

15. Which of the following insulins has no peak but a duration of 24 hours?

A. NPH **B.** Novolog
C. Lantus **D.** Humulin N

16. A patient is scheduled to take 7 units of Humulin R at 0830. You administer Humulin R at 0900 in the right thigh. When do you expect this medication to peak?

A. 1300 **B.** 0930
C. 1100 **D.** 1700

17. When is a patient most susceptible to hypoglycemic symptoms after the administration of insulin?

A. Onset **B.** Peak
C. Duration **D.** Duration & Peak

18. Which of the following insulins can be administered intravenously?

A. NPH **B.** Lantus
C. Humulin R **D.** Novolog

Answer Key:

1. B. 2. C. 3. A.
4. B. 5. B. 6. B.
7. A. 8. A. 9. A.
10. D. 11. B.
12. A. 13. B.
14. False
15. C. 16. C.
17. B. 18. C.

(ఇంకా వుంది)



– ప్రదీప్త మామిడి
నర్స్–ఎడ్యుకేటర్,
అపోలో మెడ్‌స్కిల్స్

ట్రెండీ

ధోతీ స్టైల్ నయా ట్రెండ్








ఫ్యాషన్ రంగం రోజుకో ట్రెండ్‌తో పరుగులు తీస్తుంది. ముఖ్యంగా పాత కాలం నాటి వాటికి కొత్త హంగులు అద్ది ట్రెండ్‌ను క్రియేట్ చేస్తున్నారు నేటి తరం డిజైనర్లు. ఆరు గజాల చీరంటే ఏ మగువకి మాత్రం ఇష్టం ఉండదు చెప్పండి, కార్తీక మాసం, వ్రతాలు, పూజలు, పండగలు ఏ మంచి సందర్భం దొరికినా చీరలో రాకుమారిలా మెరిసిపోవాలనే ఉంటుంది. ఎప్పుడూ ఒకేలాగా ఉంటే ఎలా... అమ్మమ్మల కాలం నాటి స్టైల్‌నే ఫాలో అయితే ఎలా ఉంటుంది. పాత కొత్త కలయికలతో..కాస్త కొత్తగా... ట్రై చేద్దాం అన్న ఊహలోంచి పుట్టుకొచ్చిందే, ఈ దోతీ శారీ. ఈ ధోతీ కట్టును ఏ చీర తోనయినా ట్రై చేయవచ్చు. ఈ సంక్రాతి పండగకు పట్టు చీరతో కట్టుకుని చూడండి ఎక్కుడ ఉన్న మీరే సెంటర్‌ఆఫ్ ఎట్రాక్షన్ అవుతారు. ప్రత్యేకించి ఈ కట్టుకు బ్రైట్ కలర్స్ అయితే సూపర్‌గా ఉంటాయి. పట్టు చీరలకు కాంట్రాస్ట్ బార్డర్ ఉంటే లుక్ డిఫరెంట్‌గా ఉంటుంది.

పాతదే కాని

కొత్తగా..

చీర కట్టు సంప్రదాయ వేడుకలకే పరిమితమా? 'అంతే మరి. ఈ తరం కలర్‌ఫుల్ ఈవెంట్లు, ఫ్యాషన్ షోలు, ఫంక్షన్లలో చీరకు చోటేది? కచ్చితంగా మోడ్రన్ డ్రస్‌లో హాజరవ్వాల్సిందే' అంటున్నారా? అదేం కాదు... చీరకు ధోతీ స్టయిల్ జోడించి, ఇదిగో ఇలా మోడ్రన్ 'ధోతీ శారీ'లో సరికొత్తగా మెరిసిపోవచ్చు!

చీర కట్టు పెద్ద ప్రహసనం' అని చిరాకు పడేవాళ్ల కోసం వాడుకలో కొచ్చిన స్టయిల్ 'ధోతీ శారీ' ఈ చీరను చుట్టుకోవలసిన అవసరం లేదు. మిగతా మోడ్రన్ డ్రస్‌ల మాదిరిగానే ధరించవచ్చు. డ్రస్‌లో భాగంగా కలిసిపోయే బ్లౌజ్ మోడ్రన్ లుక్ తెచ్చిపెడుతుంది. మ్యాచ్ అయ్యే జ్యువెలరీ, శాండిల్స్ ధరిస్తే డ్రస్ మొత్తానికే అందమొస్తుంది.

మ్యాచింగ్.. మ్యాచింగ్

పట్టు చీరలకైతే మెడలో గోల్డ్ జ్యూయలరి చాలా బాగుంటుంది. వెస్ట్రన్ స్టైలయితే చేతిలో క్లచ్, పాదాలకు హీల్స్, తల మీద కొప్పు, పొడవాటి ఇయర్ హ్యాంగింగ్స్.... ఇవీ ధోతీ శారీకి మ్యాచ్ అయ్యేలా అనుసరించవలసిన స్టైల్స్. ఒకవేళ పొడవాటి జుట్టు వదిలేద్దామనుకుంటే చెవులకు హ్యాంగింగ్స్ పెట్టకుండా మెడలో భారీ రాళ్ల నెక్లెస్ ధరిస్తే సరిపోతుంది. ఈ డ్రస్‌కు గాజులు, రిస్ట్ వాచీలు మ్యాచ్ అవ్వవు కాబట్టి ఆ ఆక్సెసరీల జోలికి వెళ్లకుండా చేతి వేలికి పెద్దదిగా, కొట్టొచ్చినట్టు కనిపించే ఉంగరం పెట్టేసుకోండి. అంతే! ఎలాంటి వేడుకలో అయినా సెంటర్‌ఆఫ్ ఎట్రాక్షన్ మీరే అయిపోతారు.



– విజయా రెడ్డి

ఈజీగా మెహెందీ డిజైన్లు..




మెహెందీ అంటే అమ్మాయిలకు చాలా ఇష్టం. చేతులకి, కాళ్లకి కళని తెచ్చిపెడతాయి. సులువుగా వేసుకునే, అందంగా ఉండే కొన్ని మెహెందీ డిజైన్లు మీ కోసం. మెహెందీ కేవలం బ్రైట్, ఎరుపు రంగులోనే కాదు నలుపు, తెలుపు రంగుల్లో కూడా ఉంటుంది. పండుగ సీజన్‌లో రొటీన్‌కు భిన్నంగా, చూడడానికి కొత్తగా అనిపించేలా మెహెందీ వేసుకోవాలనుకుంటున్న అమ్మాయిలకు సులువైన డిజైన్లు.




రింగులో ఫింగర్



అభరణాల విషయంలో మెడకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో అంతకంటే ఎక్కువగా వేళ్లకు ధరించే ఉంగరాలపై అంతే దృష్టి సారిస్తాం. ట్రెడిషనల్ దుస్తులకయితే ఒక రకంగా, వెస్ట్రన్ వేర్‌కైతే డిఫరెంట్ లుక్‌తో ఉన్న ఉంగరాలు ధరించడం చాలా మంది ఇష్టపడుతారు. ఎందుకంటే ఎవరి దృష్టి అయినా కళ్లు, చేతుల మీదే ఎక్కువగా ఉంటుంది. కాబట్టి చేతులకు ధరించే గాజులతో పాటు, వేళ్ల ఉంగరాల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఒంటి మీది ఇతర నగలతోపాటు, ధరించే దుస్తులకూ ఉంగరాలు మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి.

డైమండ్ నెక్లెస్ పెట్టుకున్నప్పుడు వాటికి మ్యాచింగ్‌గా రాళ్లు పొదిగిన ఉంగరాలు ధరించటమే ఫ్యాషన్. అయితే ఈ రాళ్ల రంగు వేసుకున్న దుస్తుల రంగుతో మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి. అప్పుడే ప్రత్యేకంగా కనిపిస్తారు. ఉంగరాలు కొనేటప్పుడే పెట్టుకుంటే యూనిక్‌గా ఉండే ఉంగరాన్నే ఎంచుకోవాలి. రాళ్లు ఎలా పొదిగి ఉన్నాయి? అవెంత బలంగా ఉన్నాయి? మెరుపు ఎంతకాలం నిలుస్తుంది? మొదలైన విషయాలను కొనేటప్పుడే అడిగి తెలుసుకోవాలి.

ప్లాటినమ్‌తో డిఫరెంట్ లుక్



ఆధునిక వస్త్రధారణకు ప్లాటినమ్ ఉంగరాలు చక్కగా నప్పుతాయి. వీటిలో ఇప్పుడు కళ్లు చెదిరే డిజైన్లు అందుబాటులోకొచ్చాయి. పైగా వజ్రాలు పొదిగిన ప్లాటినం ఉంగరాలు లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్.






పీచు తింటున్నారా..!

హైబీపీ నివారణ, నియంత్రణలకు విధిగా పాటించాల్సిన ఆహార నియమాలివి... అధిక రక్తపోటు (హైబీపీ) ఉన్నవాళ్లు ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాల్సిందే. మన ఆహారంలో పీచుపదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం ప్రధానం. ఈ పీచులోనూ రెండు రకాలుంటాయి. అవి మొదటిది నీటిలో కరిగే పీచు. ఓట్స్ తవుడు, వేరుశనగలు, బీన్స్‌లో ఈ తరహా పీచు ఉంటుంది. ఇక నీళ్లలో కరగని పీచు. గోధుమపొట్టు, తాజా పండ్లపై ఉండే పొట్టు, గింజలలో ఈ తరహా పీచు ఉంటుంది.

అది ఎలాంటి పీచు పదార్థమైనా ఎక్కువగా తీసుకోవడం వల్ల క్యాన్సర్‌ను సమర్థంగా నివారించవచ్చు. దీనికి చేయాల్సిందల్లా మన ఆహారంలో పొట్టుతీయని ధాన్యాలు, తాజా పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఇది అన్ని రకాల క్యాన్సర్లకు నివారణే అయినా ప్రత్యేకంగా జీర్ణవ్యవస్థ తాలూకు క్యాన్సర్లను సమర్థంగా నివారిస్తుంది. ఈ పీచు మలబద్ధకంతో పాటు ఇంకా జీర్ణ వ్యవస్థకు సంబంధించిన ఎన్నో వ్యాధుల నుంచి నివారణనిస్తుంది.

అల్పాహారాన్ని చులకన చేయొద్దు..



అల్పాహారం మనకు ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది. రోజంతా ఉత్సాహంగా ఉండటమే కాదు బరువు కూడా అదుపులో ఉంటుంది. అయితే అల్పాహారంగా మనం ఏం తినాలో... ఏవి తినకూడదో తెలుసుకోవాలి.

- చాలామంది తాజా పండ్లు, కూరగాయల రసాలను అల్పాహార సమ యంలో తీసుకుంటారు. వీటి నుంచి మన శరీరానికి కావాల్సిన పీచు లభించదు. కాబట్టి నేరుగా పండ్లు లేదా కూరగాయల సలాడ్‌ని ఎంచుకోవాలి. అప్పుడే వాటిలోని పోషకాలు, పీచు అందుతాయి. పొట్ట నిండిన భావన కలుగు తుంది.
- అల్పాహారం అనగానే చాలామంది ఏది పడితే అది తినేస్తారు. కానీ మాంసకృత్తులున్న పదార్థాలు తినాలి. బరువు తగ్గాలనుకునేవారికి ఇవి చాలా అవసరం. త్వరగా ఆకలి వేయదు. వీటిని తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండొచ్చు. గుడ్లు, బీన్స్, డ్రైఫ్రూట్స్, కూరగాయల నుంచి ఇవి లభిస్తాయి.
- కొంతమంది త్వరగా తయారు చేసుకోవచ్చనే ఉద్దేశంతో బ్రెడ్, మైదా పదార్థాలను ఎంచుకుంటారు. వీటి నుంచి పీచు అందదు సరికదా త్వరగా ఆకలి వేస్తుంది. కారణం వీటిలోని పిండిపదార్థాలే. బరువూ పెరుగుతారు. అంటే పిండిపదార్థాలు తీసుకోవద్దని కాదు. మీ శరీరానికి ఉపయోగపడే శరీరానికి సరైన పోషకాలు అందే పిండిపదార్థాలు తినాలి. గుడ్లు, ఓట్‌మీల్, పెరుగు, రాగిదోశ, గోధుమరవ్వతో చేసిన ఉప్మా ఎంచుకోవచ్చు.
- చాలామంది అసలు అల్పాహారం తీసుకోరు. మరి కొందరయితే కుదిరినప్పుడు తింటారు. ఈ రెండూ సరికాదు.

ఇలా చేయడం వల్ల మధ్యా హ్నం భోజనం ఎక్కువగా తినేస్తారు. దీంతో బరువు పెరిగే అవకాశం ఎక్కువ. కాబట్టి ఆలస్యం చేయకుండా, అసలు మానేయకుండా అల్పాహారం వేళకు తీసుకోవాలి. ఉదయం నిద్ర లేచిన గంట లోపల తినడం మంచిది.

ఆలూపూరీ

కావలసిన పదార్థాలు

గోధుమ పిండి రెండు కప్పులు, బంగాళ దుంపలు నాలుగు, ఉప్పు అరటీస్పూను, మిరియాల పొడి అర టీస్పూను, నెయ్యి వేయించడానికి సరిపడినంత.

తయారీ విధానం

బంగాళ దుంపల్ని ఉడికించి మెత్తగా చేసుకోవాలి. ఒక గిన్నెలో గోధుమ పిండి, ఉప్పు, మిరియాలపొడి, బంగాళ దుంపల ముద్ద వేసి పూరి పిండిలా కలుపుకోవాలి. ఈ పిండితో చిన్న చిన్న ఉండలు చేసుకొని పూరీల్లా వత్తుకోవాలి. వీటిని రెండు వైపులా గోధుమరంగు వచ్చే వరకు నెయ్యిలో వేగించుకోవాలి. అంతే... వీటిని ఆలూ కర్రీతో తింటే చాలా రుచిగా ఉంటాయి.





అన్నం బోండాలు

కావలసిన పదార్థాలు

నాలుగు వెల్లుల్లి రెబ్బలు, చిన్న అల్లం ముక్క, రెండు టీస్పూన్ల పంచదార, ఒక టీస్పూను ఉప్పు సన్నగా తరిగిన ఒక పచ్చిమిరపకాయ, రెండు టేబుల్ స్పూన్ల సోయా సాస్, ఒక టీస్పూను చిల్లీ సాస్, ఒక టేబుల్ స్పూను వెనిగర్, సన్నగా తరిగిన కొత్తిమీర గుప్పెడు, రెండుకప్పుల అన్నం (అన్నాన్ని మెత్తగా చిదమాలి), ముప్పావు కప్పు పల్లీ పప్పుల ముక్కలు, నూనె.

తయారీ విధానం

అల్లం, వెల్లుల్లి, ఉప్పు, పంచదార, పచ్చిమిరపలను మిక్సీ పట్టి ఈ మిశ్రమానికి సోయా, చిల్లీ సాస్‌లు–రెండు టేబుల్ స్పూన్లు, వెనిగర్–టీ స్పూన్, కొత్తిమీర కలపాలి. దీనంత టినీ చిదిమిన అన్నానికి కలపాలి. చేతులకి కొద్దిగా నూనె రాసుకుని అన్నం మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చేయాలి. పల్లీ గింజల పప్పులను ఒక ప్లేట్లో చల్లి ఒక్కో ఉండను పల్లీగింజలు బాగా అంటుకునే వరకు దొర్లించాలి. కళాయిలో నూనెను వేడిచేసి అన్నం ఉండల్ని బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. ఈ ఉండల్ని టిష్యూ పేపర్ మీద వేస్తే నూనె పీల్చుకుని తరువాత కరకరలాడుతూ టేస్టీగా ఉంటాయి. ఇవి ఇరవైమందికి సరిపోతాయి. తయారీకి 30 నిముషాలు పడుతుంది.

గుప్పెడు గింజల్లో బోలెడు పోషకాలు

సూర్యోదయం నుంచి అస్తమయం వరకు పొద్దుతోపాటు దిక్కులన్నీ కలియతిరిగి పొద్దుకుంగే సమయానికి ఈ పువ్వు కూడా నేలకు తల వాల్చేస్తుంది. అందుకే ఈ పువ్వుకు పొద్దు తిరుగుడు పువ్వు అనే పేరు వచ్చింది.



ప్రొద్దు తిరుగుడు మొక్కలను హెలియాంతస్ ఆన్యూస్ అని పిలుస్తారు. దీనిని సన్‌ఫ్లవర్ అని ఇంగ్లీష్‌లో అంటారు. తెలుగులో సూర్యకాంత చెట్టు అని కూడా పిలుస్తారు. సుమారు 30 రకాల ఉప జాతులు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్నాయి. ఇది హెర్బేసియా జాతికి చెందిన మొక్కలు. వీటిని ప్రపంచవ్యాప్తంగా అత్యధిక నూనెగింజెల సాగుకు పెంచుతున్నారు. వీటి పుట్టుక మెక్సికో, పెరులో ముందుగా జరిగినట్టు తెలుస్తోంది. ప్రొద్దు తిరుగుడు పువ్వు పసుపు రంగు రెక్కలను కలిగి నల్లటి ఊదా రంగులో గుత్తులుగా గిజలను మధ్యలో కలిగి ఉంటుంది. వీటి ఆకులను కొన్ని చర్మవ్యాదులకు, కాలేయ సమస్యలకు ఇతర ఔషధాలతో కలిపి ఇస్తుంటారు. వీటి రెక్కలను (పువ్వుల) అద్దకంలో, బట్టలకు రంగులు వేసేందుకు వెజిటేబుల్ కలర్స్‌గా వాడుతుంటారు. వీటి గింజలను గానుగ పట్టగా వచ్చిన నూనెను రోజువారి వంటలకు వాడుతుంటారు. గానుగ ఆడిన పిప్పిని, పిండిని కొన్ని పోషక పదార్థాలలో కలిపి విక్రయిస్తుంటే వీటి నూనెలను ఆహారం తయారీకే కాకుండా కొన్ని సౌందర్య సాధనాలకు, క్రీములలో మరియు చర్మ రక్షణ నూనెలలో కలిపి వాడుతుంటారు. ప్రొద్దు తిరుగుడు గింజలలో పోషక విలువలు అధికంగా ఉన్నందున ఈ రోజు వీటిని ఆహారంలో భాగంగా కొద్ది మొత్తంలో తీసుకోవాలని పరిశోధకులు చెప్తున్నారు. మనం తినె ఆహారం ద్వారా రక రకాల పోషకాలు అందుతుంటాయి. ఇందులో భాగంగా నూనె గింజలో అత్యధిక పోషక విలువలు ఉంటాయి. వీటిని కొంచెంగా తీసుకున్నప్పుడు ఇతర ఆహార పదార్థాలలో దొరకని పోషకాలు, ఖనిజాలు, సూక్ష్మ ఖనిజాలు వీటి ద్వారా శరీరానికి మంచి చేస్తాయి.

పొద్దు తిరుగడు గింజలలోని ఫిటోస్టిరోల్స్ శరీరంలోని చెడు క్రొవ్వును తగ్గించడంతో పాటు శరీర బరువును నియంత్రణలో ఉంచుతుంది. వీటిలోని మెగ్నిషియం అనే ఖనిజం గుండె కండరాలకు, ఎముకలకు, నరాలకు (నాడీ వ్యవస్థకు) సహాయపడు తుంది. ఎముకల ధృఢత్వానికి కాల్షియంతో పాటు మెగ్నిషియం తప్పనిసరి. ఇది ఎముకలలో నిక్షిప్తమై ఉండడంతో పాటు, ఎముకల చుట్టు ఉంటుంది. ఈ మెగ్నిషియం శరీరంలోని కండరాల పని తీరుకు, నరాలకు సహాయపడుతుంది. శరీరంలో మెగ్నిషియం అవసరం నరాలకు అత్యవసరం. ముఖ్యంగా మానసిక ఒత్తిడి, పార్శ్వపు తలనొప్పి, కండరాల నొప్పులు గలవారు రోజు సగం చెంచాడు నమిలితే మంచి గుణం ఉంటుంది.

గుండె పనితీరుకు, గుండె కండరాలలో కాల్షియం పేరుకోకుండా మెగ్నిషియం సహాయపడుతుంది. ప్రొద్దు తిరుగుడు గింజలను గుండె జబ్బులు గలవారు కొంచెంగా తీసుకుంటే సూక్ష్మ ఖనిజాలు సహాయపడుతుంటాయి.

రక్తపీడనం (బ్లడ్ ప్రెషర్) అధికంగా ఉన్నావారు, కండరాల నొప్పితో బాధపడే వారు, ప్రొద్దు తిరుగుడు గింజలను కొంచెంగా పుచ్చుకుంటే కొంత ఉపయోగం ఉంటుంది.

మన శరీరానికి సూక్ష్మ ఖనిజాలు రోజు వారి ఆహారం ద్వారా అందకపోవచ్చును. అటువంటప్పుడు ప్రతి రోజు సగం చెంచాడు గింజల పొడిని ఆహారంలో భాగంగా పుచ్చుకుంటే వీటిలోని సెలినియం ఏ కణజాలం కూడా విచ్ఛిన్నం కాకుండా రక్త కణాలు ధృఢంగా ఉండడానికి సహాయపడుతుంటాయి. శరీరంలో ఫ్రీ ర్యాడికల్ ఏర్పడకుండా సెలీనియం సహాయపడుతుంది.

శరీర బరువు నియంత్రించడానికి సెలీనియం సహాయపడుతుంది. గ్లుటథియోన్ పెరాక్సిడస్ అనే యాంటిఆక్సిడెంట్ ఎంజైమ్ తగ్గకుండా సక్రమంగా విడుదల అవడానికి సెలీనియం సహాయపడుతుంది.



పొద్దు తిరుగుడు గింజలు

ప్రతి 100 గ్రాముల గింజలకు ఉండే పోషక విలువలు

- పిండి పదార్థాలు – 15 గ్రాములు. వీటిలో మేగ్నిషియం 150 మిల్లి గ్రాములు
- ప్రొటీన్లు – 23.4 గ్రాములు, ఫాస్ఫరస్ – 150 మిల్లిగ్రాములు, పొటాషియం – 297 గ్రాములు
- క్రొవ్వు–48.7 గ్రాములు, సోడియం – 4 మిల్లిగ్రాములు, జింక్ –2.3 మి.గ్రా
- పీచు పదార్థాలు–5.7 గ్రాములు, సెలినియమ్–24.4 మైక్రో గ్రాములు
- క్యాలరీలు (శక్తి) – 269 కె.క్యాలరీలు,
  ఫిటోస్టియస్–246 మిల్లి గ్రాములు
  విటమిన్ సి–0.6 మిల్లి గ్రాములు,
  పోలేట్స్–104 ఎంసీజీ,
  విటమిన్ ఇ–15.3 మిల్లిగ్రాములు,
  విటమిన్ ఎ–23 మిల్లి గ్రాములు,
  ఇనుము–2.42 గ్రాములు,
  కాల్షియం–35.9 మిల్లి గ్రాములు
  వీటిలో పోలీ ఆన్ సాట్యూరేటెడ్ ఫేస్ట్–8.10 గ్రాములు ఉంటాయి.

వీటిలోని విటమిన్ ఇ అనే పదార్థం సహజంగా శరీరంలో యాంటిఆక్సిడెంట్ – యాంటీ ఇన్‌ఫ్లామేటరీ ఏజెంట్‌గా సహాయ పడుతుంది. ఇ–విటమిన్ అనేది సహజ సిద్ధంగా లభ్యమవుతుంది. శరీరంలో వాపు ఇన్‌ఫ్లామేషన్ ఏర్పడకుండా ఇ–విటమిన్ సహాయపడుతుంది. సింగిల్ ఆక్సిజన్ మాలిక్యుల్ ఏర్పడకుండా ఇ విటమిన్ సహాయ పడుతుంది.

స్త్రీలకు వచ్చే చర్మ సంబంధ సమస్యలు ఉదా. దద్దుర్లు, ఎర్రబడడం, బహిష్టుకు ముందు వచ్చే మానసిక, శారీరక ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రొద్దు తిరుగుడు గింజలు కొంత వరకు సహాయ పడుతుంటాయి.

ఉబ్బసవ్యాధి, కీళ్లవాతం, కీళ్ల నొప్పులు, నరాల నొప్పులకు ప్రొద్దు తిరుగుడు గింజలను సగం చెంచాడు చొప్పున పుచ్చుకుంటే మంచి గుణం ఉంటుంది.

కొలన్ క్యాన్సర్ రాకుండా విటమిన్ ఇ సహాయపడుతుంది. ప్రొద్దు తిరుగుడు గింజలను తరచూ పుచ్చుకుంటే గుణం కనిపించి ఉపశమనం లభిస్తుంది.

గుండె జబ్బులు రాకుండా వీటిలోని విటమిన్ ఇ, మేగ్నిషియం సహాయపడుతుంటాయి. గింజలను పేస్ట్‌గా చేసి చర్మానికి పట్టిస్తే పిగ్మంటేషన్ ప్రాబ్లమ్ తగ్గుతుంది.

గింజలను వాడే విధానం

- గింజలను తాజాగా తెచ్చుకోవడం
- పొట్టు తియ్యడానికి మిక్సీలో ఒకసారి తిప్పి గింజలను కడిగి ఆరబోసి తినాలి.
- ప్రొద్దు తిరుగుడు గింజలు రంగు మారి, పసుపు రంగులో మారితే తినకూడదు. వీటిని అధికంగా పుచ్చుకుంటే శరీర బరువు పెరుగుతుంది. అజీర్ణం చేస్తుంది. విరుగుడు – వాము, శొంఠిపొడి.



డాక్టర్ పెద్ది రమాదేవి
సెల్ నెంబర్ 9246276791

ప్రసవం తర్వాత జుట్టు రాలితే...

సాధారణంగా నేటి యువతీ యువకుల్లో జుట్టు (వెంట్రుకలు) రాలిపోవడం ఎక్కువగా జరుగుతుంది. అలాగే మరికొందరికి జుట్టు పలచబడడం, బట్టతల రావడం ఉంటుంది. నిజానికి జుట్టు రాలడం శారీరక, మానసిక ఒత్తిడికి లోనుకావడమే ఏకైక కారణమని వైద్యులు చెపుతుంటారు. మరికొందరిలో దీర్ఘకాలిక జబ్బులు, తీవ్రమైన అంటు వ్యాధులు, ఆపరేషన్లు చేసిన తర్వాత కూడా జుట్టు రాలిపోవచ్చున్నారు. హార్మోనుల అసమతుల్యం మూలంగా, మహిళల్లో ప్రసవం తర్వాత జుట్టు ఎక్కువగా రాలిపోతుంది.

గర్భిణి సమయంలో తగినంత పోషకాహారం తీసుకుంటారు. పుట్టబోయే బిడ్డకోసమైనా తగినన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. విటమిన్ సప్లిమెంట్లు వాడుతుంటారు. వీటన్నింటి వల్ల జుట్టు చాలా తక్కువగా రాలుతుంటుంది. అదే ప్రసవం అయిన తర్వాత విపరీతంగా జుట్టు రాలిపోతుంటుంది. ప్రసవం అయిపోయింది కదా, ఇంకా ఎందుకు జాగ్రత్తలు తీసుకోవడం' అనుకుంటారు. సమతుల ఆహారం, సరైన శుభ్రత పాటించకపోవడం, ఈ సమయంలో ఎదురయ్యే మానసిక మార్పుల వల్ల జుట్టు ఎక్కువగా రాలిపోతుంటుంది. అందుకని గర్భిణిగా ఉన్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారో అలాంటివే పాటిస్తే సమస్య ఉత్పన్నం కాదు. ప్రెగ్నెన్సీ సమయంలో చాలా మందికి జుట్టు ఊడిపోతుంటుంది. ప్రసవం తర్వాత కూడా కొందరిలో కంటిన్యూ అవుతుంది. ఇందుకు కాల్షియం లోపం కూడా కారణమే. దీంతోపాటు జుట్టు బిరుసు ఎక్కడం. చివర్లు రెండుగా చీలిపోవడం లాంటి సమస్యలు కూడా ఎదురవుతాయి.



దీన్ని నివారించాలంటే..

- మొదట ప్రధానంగా మానసిక ఒత్తిడి తగ్గించుకొని, పౌష్టికాహారం తీసుకోవాలి.
- తర్వాత మాయిశ్చరైజర్ ఉన్న కండిషనర్ ఉపయోగించాలి. జుట్టు దువ్వుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలి.
- మీ గైనిక్ డాక్టర్ సలహా పై జుట్టు రాలిపోవడానికి కారణమైన మందులను మార్చాలి.
- ఎండుగా, జిడ్డు లేకుండా ఉంచుకోవడం. ప్రెగ్నెన్సీ సమయంలో సింపుల్ హెయిర్ స్టైల్స్ ఫరవాలేదు.
- ప్రెగ్నెన్సీ సమయంలో సింపుల్ హెయిర్ స్టైల్ బెస్ట్. పైన చెప్పినవన్నీ క్రమం తప్పకపాటిస్తే మిమ్మల్ని చూసిన వారు ప్రెగ్నెన్సీ బ్యూటీ అని పిలుస్తారు.
- శరీరం ఆరోగ్యంగా ఉండటానికి పోషకాహారం ఎలా తీసుకుంటామో, జుట్టు రాలిపోకుండా కూడా తగిన ఆహారాన్ని తీసుకోవాలి. ముఖ్యంగా ఐరన్, క్యాల్షియం, జింక్, పొటాషియం, విటమిన్ 'ఎ', 'ఇ', ఆకుకూరలు, పండ్లు, పాల ఉత్పత్తులు సమతూకంలో తీసుకోవాలి.
- జుట్టు ఆరోగ్యంగా ఉండటానికి రోజూ 7నుంచి 8 గంటలు నిద్రపోవడం, 8 నుంచి10 గ్లాసుల నీరుతాగడం, మానసిక ఒత్తిడిని తగించుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.



నిజాలు చెప్పే సత్తా ఉన్న దర్శకుడు : లక్ష్మీపార్వతి

గత కొంత కాలంగా వివాదాలు లేకుండా వార్తల్లోకి రావడం లేదు వర్మ. ఓ వైపు బాలకృష్ణ బయోపిక్ ను విడుదల చేసే ఏర్పాట్లలో ఉండగా వర్మ తన 'లక్ష్మీస్ ఎన్టీఆర్' చిత్రంలోని ఎందుకు.. అంటూ పాటను విడుదల చేశాడు. నేడు ఎన్టీఆర్ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరో వైపు వర్మ విడుదల చేసిన పాట గురించి ఎందుకు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఎంతో మంది హీరోయిన్స్ ఉన్నా ఎంతో మంది అందగత్తెలు ఉన్నా ఎన్టీఆర్ కు లక్ష్మీ పార్వతి ఎందుకు నచ్చింది ఎంతగానో విమర్శలు వస్తాయని తెలిసినా కూడా ఎందుకు ఎన్టీఆర్ లక్ష్మీ పార్వతిని పెళ్లి చేసుకున్నాడు అంటూ సాగే ఈ పాటపై లక్ష్మీ పార్వతి స్పందించింది. వర్మ ఎందుకు పాటపై లక్ష్మీ పార్వతి స్పందిస్తూ... పాట వింటూ ఎమోషన్ అయ్యాను పాట నన్ను బాధించింది పాట వింటున్న సమయంలో నన్ను విమర్శించినట్లుగా అనిపించినా చివరకు అవన్నీ ప్రశ్నలంటూ వర్మ చెప్పాడు.

అయితే పాట విన్న తర్వాత మాత్రం వర్మపై నాకున్న గౌరవం మరింత పెరిగింది. ఎన్టీఆర్ గురించి నిజాలు చెప్పే సత్తా ధైర్యం ఆయనకు మాత్రమే ఉందని నాకు మరింతగా నమ్మకం కుదిరిందని లక్ష్మీ పార్వతి చెప్పుకొచ్చింది. బాలకృష్ణ నిర్మించిన 'ఎన్టీఆర్' చిత్రం నిజమైన బయోపిక్ కాదని వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మా సినిమా వచ్చిన తర్వాతే బయోపిక్ సంపూర్ణం అవుతుందని లక్ష్మీ పార్వతి తెలిపింది.



లేడీ ఓరియంటెడ్ పాత్రలో కీర్తిసురేష్

అలనాటి మహానటి సావిత్రి పాత్రలో తనదైన నటనతో మెప్పించి అందరితో శభాష్ అనిపించుకున్న హీరోయిన్ కీర్తిసురేష్ ప్రధాన పాత్రలో ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కొత్త చిత్రం గురువారం హైదారాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రారంభమైంది. నరేంద్ర ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవ్వగా మహేష్ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నందమూరి కల్యాణ్ రామ్ క్లాప్ కొట్టగా.. డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ సినిమాను కెమెరా స్విచ్చాన్ చేశారు. దేవుడి పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి డైరెక్టర్ ఎస్.హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో...

కీర్తి సురేష్ మాట్లాడుతూ "తెలుగులో 'మహానటి' తర్వాత నటిస్తోన్న సినిమా. మహిళా ప్రధానమైన చిత్రంలో నటించడం చాలా హ్యాపీగా ఉంది. ప్రతి అమ్మాయికి కనెక్ట్ అయ్యే సినిమా.

ఎక్కువ భాగం సినిమా యు.ఎస్‌లో చిత్రీకరణ జరుపుకోనుంది. డైరెక్టర్ నరేంద్ర మంచి కథను సిద్ధం చేశారు. తప్పకుండా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరవుతాననే నమ్మకం ఉంది" అన్నారు.

దర్శకుడు నరేంద్ర మాట్లాడుతూ "2016 నుండి ఈ కథపై వర్క్ చేస్తున్నాను. తరుణ్ నాకు స్క్రిప్ట్‌లో హెల్ప్ చేశాడు. అన్నీ ఎమోషన్స్ కలగలిపిన కథ ఇది. ఈ కథకు కీర్తిసురేష్‌గారు తప్ప మరేవరూ సూట్ కారు. 25 శాతం ఇండియాలో... 75 శాతం యు.ఎస్‌లో చిత్రీకరణ జరుగనుంది. ఏప్రిల్ లో యు.ఎస్.షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నాం. . కుటుంబ కథా ప్రేక్షకులు సహ అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఫిబ్రవరిలో షూటింగ్ స్టార్ట్ అవుతుంది" అన్నారు.

నిర్మాత మహేష్ కోనేరు మాట్లాడుతూ "మహానటిబూ చిత్రంతో కీర్తిసురేష్ తెలుగువారి హృదయాల్లో ఎంతటి స్థానం సంపాదించుకుందో తెలిసిందే.

మహిళా ప్రధానమైన చిత్రం. ప్రతి అమ్మాయి తన జీవితంలో తమ జీవితంలో ఎక్కడో ఒకచోట ఇలాంటి సిచ్యువేషన్‌ను ఎదుర్కొనే ఉంటుంది. మహిళలకు కనెక్ట్ అవుతుంది. సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తాం" అన్నారు.



బాహు, భళ్లా ప్రయోగాలు





ఖాన్‌ల తరహాలో టాలీవుడ్ లోనూ అగ్ర హీరోలు ఎన్నో ప్రయోగాత్మక పాత్రల్లో నటించి మెప్పించారు. విలక్షణత, వైవిధ్యం పాటించి సుదీర్ఘమైన ఇన్నింగ్స్‌ని కొనసాగించగలిగారు. ఇటీవల మిస్టర్ పెర్ఫెక్ట్ అమీర్ ఖాన్ నటిస్తున్న సినిమాల్ని పరిశీలిస్తే దంగల్, థగ్స్ ఆఫ్ హిందూస్తాన్ చిత్రాల్లో ఒకదానితో ఒకటి సంబంధం లేని పాత్రల్లో కనిపించాడు. అలాగే కింగ్ ఖాన్ షారూక్ సైతం 'జీరో' చిత్రంలో మరుగుజ్జు పాత్రలో నటించి వైవిధ్యం అంటే ఏంటో చూపించాడు. జయాపజయాల మాట ఎలా ఉన్నా ప్రయోగాల బాటలో వెళ్లేందుకు హీరోలు ఇష్టపడతారనేందుకు ఇవన్నీ ఉదాహరణలు. అదే బాటలో డార్లింగ్ ప్రభాస్ కూడా తనని తాను ఎలివేట్ చేసుకోవాలని భావిస్తున్నాడా? అంటే అతడి అడుగులు పరిశీలిస్తే అవుననే అర్థమవుతోంది. బాహుబలి సిరీస్ తో మ్యాకోమ్యాన్‌గా ప్రభాస్ తనని తాను ఆవిష్కరించుకున్న తీరు మైమరిపించింది. రాజాధి రాజ అమరేంద్ర బాహుబలిగా విరోచిత పోరాటాలతో ప్రభాస్ అదరగొట్టాడు. 2000 కోట్లు వసూలు చేసిన సినిమాలో కథానాయకుడయ్యాడు. ఆ వెంటనే ఆ జోనర్ తో ఏ సంబంధం లేని కొత్త కథల్ని ఎంచుకుని చకచకా షూటింగులు చేసేస్తున్నాడు.

ప్రభాస్ నటిస్తున్న 'సాహో' భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఇందులో అతడి పాత్రలో బోలెడంత సర్ ప్రైజ్ ఉంటుందని టీమ్ చెబుతోంది. ప్రభాస్ ఓ స్త్రీపై తరహా పోలీస్ (స్పెషల్ బ్రాంచ్ ఆఫీసర్) గా కనిపిస్తాడని చెబుతున్నారు. ఆ తర్వాత రాధాకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జాన్' (వర్కింగ్ టైటిల్) పూర్తిగా విభిన్నమైన ఎటెంప్ట్.

ఇందులో ఓ లవర్ బోయ్, కాలేజీ బోయ్ గా కనిపించున్నాడు. యూరఫ్ నేపథ్యంలో ప్రేమకథా చిత్రమిదని, ప్రభాస్ ఖరీదైన కార్ల వ్యాపారిగానూ, ప్రేమికుడిగానూ వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తాడని ప్రచారమవుతోంది. అయితే బాహుబలి తర్వాత చేస్తున్న ఈ వరుస ప్రయోగాలతో తన స్టార్‌డమ్‌ని ఇంకా ఇంకా పెంచుకుంటాడా లేదా? అన్నది ఇప్పటికైతే సస్పెన్స్. ఆగస్టులో 'సాహో' చిత్రాన్ని, ఏడాది చివరిలో 'జాన్'చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు రానా సైతం హాథీ మేరా సాథీ, హిరణ్యకసిప, టైగర్ నాగేశ్వరరావు వంటి భారీ చిత్రాలతో వరుసగా ప్రయోగాలు చేస్తున్నాడు.

ఫ్యామిలీ ఎమోషన్స్‌కే నా ప్రాధాన్యత

మెగాపవర్ స్టార్ రాంచరణ్, కియరా అద్వాని హీరో హీరోయిన్‌గా బోయపాటి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'వినయవిధేయరామ'. డి.వి.వి.దానయ్య నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతికి జనవరి 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ..



వినయం విధేయత ఉంది కాబట్టే రాముడయ్యాడు. ఈ రాముడు ఫ్యామిలీ పట్ల విధేయుడు. ఆ విధేయత ఏ స్థాయిలో ఉంటుందనేది మీరు సినిమాలో చూస్తారు.

ఈ సినిమా ట్రైలర్‌లో రామ్ చరణ్ కటౌట్ చూస్తుంటే ఐరన్ మ్యాన్‌లా కనిపిస్తున్నాడు. ఆ బాడీలో ఈ రోజు ఉన్న మెచ్యూరిటీ నాలుగేళ్ల క్రితం లేదు. అందుకే పర్‌ఫెక్షన్ కోసం టైమ్ తీసుకోవాల్సి వచ్చింది. ఈ సినిమాకి ఇదే కరెక్ట్ టైమ్.

నేను చేసిన సినిమాలు 'భద్ర' నుండి బిగిన్ అయితే 'వినయ విధేయ రామ' వరకు ఫ్యామిలీ ఇమోషన్స్ కే ఫస్ట్ ఫౌండేషన్ ఉంటుంది. ఆ తరవాతే సొసైటీ గురించి.. కథలో ఇంకా స్కోప్ ఉందనుకుంటే తక్కిన విషయాల గురించి ఆలోచిస్తా.

అజర్ బైజాన్ సీక్వెన్స్ ప్రిపేర్ చేసుకుని రామ్ చరణ్ కి చెప్పినపప్పుడు, అప్పటికే 2 నెలల కన్నా ఎక్కువ టైమ్ లేదు. ఇప్పట్లో కష్టం అని నాకు తెలిసినా, మీరు చేసేస్తారు అని ఒక మాట అనేసి వెళ్ళిపోయా. ఆయన కూడా ఆ మాటని అలాగే తీసుకుని, నన్ను నమ్మాడు కాబట్టే అంతలా కష్టపడ్డాడు.

'వినయ విధేయ రామ' విజన్ నుండి విజువల్ వరకు ఉన్న మెయిన్ కనెక్టివిటీ రామ్ చరణ్.. ఆయన లేకపోతే ఇది సాధ్యపడేది కాదు.

సినిమా అంటే పండుగ. పండుగని అభిమానుల వరకు చేర్చాలంటే ఆర్టిస్ట్ నన్ను నమ్మాలి. వాళ్ళు నన్ను నమ్మాలంటే వాళ్ళకన్నా ముందు నేను పదింతలు ఎక్సర్ సైజు చేసి, వాళ్ళను ఇన్స్ పైర్ చేయగలగాలి. ఈ ప్రాసెస్‌లో ఆర్టిస్టుల కన్నా కథలో నేనే ఎక్కువగా ఇన్వాల్వ్ అవుతాను. కథ చెప్పేటప్పుడే ఎఫెకట్స్ తో సహా ఎక్స్‌ప్లేన్ చేస్తాను.

మాస్, ఫ్యామిలీ ఎలిమెంట్స్ తో పాటు సినిమాలో ఒక కొత్త పాయింట్‌ను 'వినయ విధేయ రామ'లో రైజ్ చేశాం. అది ఆడియెన్స్‌కి రీచ్ అవుతుంది.

సినిమాలో క్యారెక్టర్స్ కూడా ఎవరు అందుబాటులో ఉన్నారో వారిని తీసుకోవడం జరగలేదు. ఒక I.A.S. ఆఫీసర్, హీరోకి పెద్దన్నయ్య అన్నప్పుడు ఎవరిని తీసుకున్నా ఈ క్యారెక్టర్‌లో పర్ఫెక్ట్‌గా సింక్ అవ్వాలి. అందుకే ప్రశాంత్. అలా వరసగా ఏజ్ దగ్గరి నుండి పర్‌ఫార్మెన్స్ లెవెల్స్ వరకు ప్రతీది క్షుణ్ణంగా ఆలోచించి డెసిషన్ తీసుకోవడం జరిగింది.

వివేక్ ఒబెరాయ్‌గారినిని కలిసినపుడు ఆయన అన్న మొదటి మాట 'నేను చేయను'. నేను 'రక్త చరిత్ర' సినిమా చేశాను. మళ్ళీ అదే స్థాయి సినిమా అయితే తప్ప ..నేను ఆలోచించనండి అని చెప్పాడు. సరే సర్.. మీరు చేయకండి కానీ, ఒకసారి క్యారెక్టర్ వినండి అని చెప్పాను. అంతే విన్నాడో లేదో.. డేట్స్ ఇచ్చేశాడు. అదే కమిట్‌మెంట్‌తో వచ్చాడు, చేసేశాడు.. వెళ్ళిపోయాడు.

నా దృష్టిలో సినిమా అంటే కలర్‌ఫుల్‌గా ఉండాలి. అందుకే ఎక్కువగా అర్బన్ బ్యాక్ డ్రాప్‌లో కథల్ని ఎంచుకుంటాను. అందుకే ప్రతి సినిమాలో రిచ్ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ అన్పిస్తుందేమో..

ఏ సినిమాకైనా ప్రొడ్యూసర్‌దే ప్రధాన పాత్ర. జ్యూస్ నాదైనా మంచి గ్లాస్ ఉండాలి. అందుకే రామ్ చరణ్, నాకు డి.వి.వి గారైతేనే బెటర్ అని చెప్పడం జరిగింది. సినిమా ఈ రోజు ఇంత అద్భుతంగా వచ్చిందంటే అది ఆయన వల్లే పాసిబుల్ అయింది.

నాకు రామ్‌చరణ్‌లో ఎక్కువగా నచ్చింది ఒకటే. ఆయనకీ అసలు తృప్తి ఉండదు. ఎంత సాధించినా ఇంకా ఏదో చేయాలి అనుకుంటూ ఉండడు. సినిమా సినిమాకి ఎదుగుతూనే ఉంటాడు ఇంకా ఆశగా చూస్తూనే ఉంటాడు.

నేను చిన్న సినిమాలు చేయలేను. నా నుండి ఆడియెన్స్ ఏదైతే ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారో అది 100% ఇవ్వాలి అనే నేననుకుంటా. అవతల ఎక్స్‌పెక్టేషన్స్ ఒకలా ఉండి, మన ప్రొడక్ట్ ఇంకోలా ఉంటే మ్యాచ్ అవ్వదు.. అందుకే నేను చిన్న సినిమాలు చేయను. ఒకవేళ నేను బయోపిక్ చేసినా, అందులో కూడా దమ్ము కంపల్సరీ గా ఉంటుంది.

ఏ హీరోతో సినిమా చేసినా, ఆ హీరోకి అభిమానినై చేస్తా. చరణ్ కోసం సినిమా రాసుకున్నప్పుడు కూడా ఫ్రంట్ సీట్లో కూర్చుని చూస్తున్నట్టుగా ఫీలై కథ రాసుకున్నా. ప్రతి హీరోకి అదే చేస్తా. ఇది కూడా అలాంటి సినిమానే.

భరతనాట్యం బ్యాక్ డ్రాప్‌లో 'ప్రణవం'



చరిత అండ్ గౌతమ్ ప్రొడక్షన్స్ పతాకం పై 'ఈ రోజుల్లో' శ్రీ మంగం, శశాంక్, అవంతిక హరి నల్వా, గాయత్రి అయ్యర్ ప్రధాన పాత్రల్లో కుమార్ జి. దర్శకత్వంలో తను.ఎస్ నిర్మిస్తోన్న చిత్రం 'ప్రణవం'. ఈ చిత్రం షూటింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుపుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు కుమార్.జి చిత్ర విశేషాలు తెలియజేస్తూ..."ఇప్పటికే మా సినిమాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చండీఘర్కు చెందిన మోడల్ అవంతిక హరి నల్వా హీరోయిన్గా నటిస్తుండగా, గాయత్రి అయ్యర్ మరో ముఖ్య భూమికలో నటిస్తోంది. భరతనాట్యం నేపథ్యంలో లవ్, సస్పెన్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే సినిమా అవుతుందన్ననమ్మకంతో ఉన్నాం. అలాగే మా సినిమాకు మ్యూజిక్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఆర్.పి.పట్నాయక్గారు, ఉష గారు కలిసి ఒక డ్యూయెట్ మా సినిమాలో ఆలపించారు. త్వరలో ఆడియో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఫ్రెష్ కాన్సెప్ట్ తో యంగ్ టీమ్ అంతా కలిసి చేస్తోన్న మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాం" అన్నారు. జెమిని సురేష్, నవీన, జబర్దస్త్ బాబి, దొరబాబు, సమీర, తదితరులు నటిస్తోన్న ఈ చిత్రానికి పిఆర్వో: వంగాల కుమార స్వామి; స్టిల్స్: శశాంక్ శేఖర్; డిఓపి: మార్గల్ డేవిడ్; కొరియోగ్రాఫర్: అజయ్ శివశంకర్; కోడైరక్టర్: శ్రావణ్ నల్లూరి; సంగీతం: పద్మనావ్ భరద్వాజ్; ఎడిటర్: సంతోష్; ఫైట్స్: దేవరాజ్; లిరిక్స్: కరుణాకర్, సిహెచ్ విజయ్‌కుమార్, రామాంజనేయులు; నిర్మాత: తను.ఎస్; కో ప్రొడ్యూసర్స్: వైశాలి, అనుదీప్; దర్శకత్వం: కుమార్.జి.

కొరియన్ భామతో జతకట్టనున్న కమల్

లోక నాయకుడు కమల్ హాసన్ శంకర్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కనున్నచిత్రం 'భారతీయుడు 2' ఈ చిత్రం యొక్క మొదటి షెడ్యూల్ ఈనెల 18నుండి వచ్చే ఏడాది జనవరిలో చెన్నైలో జరగనుంది. ఈ షెడ్యూల్ తరువాత పొల్లాచ్చి , ఆంధ్రప్రదేశ్, తైవాన్, ఉక్రెయిన్ లలో ఈచిత్రం యొక్క మిగితా చిత్రీకరణ జరుగనుంది. ఇక ఈ చిత్రంలో సౌత్ కొరియన్ నటి సుజి బే ముఖ్య పాత్రలో నటించనుందని సమాచారం. భారీ బడ్జెట్‌తో లైకా ప్రొడక్షన్స్ నిర్మించనున్న ఈ చిత్రంలో కమల్ సరసన కాజల్ కథానాయికగా నటించనుంది. అనిరుద్ సంగీతం అందించనున్న ఈ చిత్రం 2020లో ఈ సినిమా సంక్రాంతికి కానుకగా విడుదలకానుంది.



తాంబూలం ఎప్పుడు తినాలి?

నిద్రలేచినప్పుడు, స్నానం చేసాక, తిన్న తరువాత, వాంతి అయినపుడు తాంబూలము వేసుకోవచ్చును. తాంబూలంలో కారం, తీపి, వగరు, చేదు కలిగి ఉంటాయి. వీటి వలన వాత, కఫ వ్యాధులు దరిచేరవు. నోటియందు క్రిములు నశిస్తాయి. నోటిదుర్గంధము తొలగిపోతుంది. ఉదయం పూట వక్క ఎక్కువగా, మధ్యాహ్నం కాసు ఎక్కువగా, రాత్రులు సున్నము ఎక్కువగా ఉండేలా తాంబూలాన్ని తయారుచేసుకోవాలి. తాంబూలము నమిలేటపుడు మొదటగా వచ్చే రసం విషతుల్యమవుతుంది. రెండవసారిది అజీర్ణానికి, మూడవసారిది అమృతంతో కూడినది. కాబట్టి తాంబూలం వేసికున్న తరువాత మొదటి రసాలను ఉమ్మేస్తూ చివరి రసాలను మాత్రమే మింగడం ఆరోగ్యకరం. దంత పటుత్వం లేనివారు, నేత్రరోగములు, విషము, మదుము, మూర్ఛ, గాయాలు గలవారు తాంబూలము తినరాదు.



పుట్టిన నెల చెబుతుంది మీ తోడు ఎవరని?

మనం ఏమిటన్నది మనం పుట్టిన ఘడియలు నిర్ణయిస్తాయని చాలా మంది విశ్వసిస్తారు. అలాగే పుట్టిన నెల కూడా వ్యక్తిత్వాన్ని, వారి జీవనయానాన్ని నిర్ధేశిస్తుందని సంఖ్యాశాస్త్రం చెప్తున్నది. విశ్లేషకులు పుట్టిన నెలలు మీ వృత్తి నుండి మీ మానసిక స్థితి వరకు ప్రతి అంశాన్ని ప్రభావితం చేయగలవని గుర్తించారు. అలాగే పుట్టిన నెల ప్రకారం, ఎటువంటి వ్యక్తిని జీవిత భాగస్వామిగా కలిగి ఉండాలో కూడా నిర్ధారణ చేయవచ్చుట.



అయితే ఏదీ కూడా మనం అనుకున్నట్టు జరగకపోవడం, ఊహించనివి జరగడం సాధారణం, దినఫలాలు, వారఫలాల లాంటివే ఈ నెల ఫలాలు. ఎలాంటి భాగస్వామి అయితే బాగుంటుంది, ఎలాంటి వారిని ఎంచుకోవాలో కూడా పుట్టిన నెలలు నిర్ణయిస్తాయట.. ఎలానో చూద్దాం!

జనవరి

మీ భాగస్వామి మీతో కలిసి పనిచేయగల వ్యక్తి అయి ఉండాలి. మీరు ఏదైనా పక్కా ప్రణాళికతో చేస్తారు. మీ లక్ష్య సాధనలో, మీ జీవితంలో బలహీన వ్యక్తులకు స్థానంలేదని నిర్ధారించుకోండి. క్రమంగా మీరు ఒంటరి పోరాటానికి సిద్ధపడే వ్యక్తులై ఉంటారు. జీవితంలో పూర్తిచేయవలసిన అనేక విషయాలు స్తబ్ధతకు గురికాకుండా, ఉన్నత శిఖరాలను అందుకోడానికి, మీ జీవన విధానాలకు అడ్డుపడని వ్యక్తులను అంటే మానసిక దృఢత్వం కలిగిన వారిని లేదా, మీలా ఆలోచించే వ్యక్తిత్వం కలిగిన వారిని భాగస్వామిగా ఎంచుకొనేలా ఆలోచించాలి.



ఫిబ్రవరి

ప్రశాంతతను కోరుకునే వ్యక్తినే మీరు జీవిత భాగస్వామిగా ఆశిస్తారు. మీ అవసరాలను సున్నితమైన మీ భావోద్వేగాలను అర్థం చేసుకొని, మీ మానసిక పరిస్థితికి ఎటువంటి అవాంతరాలు కలిగించని వ్యక్తి మీకు భాగస్వామిగా రావడానికి అర్హత కలిగిన వ్యక్తులు ఉండాలి.

మార్చి

తీవ్రమైన ఆలోచనలు, ఆరాధన, సహాయం చేసే గుణాలు కలిగిన, తెలివైన వ్యక్తిగా మీరుంటారు. మీ చుట్టూ ఉన్న వారి సంతోషమే, మీ సంతోషం అన్నట్లుగా మీ ఆలోచనా విధానం ఉంటుంది. ఆర్థిక, కుటుంబ ప్రణాళికలలో, ఏ ఇతర అంశాలలో అయినా మీ భాగస్వామి మీతో సమానంగా ఉండాలని మీ ఆలోచన. కష్టం మీదనే ఫలితం ఆదారపడి ఉందని నమ్మే మీరు, మీ భాగస్వామి కూడా మీ వలెనే ఆలోచించాలని భావిస్తుంటారు.

ఏప్రిల్

మీరు నమ్మకానికి మారుపేరుగా, స్వతంత్రభావాలు కలిగిన మహిళగా ఉంటారు. మీ పనిని, కష్టాన్ని గుర్తించని చోట మీ ఉనికి లేదని భావిస్తుంటారు. మీ కఠినమైన నిర్ణయాలు, ఆలోచనా విధానాలు వ్యక్తులను భాధపెట్టేవిలా కూడా ఉంటాయి. మీ అభిప్రాయాలు, ఆలోచనలకు, చుట్టూ ఉండే పరిసరాలు, పెరిగిన వాతావరణ స్థితులే ప్రధాన కారణమని మరువకండి. మిమ్మల్ని నియంత్రించడం లేదా ప్రతిఘటించడం వంటివి మీ భాగస్వామిలో ఉండుటకు మీరు అంగీకరించరు.

మే

జీవితంలో నిరంతరం ఒత్తిళ్ళతో కాలక్షేపం చేసేలా ఉండే మీ జీవన విధానం, రోజుకో సమస్యతో సరికొత్త ప్రశ్నని మీ ముందు ఉంచుతుంది. నిరంతరం వివిధ రకాలైన కార్యాచరణలతో సతమతమవుతుంటారు. మరియు మీరు వ్యవహరించే అంశాలకన్నా, పాటించవలసిన విషయాలే ఎక్కువగా ఉంటాయి. అలా లేకపోయినా, తీవ్రమైన ఆలోచనలు కలిగిన కారణంగా, చిన్న అంశాలను కూడా పెద్దగా ఆలోచిస్తూ ఒత్తిళ్లకు లోనవుతూ ఉంటారు. అందువల్ల మీ మానసిక స్థితిగతులను సమన్వయపరచే భాగస్వామి జీవితంలో మీకు తోడు ఉండడం అవసరం.

జూన్

మీరు నిరంతరం నిరాశావాద దృక్పధంతో ఆలోచిస్తూ ఉంటారు. గతం గురించి ఆలోచిస్తూ, సమస్యల సుడిగుండంలో నడుస్తున్న అనుభూతికి లోనవుతూ ఉంటారు. క్రమంగా మానసిక స్థితిగతులు అస్తవ్యస్తంగా తయారవుతూ, ఒత్తిడి, ఆందోళన లేదా డిప్రెషన్ వంటి సమస్యలకు గురవుతూ ఉంటారు. హాని చేసిన, లేదా మోసగించిన వ్యక్తుల పట్ల తీవ్రమైన హేయభావాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. మీ మానసిక సమస్యలు తగ్గుముఖం పట్టేలా, మీ ఆలోచనలను పంచుకునే వ్యక్తి మీ జీవిత భాగస్వామిగా ఉండాల్సిన అవసరం ఉంది. ఎప్పుడైతే మీకు నమ్మదగిన వ్యక్తి



మీ జీవిత భాగస్వామిగా ఉంటారో, సమస్యల నుండి బయటపడిన అనుభూతికి లోనవుతూ ఉంటారు.

జూలై

జీవితంలో అన్నీ సహజ సిద్ధంగా ఉండాలని ఆలోచించే మీరు, యాంత్రిక జీవనానికి మరియు నాటకీయత జోడించిన సంబంధాల పట్ల అనాసక్తిని కనబరుస్తుంటారు. మీ ఆలోచనా విధానాలకు సరైన వ్యక్తి దొరికితే, జీవితం సంతోషమయంగా ఉంటుంది. జీవితంలో ప్రతి అంశంలోనూ పరిపూర్ణత ఉండేలా ఆలోచనలు చేస్తుంటారు.

ఆగస్టు

నీతి, నిజాయితీ, నిబద్దతలకు మారుపేరుగా ఉండే మీ ఆలోచనా విధానం, నలుగురికీ ఆదర్శప్రాయంగా ఉంటుంది. ఎటువంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, బెదరక అడుగులేసే వీరు ఎదుటివారి మద్ధతులను ఆశిస్తారు. క్రమంగా సంఘంలో గౌరవప్రతిష్టలు నెలకొంటాయి. మీరు సహజసిద్దంగా నాయకత్వపు లక్షణాలను కలిగి ఉంటారు. ఇతరులను ఆకర్షించే భావాలు, నైపుణ్యాలు మీసొంతం. మీ విధానాలను క్రమబద్దీకరించే తెలివైన వారు మీ భాగస్వామిగా ఉండేలా చూసుకోవలసి ఉంటుంది.

సెప్టెంబర్


మీ తెలివితేటలను, అభ్యాసాలను పంచుకోవడానికి భాగస్వామిగా, సమాన అర్హతలు ఉన్న వ్యక్తి అవసరం ఉంటుంది. మీ భావోద్వేగాలతో ఆడుకునే వ్యక్తులు మీకు ఎన్నటికీ సరితూగరు. మనసు లోతులను చదవగలిగే నేర్పుగల మీరు ఇతరుల ఆలోచన విధానాలను సైతం అంచనా వేయగలిగిన వారై ఉంటారు. లక్ష్యసాధనలో సమయాన్ని వృధా చేసే వ్యక్తులను అసలు ఇష్టపడరు. కావున మిమ్ములను మీ ఆలోచనా విధానాలను బలపరిచే విధంగా భద్రత కల్పించే వ్యక్తి మీ భాగస్వామిగా ఉండవలసిన అవసరం ఉన్నది.

అక్టోబర్

అత్యధిక కృతజ్ఞతా భావం, సంబంధాల పట్ల నిబద్ధతను ప్రదర్శించే వ్యక్తిగా ఉండే మీరు, మోసాన్ని మరియు ద్వంద్వార్థ పోకడలను ఎన్నటికీ క్షమించలేని వ్యక్తులుగా ఉంటారు. కావున మిమ్ములను తక్కువ అంచనా వేయకుండా మీకంటూ తన మనసులో స్థానాన్ని నిస్వార్ధంగా ఇచ్చేవారు ఉన్న ఎడల మీ జీవితం ఎంతో సంతోషంగా ముందుకు సాగుతుంది.

నవంబర్

మీ ఆలోచనా విధానాలు ఇతరులతో పోల్చినప్పుడు అర్థం చేసుకోవడానికి క్లిష్టతరంగా ఉంటాయి.



లక్ష్య సాధనలో చివరి అంకాన్ని ముందుగానే గ్రహించగల ఆలోచనపరులుగా ఉన్న మీకు, తోడ్పాటును అందించే వ్యక్తి భాగస్వామిగా ఉండవలసిన అవసరం ఉన్నది. మీ మాటలను గౌరవిస్తూ మీ ఆలోచనా విధానాలను క్రమబద్ధీకరిస్తూ సమస్యాత్మక ధోరణులు లేదా ప్రతికూల పరిస్థితులు ఎదురైన సమయంలో భద్రతను, వెన్నుదన్నును కలిగించే భాగస్వామి మీ జీవితంలో ఉండవలసిన అవసరం ఉన్నది.

డిసెంబర్

ఎక్కువగా కుటుంబ సభ్యులకు ప్రియమైన వారికి విలువనిచ్చే మీరు, వారితో సమయాన్ని కేటాయించడానికి ఎక్కువ ఆసక్తిని కనబరుస్తుంటారు. మరియు మానసిక ప్రశాంతత కోసం పరిసరాలను తరచుగా మార్చే మీకు మీ మనస్థితిని అర్థం చేసుకునే వ్యక్తి భాగస్వామిగా ఉండవలసిన అవసరం ఉన్నది. ముఖ్యంగా మీరు మీ మనసులో స్థానం సంపాదించుకున్న వ్యక్తి, మీలాగే నిబద్ధతను ప్రదర్శిచాలని కోరుకుంటూ ఉంటారు. మీ కుటుంబ సభ్యులను కూడా తన వారిలా భావించాలనే ఆలోచనలను కలిగి ఉంటారు.




ముంగిట్లో ముగ్గు









మాటే మంత్రం..



నీకు కుదిరినప్పుడు కాదు, ఎదుటివాడికి అవసరమైనప్పుడు చేస్తే దాన్ని సాయం అంటారు.

గాలి తిని బతికేస్తాయి..

ఎయిర్ ప్లాంట్స్... మొక్కలను పెంచడం హాబీగా చేసుకున్న వారి కలెక్షన్‌లో ఈ ఎయిర్ ప్లాంట్స్ ఖచ్చితంగా ఉండి తీరాల్సిందే. వీటిని ఆర్నమెంటల్ ప్లాంట్స్ అని కూడా అంటారు. అలంకరణలో ఇంటి అందాన్ని రెట్టింపు చేస్తాయి ఈ మొక్కలు. చిన్నగా, గుబురుగా, రకరకాల ఆకారాల్లో, సైజుల్లో లభించే ఎయిర్‌ప్లాంట్ రెయిన్ ఫారెస్ట్‌లలో, అడవులలో విరివిగా కనిపిస్తాయి. వీటి నివాసం కూడా అక్కడే. మట్టి, ఎరువు, పోషణ ఎక్కువ అవసరం లేని నిరాడంబర మొక్కలు ఇవి. వాటికి కావాల్సిన పోషకాలను ఇవి ధూళి రేణువుల నుంచి, వర్షం తేమ నుంచి, వాడిపోయిన చెట్ల ఆకుల నుంచి, ఆకులను అంటిపెట్టుకొని ఉండే క్రిమికీటకాల నుంచి తీసుకుంటాయి. వీటికి ఆది, అంతం ఉండదు. వేర్లు కూడా ప్రత్యేకంగా కనిపించవు. ఇవి బతకడానికి కావాల్సిందల్లా గాలిలోని తేమ, కాస్తంత వెలుతురు.



- సున్నితమైన ఈ మొక్క ఎండకు పెడితే మాడిపోతుంది.
- వీటిని ఇండోర్ ప్లాంట్స్‌గానే చూడాలి.
- బాత్‌రూమ్‌లలో అందంగా అమర్చుకోవచ్చు.
- వారంలో రెండుసార్లు నీటిని స్ప్రే చేయాలి.
- రెండు వారాలకొకసారి పదినిమిషాలు నీళ్లల్లో ఉంచి తీయాలి.
- నీరు లేకుండా దులిపేసి కంటైనర్‌లో ఉంచాలి.
- వీటిని తలకిందులుగా వేలాడదీస్తే ఆకర్షణీయంగా ఉంటాయి.







'చిటికె'లో సాధ్యం..!



- రిఫ్రిజిరేటర్ దుర్వాసన వస్తుంటే బ్రెడ్ స్లైస్‌ని ఉంచండి. దుర్వాసన దూరం అవుతుంది.
- తరచుగా ఐస్ పేరుకుపోతుంటే, ఐస్ ట్రేలకు ఉప్పు రుద్దాలి.
- ఫ్లవర్ వాజ్‌లో అమర్చే పువ్వులు తాజాగా ఉండాలంటే, వాటి కాడల్ని అర అంగుళం కత్తిరించాలి. అలాగే నీటిలో కొద్దిగా వెనిగర్, పంచదార కూడా వేయాలి.

విజయ క్రాంతి
శుక్రవారం 11 జనవరి 2019
హైదరాబాద్

బిజినెస్

కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	453	విజయవాడ	453
ముంబయి	508	ఢిల్లీ	482
చెన్నై	460	బెంగళూరు	455



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	115	ఢిల్లీ	125
కరీంనగర్	120	ముంబయి	120
వరంగల్	120	చెన్నై	115



సెన్సెక్స్ –106
36,106



నిఫ్టీ –33.55
10,821



రూపాయి
₹69.68
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,887.00
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 (గ్రాములకు)/(రూ.)లలో



బ్యాంక్ ఉద్యోగుల సమ్మెతో..
నిలిచిపోయిన రూ. 20,000కోట్ల చెక్కులు

- ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్

చెన్నై: బ్యాంకుల ఉద్యోగుల సమ్మె కారణంగా దాదాపు రూ.20,000 కోట్ల విలువైన చెక్కుల క్లియరెన్స్ నిలిచిపోయిందని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం అను సరిస్తోన్న విధానాలను వ్యతిరేకిస్తూ జనవరి 8, 9 తేదీల్లో ఉద్యోగులు ఈ సమ్మెను తలపెట్టారు. దేశవ్యాప్తంగా ఉన్న క్లియరింగ్ హౌస్‌లలో రూ. 20 వేల కోట్ల చెక్కుల లావాదేవీలు నిలిచిపోయాయని ఓ ప్రకటనలో ఏఐబీఈఏ వెల్లడించింది. 'బ్యాంకు అధికారులు సమ్మెలో పాల్గొనకపోయినా మాకు మద్దతు తెలిపారు. దాంతో బ్యాంకులు తెరిచి ఉన్నా..నగదు లావాదేవీలు, చెక్కుల క్లియరెన్సులు, గవర్నమెంటు ట్రెజరీ ఆపరేషన్లు, విదేశీ మారక లావాదేవీలు వంటి తదితర సేవల మీద ప్రభావం పడింది' అని తెలిపింది. రూ.13 లక్షల కోట్ల మొండి బకాయిలే బ్యాంకులకు అతిపెద్ద సమస్య అని ఆ యూనియన్ వెల్లడించింది. 21 బ్యాంకుల్లో 19 బ్యాంకులు నెట్ లాసెస్‌తో ఇబ్బంది పడుతున్నాయని తెలిపింది.

నష్టాల్లో దలాల్ స్ట్రీట్

- సెన్సెక్స్ 106, నిఫ్టీ 33 పాయింట్ల నష్టం
- లాభాల్లో టాటా మోటార్స్, టైటాన్ కంపెనీ షేర్లు
- నష్టాల్లో హెచ్‌పీసీఎల్ ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు



ముంబయి: వరుసగా మూడు రోజుల పాటు లాభాలతో కళకళలాడిన స్టాక్ మార్కెట్‌లో సూచీలు బేర్ మన్నాయి. గురువారం ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు ఆద్యంతం నష్టాల్లోనే కొనసాగాయి. అయితే నిఫ్టీ మాత్రం 10,800 మార్కును నిలుపుకోగలిగింది. త్రైమాసిక ఫలితాలు వెలువడబోతున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. రూపాయి విలువ బలహీనపడడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. సెన్సెక్స్ 50 పాయింట్లకు పైగా నష్టంతో ట్రేడింగ్‌ను ఆరంభించగా.. నిఫ్టీ 10,840 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. చివరకు సెన్సెక్స్ 106.41 పాయింట్ల నష్టంతో 36,106.50 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 33.60 పాయింట్ల నష్టంతో 10821.60 పాయింట్లకు చేరింది. ఎన్ఎస్ఈలో టాటా మోటార్స్, టైటాన్ కంపెనీ, ఐషర్ మోటార్స్, యూపీఎల్, ఎన్టీపీసీ తదితర కంపెనీల షేర్లు లాభపడ్డాయి. హెచ్‌పీసీఎల్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, భారతి ఇన్‌ఫ్రాటెల్, గ్రాసిమ్, ఐఓసీ తదితర కంపెనీల షేర్లు నష్టపోయాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.70.53 వద్ద ట్రేడవుతోంది.



పెరిగిన మారుతీ ఆల్టో 800,
ప్రీమియం ఎస్ క్రాస్ ధరలు

ఢిల్లీ: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ కార్ల ధరల పెంపుపై ప్రకటన చేసింది. కొన్ని మోడల్ కార్ల ధరలు రూ.10 వేల దాకా పెంచుతున్నట్లు వెల్లడించింది. పెరిగిన ధరలు గురువారం నుంచే అమలవుతాయని తెలిపింది. ముడి సరకు, విదేశీ మారకం రేట్లు పెరిగిన కారణంగా ధరలు పెంచాల్సి వచ్చినట్లు వెల్లడించింది. జనవరి 10 నుంచి ధరలు అమల్లోకి వస్తాయని స్పష్టంచేసింది. అయితే, ఏయే మోడల్ కార్లపై ధరలు పెరుగుతాయనేది మారుతీ వెల్లడించలేదు. ప్రస్తుతం మారుతీ సుజుకీ కార్ల మోడళ్లు ఆల్టో 800 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఆల్టో 800 నుంచి ప్రీమియం ఎస్‌క్రాస్ మోడల్స్ ధరలు రూ.2.53 లక్షల నుంచి రూ.11.45 లక్షల (ఎక్స్‌షోరూం ఢిల్లీ) దాకా ఉన్నాయి.

వైవాహిక బంధానికి గుడ్‌బై చెప్పిన అమెజాన్ సీఈఓ



వాషింగ్టన్: ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్ సీఈఓ జెఫ్ బెజోస్ సంచలన ప్రకటన చేశారు. ప్రపంచంలో అత్యంత సంపన్నుడైన ఆయన తన భార్య మెకంజీతో విడాకులు తీసుకుంటున్నట్లు తెలిపారు. 25 ఏళ్ల వైవాహిక బంధం తర్వాత వారు విడిపోవాలని నిర్ణయించుకున్నారు. సుదీర్ఘ కాలం ప్రేమతో జీవితాన్ని పంచుకున్న తాము పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నామని, తాము ఇక స్నేహితులుగా కొనసాగుతామని జెఫ్, మెకంజీ సంయుక్తంగా ట్వీట్ చేశారు. గత కొన్నేళ్లుగా మెకంజీ కంపెనీకి సంబంధించిన వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లేదు. కేవలం జెఫ్ దంపతులు నిర్వహించే కొన్ని సామాజిక కార్యక్రమాల్లో మాత్రమే కనిపిస్తున్నారు. ఈ ప్రకటనతో అమెజాన్‌లో వాటాదారులు, పెట్టుబడిదారులు షాక్‌కు గురయ్యారు. విడాకుల అంశం అమెజాన్ విషయంలో ఎలాంటి ప్రభావం చూపుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ వారంలోనే అమెజాన్ మైక్రోసాఫ్ట్‌ను దాటి ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా మారింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ల జాబితాలో బెజోస్ 137 బిలియన్ డాలర్ల సంపదతో తొలి స్థానంలో ఉన్నారు. ఇప్పుడు భార్యతో విడాకుల నేపథ్యంలో డబ్బు విషయంలో సెటిల్మెంట్లు జరిగితే బెజోస్ సంపద తగ్గుతుంది.

రెడ్‌మి నోట్ 7 వచ్చేసింది



బీజింగ్: షావోమి రెడ్ మి నోట్ సిరీస్‌లో మరో కొత్త డివైస్‌ను గురువారం విడుదలచేసింది. చైనా రాజధాని బీజింగ్‌లో నిర్వహించిన ఒక ఈవెంట్‌లో రెడ్ మి నోట్ 7ను లాంచ్ చేసింది. అంతేకాదు డిఫరెంట్ డిజైన్, డ్యూడ్రాప్ న్యాచ్‌తో షావోమి తొలి స్మార్ట్‌ఫోన్‌గా రెడ్‌మి నోట్ 7 నిలవనుంది. మూడు వేరియంట్లలో, బడ్జెట్ ధరల్లో వీటిని ఆవిష్కరించింది. దీంతో పాటు రెడ్మి నోట్ 7ప్రొను కూడా తీసుకొచ్చింది. ఈ స్మార్ట్‌ఫోన్‌లో ఒక్క కెమెరా తప్ప మిగిలిన ఫీచర్లన్నీ ఒకేలా ఉన్నాయి.

3జీబీ ర్యామ్/ 32జీబీ స్టోరేజ్ ధర : 10వేల రూపాయలు
4జీబీ ర్యామ్/ 64జీబీ స్టోరేజ్ ధర : రూ.12,500
6జీబీ ర్యామ్/64జీబీ స్టోరేజ్ ధర : రూ.14, 500

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో సేవ్‌థాన్ 10కే, 5కే రన్

- లోగో, టీషర్ట్ ఆవిష్కరించిన సినీనటుడు సందీప్‌కిషన్



విజయక్రాంతి, హైదరాబాద్: నగరంలో సామాజిక సంబంధిత సమస్యలను అధిగమించేలా ప్రజల్లో జాగృతి 'రన్ ఫర్ గ్రీన్' పేరిట హైదరాబాద్ నగర వ్యాప్తంగా 25,000 మొక్కలను పంపిణీ చేయనుంది. గురువారం బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో జరిగిన హెచ్‌డీఎఫ్‌సీ సేవ్‌థాన్ 10కే, 5కే రన్ లోగో, టీషర్ట్‌ను సినీనటుడు సందీప్‌కిషన్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కులో ఫిబ్రవరి 10న ఈ పరుగును నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సినీనటుడు సందీప్‌కిషన్ మాట్లాడుతూ పర్యావరణ రక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి నావంతు సహకారాన్ని అందిస్తానని అన్నారు. సహజ వనరులను, భూగోళాన్ని రక్షించేందుకు, వృక్షాలను కాపాడుకునేందుకు అందరం చేయీ, చేయీ కలిపాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటి హరితభవిష్యత్తుకు నాంది పలకాలని సూచించారు. హెచ్‌డీఎఫ్‌సీ దక్షిణ విభాగం బ్రాంచ్ విభాగాధిపతి మధుసూదన్ మాట్లాడుతూ పరిశుభ్రమైన, పచ్చని, సుస్థిర భవిష్యత్తు వైపు ప్రజలను నడిపించేందుకు 'రన్ ఫర్ గ్రీన్'ను ఈ ఏడాది సేవథాన్‌కు నేపథ్యంగా ఎంచుకున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు సందీప్‌కిషన్, మధుసూదన్, హెచ్‌డీఎఫ్‌సీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స



సీనియర్ నేషనల్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్

- డబుల్స్ విజేతలు ఆకుల శ్రీజ, నిఖత్ భాను

కటక్: సీనియర్ నేషనల్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ డబుల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయిలు ఆకుల శ్రీజ, నిఖత్ బాను జోడి టేబుల్ టెన్నిస్ డబుల్స్ టైటిల్‌ని ఎగురేసుకుపోయింది. ఫైనల్స్‌లో మహారాష్ట్ర కు చెందిన అనన్యా బసక్, శృతి హాలెంగడిపై 3–1తేడాతో ఘన విజయం సాధించి టైటిల్‌ని సాధించారు. అంతకు ముందు జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో హర్యానాకు చెందిన సుతీర్థ ముఖర్జీ, రితి శంకర్‌పై 3–2తేడాతో గెలుపొందగా , సెమీఫైనల్స్‌లో వెస్ట్ బెంగాల్ కి చెందిన ఆహిక ముఖర్జీ, ప్రాప్తిలపై 3–1తేడాతో గెలుపొందారు.

ఆసీస్ పర్యటన షెడ్యూల్ విడుదల చేసిన బీసీసీఐ



ముంబయి: సొంతగడ్డపై టీమిండియా ఆస్ట్రేలియాతో పోరుకు సిద్ధమవనుంది. భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు సంబంధించి షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది. ఈ పర్యటనలో టీమిండియా ఆస్ట్రేలియాతో రెండు టీ20లు, ఐదు వన్డే సిరీస్‌లు ఆడనుంది. ఫిబ్రవరి 24వ తేదీన బెంగళూరులో జరిగే తొలి టీ20తో సిరీస్ ఆరంభం కానుండగా, 27వ తేదీన విశాఖపట్నంలో రెండో టీ20 జరుగనుంది. మార్చి2వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ ఐదు వన్డేల సిరీస్ జరుగనుంది. మార్చి 2న తొలి వన్డే హైదరాబాద్‌లో, 5వ తేదీన నాగ్‌పూర్‌లో రెండో వన్డే, 8వ తేదీన రాంచీలో మూడో వన్డే, 10వ తేదీన మొహాలీలో నాలుగో వన్డే, 13వ తేదీన ఢిల్లీలో ఐదో వన్డే జరుగనున్నాయి. భారతకాలమానం ప్రకారం టీ20 మ్యాచ్‌లు రాత్రి 7.00 గంటలకు జరుగనుండగా వన్డే మ్యాచ్‌లు మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభం కానున్నాయి. తొలుత ఇరు జట్ల మధ్య వన్డే సిరీస్ జరిగే అవకాశం ఉందని భావించినప్పటికీ, టీ20లతో సిరీస్‌ను ఆరంభించనున్నారు. 2017లో భారత్‌లో చివరిసారి ఆసీస్ పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ ద్వైపాక్షిక సిరీస్‌లో ఐదు వన్డేల సిరీస్‌తో పాటు, మూడు టీ20ల సిరీస్ జరిగింది. ఐదు వన్డేల సిరీస్‌ను భారత్ 4–1 తేడాతో గెలవగా, టీ20 సిరీస్ 1–1తో సమం అయ్యింది.

బాక్సింగ్ రారాణి..మేరికోమ్

- ఆరోసారి ప్రపంచ నం.1గా మణిపూర్ ఆణిముత్యం



ఢిల్లీ: ప్రపంచ మహిళా బాక్సింగ్ చరిత్రలో గోల్డెన్ లేడీ ఎవరైనా ఉన్నారంటే.. అది కచ్చితంగా మణిపూర్ ఆణిముత్యం మేరీకోమ్ అనే చెప్పాలి. ఆమె ముందు దాసోహం కాని రికార్డు అంటూ లేకుండా దిగ్విజయంగా తన కేరీర్‌ని కొనసాగిస్తోంది. ఒక వైపు వయసు మీద పడుతున్నా ..ముగ్గురు పిల్లలకు తల్లి కూడా అయినా ..మేరీకోమ్ తనకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిన బాక్సింగ్‌ను వదలకుండా కఠోరంగా శ్రమిస్తూ..అనేక రికార్డులను బద్దలు కొట్టింది. తాజాగా ప్రపంచ బాక్సింగ్ అసోసియేషన్ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో మేరీకోమ్ మరోసారి ప్రపంచ నం.1 స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఆరు సార్లు నం.1 ప్రపంచ బాక్సింగ్ క్రీడాకారిణిగా రికార్డుల్లోకి ఎక్కింది. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో 48 కేజీల విభాగంలో అత్యంత విజయవంతమైన బాక్సర్ గా 2018లో చరిత్ర సృష్టించిన విషయం విధితమే.. ఇప్పుడు కొత్తగా విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో మొత్తం 1700 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది మేరీకోమ్. 36 ఏళ్ల ఈ బాక్సింగ్ ఛాంపియన్ 2020లో వచ్చే ఒలింపిక్స్ కోసం 51కేజీల విభాగంలో బరిలోకి దిగే అవకాశం ఉంది. ఎందుకంటే ఇప్పటి వరకు మేరీకోమ్ బరిలో దిగిన 48 కేజీల విభాగం వచ్చే ఒలింపిక్స్‌లో జాబితాలో లేకుండా పోయింది. దీంతో మేరీకోమ్ 51కేజీల విభాగంలో పోటీలోకి దిగనుంది. 218లో కామన్‌వెల్త్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్‌తో పాటు, పోలెండ్ టోర్నమెంట్‌లో కూడా గోల్డ్ మెడల్‌ని సాధించింది. ఇక బల్గేరియాలో జరిగిన స్ట్రాంజా మెమోరియల్ ఛాంపియన్ షిప్‌లో సిల్వర్ మెడ్‌ని కైవసం చేసుకుని బెస్ట్ బాక్సర్‌గా నిలిచిన విషయం విధితమే. 51కేజీల విభాగంలో పింకీ జంగ్రా ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఆసియా క్రీడల్లో రజతం సాధించిన మనీషా మౌన్ 54 కేజీల విభాగంలో ఎనిమిదో స్థానాన్ని కైవసం చేసుకుంది. 57 కేజీల విభాగంలో సోనియా లాథర్ రెండో స్థానంలో నిలిచింది. మరో బాక్సర్ సిమ్రంజిత్ కౌర్ 64 కేజీల విభాగంలో నాలుగో స్థానానికి చేరింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ ఎల్ సరితా దేవి 16 స్థానానికి పరిమితమైంది. ఇండియా ఓపెన్‌లో స్వర్ణాన్ని ముద్దాడిన లవ్లీనా 69కేజీల విభాగంలో ఐదో స్థానంలో నిలిచింది.



సిల్వర్ మెడల్ సాధించిన
మహ్మద్ బిన్ ఒస్మాన్

- నేషనల్ స్కూల్ గేమ్స్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్

విజయక్రాంతి, హైదరాబాద్: డామన్ అండ్ డైయులో జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణకు చెందిన 14 ఏళ్ల బాక్సర్ మహమ్మద్ బిన్ ఒస్మాన్ బలావాల్ 38–40 కేజీల విభాగంలో రజత పతకం సాధించాడు. హర్యానా కు చెందిన అక్షత్‌తో జరిగిన మెగా ఫైనల్స్‌లో బిన్ ఒస్మాన్ హోరాహోరాగా తలపడినా చివరి నిమిషంలో అక్షత్ తన పంచ్‌లకు పదును పెట్టడంతో 3–2 తేడాతో ఓటమి చవి చూశాడు. బిన్ ఒస్మాన్ బలావల్ హైదరాబాద్‌లోని ఆర్యా కన్యా విధ్యాలయా హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. శాట్స్ బాక్సింగ్ కోచ్ అయిన ఓంకార్ యాదవ్ దగ్గర శిక్షణ తీసుకుంటున్నాడు.

షో తెచ్చిన తంటా...

- కేఎల్ రాహుల్, హార్థిక్ పాండ్యలకు షాక్
- రెండు వన్డేల నిషేధం విధించాలన్న సీఓఏ ఛైర్మెన్
- బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రీకి మెయిల్ పంపిన వినోద్ రాయ్



ముంబయి: టీం ఇండియా క్రికెటర్లు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య ఓ షోలో పాల్గొని చేసిన వ్యాఖ్యల మీద వివాదం ముదురుతున్నట్లు కనిపిస్తోంది. వారిద్దరి మీద రెండు వన్డే మ్యాచ్‌ల నిషేధం విధించాలని పాలకుల కమిటీ(సీఓఏ) ఛైర్మన్ వినోద్ రాయ్ గురువారం సూచించారు. బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రీకి పంపిన మెయిల్ ల్లో ఈ ప్రతిపాదన చేశారు. ' షో సందర్భంగా వారిద్దరూ చేసిన వ్యాఖ్యలను ఈ రోజు పరిశీలించారు. అవి ఆమోదయోగ్యంగా లేవు. క్షమాపణలు ఆ తప్పును కప్పిపుచ్చలేవు. వారిపై ఎలాంటి పెనాల్టీ విధించాలో డయానాను అడిగాను. రెండు మ్యాచ్‌ల నిషేధం సరైందని భావిస్తున్నాను. దానికి డయానా అంగీకరిస్తే, రాహుల్ దానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించండి. అలాగే బీసీసీఐ కాంట్రాక్టు ఆటగాళ్లు, సిబ్బందికి విడిగా నిబంధనలను సిద్ధం చేయండి' అని దానిలో వెల్లడించారు. బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరించే షోలో పాల్గొన్న సందర్భంగా పాండ్య మహిళలనుద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారి తీశాయి. దానిలో పాల్గొన్న పాండ్య, రాహుల్‌కు బుధవారం బీసీసీఐ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విమర్శల నేపథ్యంలో పాండ్య ట్విటర్ వేదికగా క్షమాపణలు చెప్పాడు. 'హార్దిక్ వివరణతో నేను సంతృప్తి చెందలేకపోతున్నా. వారిద్దరి మీద రెండు మ్యాచ్‌ల నిషేధం విధించాలని సూచించా' అని రాయ్ వెల్లడించారు. సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జి ఈ వ్యవహారాన్ని బీసీసీఐ లీగల్ సెల్ దృష్టికి తీసుకెళ్లింది. అలాగే ఆమె బీసీసీఐ యాక్టింగ్ ప్రెసిడెంట్ సీకే ఖన్నా, యాక్టింగ్ సెక్రటరీ అమితాబ్ చౌధరీ, కోశాధికారి అనిరుధ్ చౌధరీ అభిప్రాయాన్ని కోరినట్లు తెలుస్తోంది.



అంతర్జాతీయ క్రికెట్‌కు ఆల్బీ మోర్కెల్ గుడ్‌బై

జోహన్నస్‌బర్గ్: దక్షిణాఫ్రికా అంతర్జాతీయ ఆల్ రౌండర్ ఆల్బీ మోర్కెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. దాదాపు రెండు దశాబ్దాల పాటు జట్టులో కొనసాగాడు. ఈ 37 ఏళ్ల ఫాస్ట్ బౌలర్ మోర్నీ మోర్కెల్‌కు సోదరుడు. సౌతాఫ్రికా తరుపున 58 వన్డే ఇంటర్నేషనల్, 50 ట్వంటీ20 మ్యాచ్‌లు, ఒక టెస్టు మ్యాచ్ ఆడాడు. ఈ ఆల్‌రౌండర్ అన్ని ఫార్మాట్లలో కలిపి 77 వికెట్లు పడగొట్టగా 1412 పరుగులు సాధించాడు. 'క్రికెట్ మైదానంలో నాకు సమయం పూర్తయ్యింది, ఆట నుండి నా విరమణ ప్రకటించాలని నేను కోరుకుంటున్నాను', నేను మైదానం బయట నుంచి ఆటను ఆస్వాదిస్తానని ఆల్బీ మోర్కెల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2008 ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు 6,75,000 డాలర్లకు కొనుగోలు చేసింది. తరువాతి సీజన్లలో ఢిల్లీ డేర్ డెవిల్స్, పూణే సూపర్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు తరుపున ఆడాడు.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.